# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

గురువారం, ఆగస్టు 28, 2014

**THURSDAY, THE 28TH AUGUST, 2014**

14వ శా.స. 2వ సమావేశం, వాల్యూం-3 నంబరు-3

**14TH L.A. II – SESSION, VOL—3 NO.-3**

శక సంవత్సరం-1936, భాద్రపద -6

**6-Bhadrapada, 1936 – S.E.**


శాసన సభ సచివాలయం

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు- 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | : | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | : | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా. వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

– – –

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
(రెండవ సమావేశము : తొమ్మిదవ రోజు )

**గురువారం, ఆగస్టు 28, 2014**
**సభ ఉ.గం.09.00.లకు ప్రారంభమైనది**
(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

--------------

## విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభా సమావేశం (ఉ.గం.9.00.) | ... | 5 |
| 2. | వాయిదా తీర్మానం-తిరస్కృతి (డ్వాక్రా ఋణాల మాఫీపైన శ్రీమతి ఉప్పులేటి కల్పన) | ... | 5-8 |
| 3. | నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు అంతరాయాల మధ్య సమాధానాల వాయిదా | ... | 8-13 |
| 4. | సభా కార్యక్రమం | | 13-15 |
| 5. | 26.08.2014న సస్పెండ్ అయిన వైసీపి సభ్యులు శ్రీ ఆర్.శివ ప్రసాద్ రెడ్డి మరియు శ్రీ ఎమ్.మణిగాంధీల సస్పెన్షన్ ఉపసంహరణకు రూల్ 340(2) క్రింద శాసనసభ వ్యవహారాల మంత్రి ప్రతిపాదన మరియు సభ ఆమోదం | ... | 15 |
| 6. | జీరో అవర్ | ... | 16-28 |
| 7. | ప్రభుత్వ ఆర్థిక పద్దులు (డిమాండ్లు) ఆమోదం నిమిత్తం సభ ముందు ఉంచుట | ... | 28&29 |
| 8. | ఆర్థిక ప్రతిపాదనలపై చర్చ మరియు సభ ఆమోదం | ... | 29-78 |
| 9. | సభ వాయిదా | ... | 78 |

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ
# హైదరాబాద్
# 28వ తేది గురువారం, 2014

* * *

(సభ ఉదయం 9.00 గంటలకు ప్రారంభమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

* * *

MR. SPEAKER: First, let me read out the notice given for Adjournment Motion.

ఈనాటి వాయిదా తీర్మానం:

డ్వాక్రా ఋణాల మాఫీపైన శ్రీమతి ఉప్పులేటి కల్పన మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడమైనది. Now, let us take up the Question Hour.

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి) : అధ్యక్షా...........

మిస్టర్ స్పీకర్: రోజా గారు మాట్లాడండి.

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): అధ్యక్షా, ఈ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చాలా గర్వంగా డ్వాక్రా మహిళా గ్రూపులు బ్యాంకుల నుండి తీసుకున్న ఋణాలను మాఫీ చేస్తామని ప్రజానీకానికి చెప్పడం జరిగింది.

MR.SPEAKER: When the Adjournment Motion is disallowed, there is no point in starting discussion on that. అడ్జర్న్‌మెంట్ మోషన్ తిరస్కరించబడినప్పుడు చర్చకు అవకాశం లేదు. కావాలంటే డిమాండ్స్ ఉన్నాయి, ప్రభుత్వం నుంచి రిప్లై ఉంటుంది. కాబట్టి అప్పుడు అంశాన్ని చర్చించండి.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి): సార్, దయచేసి అవకాశం ఇవ్వండి. డ్వాక్రా మహిళలు చాలా ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రకటన వస్తుందనే ఆశతో ఉన్నారు. దయచేసి మహిళా సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వండి.

మిస్టర్ స్పీకర్: ఒకసారి వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన తరువాత చర్చించడానికి అవకాశం లేదు. శ్రీకాంత్ రెడ్డి గారు మీరు గత శాసనసభలో కూడా సభ్యుడిగా ఉన్నారు.

తిరస్కరణకు గురైన వాయిదా తీర్మానం పైన చర్చకు అవకాశం ఇచ్చిన సందర్భాన్ని ఎప్పుడైనా మీరు చూశారా?

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): అధికారపక్షం గొప్పలు చెప్పుకోవడానికి గంటల తరబడి సమయాన్ని కేటాయిస్తారు గానీ, ప్రజా సమస్యలపైన చర్చకు అనుమతి ఇవ్వమంటే మాత్రం తిరస్కరిస్తారు. చాలా అన్యాయం సార్.

(ఆ సందర్భంగా ప్రతిపక్షపార్టీ సభ్యులు సర్వశ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి, యస్.అమర్‌నాథ రెడ్డి, కె.నారాయణస్వామి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, శ్రీమతి ఆర్.కె.రోజా, శ్రీమతి గౌరు చరితా రెడ్డి, శ్రీమతి వంతుల రాజేశ్వరి, శ్రీమతి ఉప్పులేటి కల్పన, శ్రీమతి వి.కళావతి తదితరులు వారి స్థానాల్లో నుంచి నిలబడి మాట్లాడే అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్: దయచేసి కూర్చోండి. No discussion on the subject please. దయచేసి సహకరించండి.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి): సార్, మీరే మాట్లాడమని మైక్ ఇచ్చారు. మాట్లాడే సమయంలో మళ్లీ మైక్ కట్ చేస్తున్నారు. దయచేసి మహిళా సభ్యురాలికి మాట్లాడే అవకాశం ఇవ్వండి.

MR.SPEAKER: No, she has started discussion on that. Even after disallowing the Adjournment Motion, she has started the discussion. If she wants to make a mention, she can do that. మీరు ఏమి చెప్పదలచుకున్నారో సూటిగా చెప్పండి.

(ఆ సందర్భంగా ప్రతిపక్షపార్టీ సభ్యులు సర్వశ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి, యస్.అమర్‌నాథ రెడ్డి, కె.నారాయణస్వామి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, శ్రీమతి ఆర్.కె.రోజా, శ్రీమతి గౌరు చరితా రెడ్డి, శ్రీమతి వంతుల రాజేశ్వరి, శ్రీమతి ఉప్పులేటి కల్పన, శ్రీమతి వి.కళావతి తదితరులు వారి స్థానాల్లో నుంచి నిలబడి మాట్లాడే అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

(ప్రతిపక్షపార్టీ సభ్యుల నుండి సభకు అంతరాయం)

MR.SPEAKER: Please be seated. Yes Roja garu..........

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): అధ్యక్షా, ఈ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో డ్వాక్రా మహిళా గ్రూపులు బ్యాంకుల నుంచి తీసుకున్న ఋణాలను పూర్తిగా మాఫీ చేస్తామని మహిళాలోకాన్ని నమ్మించింది.

MR.SPEAKER: Your Adjournment Motion is disallowed. What does it mean? She cannot start a discussion on that. Please resume your seats.

(ఆ సందర్భంగా ప్రతిపక్షపార్టీ సభ్యులు సర్వశ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి, యస్.అమర్‌నాథ రెడ్డి, కె.నారాయణస్వామి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, శ్రీమతి ఆర్.కె.రోజా, శ్రీమతి గౌరు చరితా రెడ్డి, శ్రీమతి వంతుల రాజేశ్వరి, శ్రీమతి ఉప్పులేటి కల్పన, శ్రీమతి వి.కళావతి తదితరులు వారి స్థానాల్లో బయలుదేరి పోడియం వద్దకు చేరి మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరుతూ నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కల్గించసాగారు)

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, మీరే మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. మళ్లీ మైక్ కట్ చేశారు. దయచేసి మాట్లాడే అవకాశం ఇవ్వండి.

MR.SPEAKER: She is misusing the opportunity. Please be seated. I do not allow the discussion. You have to come in a proper form. Your Adjournment Motion is disallowed. So, you cannot discuss on that subject. మీరు వెళ్లి మీ స్థానాల్లో కూర్చోండి. నేను చెబుతాను. You have to come in an appropriate form. Then I will allow. దయచేసి కూర్చోండి. రోజా గారు, మీరిచ్చిన అడ్జర్న్‌మెంట్ మోషన్ తిరస్కరణకు గురైంది. దయచేసి కూర్చోండి. When your Adjournment Motion is disallowed, there is no point in starting discussion on that.

ఈ సబ్జెక్ట్‌పైన డిస్కస్ చేయడానికి డిమాండ్స్ ఉన్నాయి. అప్రాప్రియేషన్ కూడా ఉంది. అప్పుడు కావాలంటే మాట్లాడండి. నేను అవకాశం కల్పిస్తాను. దయచేసి సహకరించండి. సభ సజావుగా జరిగేందుకు సహకరించండి.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: సార్, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వండి.

మిస్టర్ స్పీకర్: శ్రీకాంత్ రెడ్డి గారు, అడ్జర్న్‌మెంట్ మోషన్ డిస్‌అలౌవ్ అయిన తరువాత ఈ విధంగా గొడవ చేయడాన్ని మీరు ఎప్పుడైనా చూశారా? అంతగా డిస్కషన్ కావాలంటే, ప్రాపర్ ఫార్మ్‌లో రండి. నేను అలౌవ్ చేస్తాను. నేను అవకాశం ఇచ్చాను. కానీ సూటిగా చెప్పడం లేదు ఆమె. డిస్కషన్ చేసేందుకు రోజా గారు ప్రయత్నం చేస్తున్నారు. మీరు వెళ్లి మీ స్థానాల్లో కూర్చోండి. అవకాశం ఇస్తాను. రోజా గారు మాట్లాడండి.

(ప్రతిపక్షసభ్యులు పోడియం నుంచి వెళ్లి వారి వారి స్థానాలో కూర్చున్నారు)

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): అధ్యక్షా, ఈ ప్రభుత్వం డ్వాక్రా ఋణాల మొత్తం రూ.14,204.00 కోట్లు మాఫీ చేయడం జరుగుతుందని ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టారు.

MR.SPEAKER: No, Please be seated. You are going into the subject even after the motion got diallowed. Please be seated.

(ప్రతిపక్షపార్టీ సభ్యుల నుండి సభకు అంతరాయం)

(ప్రతిపక్షపార్టీ సభ్యులు మరొకసారి పోడియం వద్దకు చేరి మాట్లాడే అవకాశం కల్పించాలని నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కల్గించసాగారు)

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి) (మైక్ లేకుండా పోడియం వద్ద నిల్చొని) మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా మంది మహిళలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. మహిళా సమస్యలపైన సభలో మాట్లాడే అవకాశం కల్పించండి. మా గొంత నొక్కేసే ప్రయత్నం జరుగుతుంది. అధికార పక్షానికి మాట్లాడే అవకాశం గంటల తరబడి ఇస్తున్నారు. ప్రతిపక్షానికి మాత్రం మాట్లాడే అవకాశం కల్పించడం లేదు.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

**MR.SPEAKER: Question No. 4 (72) Minister for Panchayat Raj.**

**గౌరవనీయులైన పంచాయతీరాజ్ మరియు ఎన్.ఆర్.ఇ.జి.యస్. శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;**

అ) చిత్తూరు జిల్లాలోని పీలేరు నియోజకవర్గంలో గల ఆరు మండలాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకానికి (ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) సంబంధించిన నిధులను దుర్వినియోగపరచిన విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా;

ఆ) ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. క్రింద సదరు మండలాలలో చేపట్టిన పనులపై నామమాత్రపు సామాజిక ఆడిట్‌ను చేసిన విషయం కూడా ప్రభుత్వ దృష్టికి వచ్చిందా;

ఇ) దుర్వినియోగపరచిన నిధులను తిరిగి రాబట్టడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలేమిటి;

ఈ) పథకం నిధుల దుర్వినియోగానికి బాధ్యత గల ఫీల్డు అసిస్టెంట్లపై తీసుకోవాలని ప్రతిపాదించిన చర్య ఏమిటి?

**పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ మంత్రి (శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు) :**

అ) అవునండి.

ఆ) పీలేరు నియోజకవర్గంలోని అన్ని ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. మండలాలలో చేపట్టిన పనులపై సామాజిక ఆడిట్‌ను చేయడమయింది.

ఇ) డిడబ్ల్యుఎంఎ, ప్రాజెక్టు డైరెక్టరు నివేదించిన ప్రకారంగా రూ.31.51 లక్షల మొత్తాన్ని దుర్వినియోగమయినట్లుగాను, ఇందులో రూ.28.53లక్షలను రాబట్టు కోవడమయిందని, ఇంకా రూ.2.98లక్షలను రాబట్టవలసిన మిగులుగా ఉందని తెలియజేయడమయింది.

ఈ) సామాజిక ఆడిట్ ప్రస్తావించిన ఉల్లంఘనలు ఆర్థిక, కార్యవిధానానికి సంబంధించినవిగా వర్గీకరించడమయింది.

సామాజిక ఆడిట్ సమయంలో 174 మంది ఫీల్డు అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడినారని గుర్తించడమయింది. ఇప్పటి వరకు 160 కేసులలో క్రమశిక్షణ చర్యను ప్రారంభించడమయింది. వారిలో 17 మంది ఫీల్డు అసిస్టెంట్లను తొలగించడమయింది.

కార్యవిధాన లోపాలలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన 133 మంది ఫీల్డు అసిస్టెంట్లను స్వల్ప జరిమానాతో శిక్షించడమయింది. దుర్వినియోగపరచిన దానిలో రాబట్టవలసిన మొత్తం వచ్చినందున, కాంట్రాక్టు ఒప్పందాల ద్వారా వారు కొనసాగుతున్నారు.

మిగిలిన 14 కేసులలో క్రమశిక్షణ చర్య ప్రక్రియ ప్రగతిలో ఉన్నది.

* * *

మిస్టర్ స్పీకర్: చింతల రామచంద్రారెడ్డి గారు...........

శ్రీ చింతల రామచంద్రారెడ్డి(పీలేరు): అధ్యక్షా...........

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి: సార్, మహిళా సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించండి.

MR.SPEAKER: When an opportunity is given, she is misusing it. Please be seated. Chintala Ramachandra Reddy garu, if you do not ask supplementaries, we will go to the next Question. Please ask your supplementaries.

(INTERRUPTIONS FROM YSRCP MEMBERS)

It is quite improper. Please be seated.

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): మహిళలు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోని నమ్మి ఓట్లేస్తే నిట్ట నిలువున ముంచింది సార్, ఈ ప్రభుత్వం. దయచేసి మాట్లాడే అవకాశం కల్పించండి.

మిస్టర్ స్పీకర్: దయచేసి వెళ్లి కూర్చోండి. మీలో చాలా మంది సీనియర్ సభ్యులున్నారు. ఒకసారి అడ్జర్న్‌మెంట్ మోషన్ డిస్ అలౌవ్ అయిన తరువాత, మీరు ఈ విధంగా పోడియం వద్దకు చేరి అల్లరి చేయకూడదు. You please come in a proper form. I will allow for discussion. రామచంద్రారెడ్డి గారు మీరు సప్లిమెంటరీ క్రింద మాట్లాడండి.

శ్రీ చింతల రామచంద్రారెడ్డి: అధ్యక్షా, చిత్తూరు జిల్లా పీలేరు నియోజకవర్గంలో......

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా..........

మిస్టర్ స్పీకర్: గోపాలకృష్ణా రెడ్డి గారు దయచేసి కూర్చోండి.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత పోడియం వద్ద అంతరాయం కొనసాగింపు)

(పోడియం ముందున్న ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యులు డ్వాక్రా మహిళా గ్రూపుల రుణాలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి, డ్వాక్రా మహిళా గ్రూపులు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాల మాఫీపై మంత్రి గారు స్టేట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. )

MR.SPEAKER : It is quite improper. దయచేసి కూర్చోండమ్మా. మీలో చాలా మంది సీనియర్ శాసనసభ్యులు ఉన్నారు. వాయిదా తీర్మానం disallow అయిన తరువాత దీనిపై అల్లరి చేయకూడదు. బడ్జెట్‌పై మాట్లాడారు. డిమాండ్స్ ఉన్నాయి, అప్రాప్రియేట్ బిల్స్ ఉన్నాయి ఆ సందర్భంలో మాట్లాడండి. Now, question hour started. There is no point in interfering with the Business. Please do not interrupt the Business. Otherwise, you will lose your question also. You can put a question now.

(INTERRUPTIONS)

Your Adjournment Motion is disallowed. Please resume your seats.

(పోడియం ముందున ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యులు శ్రీమతి ఆర్.కె.రోజా ఇది టిడిపి ఆఫీసు లాగా ఉంది శాసనసభగా లేదు అన్నారు.)

మిస్టర్ స్పీకర్ : బడ్జెట్‌పై జగన్మోహన్ రెడ్డి గారు మాట్లాడారు. మీరు గుర్తు చేసుకోండి. డ్వాక్రా రుణాలు, బెల్టు షాపులు గురించి మాట్లాడారు. ఇంకా ఏం మాట్లాడుతారు. మీరు ఇంకా మాట్లాడాలంటే అవకాశం వస్తుంది. అప్పుడు మాట్లాడండి.

(పోడియం ముందున సభ్యురాలు శ్రీమతి జి.ఈశ్వరి మాట్లాడుతూ, (మైకు లేకుండా) ఎప్పుడు సార్? )

మిస్టర్ స్పీకర్ : మాట్లాడే అవకాశం డిమాండ్స్ మీద వస్తుంది. అప్రాప్రియేషన్ బిల్లు మీద వస్తుంది. కాల్ అటెన్షన్ వస్తుంది, రూల్ 344 వస్తుంది, క్వశ్చన్ అవర్ వస్తుంది. ఆ సమయాల్లో మాట్లాడండి. దయచేసి కూర్చోండి.

(పోడియం ముందున్న ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యులు రాజశేఖరరెడ్డి గారి కుటుంబాన్ని విమర్శించే వారికి మీరు సమయం ఇస్తున్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు మాకు సమయం ఇవ్వడం లేదు. అన్నారు. "ప్రజాసమస్యలపై చర్చించాలి. " "ప్రజాసమస్యలపై చర్చించాలి" "డ్వాక్రా మహిళా సంఘాల రుణాల మాఫీపై స్పష్టమైన హామీ ఇవ్వాలి" అంటూ నినాదాలు చేశారు.)

మిస్టర్ స్పీకర్ : గోపాల కృష్ణారెడ్డి గారు..

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి: అధ్యక్షా, వాయిదా తీర్మానంపై మాట్లాడటం మంచిదే. కానీ అలా కాదు, గలటా చేయాలనే వాయిదా తీర్మానం ఇచ్చారు. అది తప్పని చెబుతున్నాను. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కూడా కాలేదు. గత పది సంవత్సరాలుగా పనిచేశారు. అందులో పిల్ల కాంగ్రెస్, తల్లి కాంగ్రెస్ కానీ అందులోనూ కొంత మంది మంత్రులుగా, మరికొంతమంది శాసనసభ్యులుగా పనిచేశారు. అటువంటి వాళ్లు చెప్పాలి. అపోజిషన్ లీడరు 16 నెలలు జైల్లో ఉండి వచ్చారు. ఎందుకోసం ఉన్నారో చెప్పాలి. అసెంబ్లీకి స్టేట్‌మెంట్ ఇవ్వాలి.

(అంతరాయం )

వారెందుకు ప్రజాసమస్యలపై చర్చించలేదో చెప్పాల్సింది పోనిచ్చి సభ జరగకుండా అడ్డుకుంటున్నారు. 16నెలలు జైలులో ఎందుకు ఉన్నారో చెప్పాలి. లక్ష కోట్లు అన్నారు. పదివేల కోట్లు చూపిస్తే అందులో పదిశాతం ఇస్తామన్నారు అంటూ స్టేట్‌మెంట్ వచ్చింది. వాటన్నింటిపై సభలో చెప్పాలి. అదంతా ప్రజలసొత్తు. మీ చేతుల్లో ఉన్న ప్రజాసొమ్మును తీసుకొచ్చి సభలో ఉంచండి. డ్వాక్రా రుణాలు మాఫీ చేయవచ్చు. రైతుల రుణాలు మాఫీ చేయవచ్చు అన్నీ చేయవచ్చు.

మిస్టర్ స్పీకర్ : మీరు అల్లరి ఎందుకు చేస్తున్నారో చెప్పండి. వాయిదా తీర్మానం disallow అయిన తరువాత దానిపై చర్చ ఎలా జరుగుతుంది చెప్పండి. మీలో చాల మంది సీనియర్ సభ్యులు ఉన్నారు. చెప్పండి. When a subject is disallowed, there is no point in making noise. Please be seated. దయచేసి కూర్చోండి. ప్రాపర్ పద్ధతిలో రండి ఇంప్రాప్రర్ లో వస్తే ఎలా. you put a question. You can come in another form. You can come under Rule 74. 344 ఇవ్వచ్చు. There are a number of opportunities.

(At this juncture, YSRCP Members started raising slogans, 'we want justice, we want justice')

మిస్టర్ స్పీకర్ : బొండా ఉమా మహేశ్వర రావు గారు..

శ్రీ బొండా ఉమా మహేశ్వర రావు (విజయవాడ-సెంట్రల్): అధ్యక్షా...

("we want justice" "we want justice" "మహిళా సమస్యలపై మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలి". "మహిళా సమస్యలపై మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలి" అంటూ నినాదాలు కొనసాగింపు)

మిస్టర్ స్పీకర్ : జీరో అవర్‌లో ఇస్తాం కూర్చోండి, దయచేసి కూర్చోండి.

(INTERRUPTIONS CONTINUED)

MR.SPEAKER: Now, the House is adjourned for 10 minutes.

**(The House then adjourned at 9-15 a.m.)**

* * *

**(స్వల్ప విరామానంతరం సభ తిరిగి గం.10.44 ని.లకు సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్షస్థానం వహించారు.)**

**MR.SPEAKER: All questions are postponed.**

(ప్రతిపక్ష సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ గారు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరడం జరిగింది.)

మిస్టర్ స్పీకర్ః జ్యోతుల నెహ్రూ గారు..

శ్రీ జ్యోతుల నెహ్రు (జగ్గంపేట)ః అధ్యక్షా, మంగళవారం (26.08.2014) రోజున సస్పెండ్ కాబడిన సభ్యులను మీరు సభలోకి అనుమతిస్తే, వారు దానిపై వివరణ ఇవ్వటానికి సంసిద్ధంగా ఉన్నారనే విషయాన్ని మీకు తెలియజేస్తున్నాను.

MR.SPEAKER: Yes, Minister for Legislative Affairs.

శ్రీ యనమల రామకృష్ణుడు (ఆర్థిక శాఖా మంత్రి)ః అధ్యక్షా, క్షమాపణ చెప్పిన తర్వాత రివోక్ చేయండి అని నిన్ననే చెప్పాను. I would once again request the Hon'ble Speaker that the revocation may be done, after apology is being given by the respective suspended Members.

**MR.SPEAKER: Let, the suspended Members come into the House.**

**(సస్పెండ్ అయిన సభ్యులు శ్రీ ఆర్. శివప్రసాదరెడ్డి మరియు శ్రీ ఎం. మణిగాంధీ సభలోకి రావడం జరిగింది)**

మిస్టర్ స్పీకర్ః శివప్రసాదరెడ్డి గారూ.

శ్రీ ఆర్.శివప్రసాద రెడ్డి(ప్రొద్దుటూరు)ః అధ్యక్షా, ఈ సభలో నా నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మాట్లాడే అవకాశం వస్తుందని ఎదురుచుశాను. దురదృష్టవశాత్తు, సభలో ఈ రూపంలో మాట్లాడాల్సిన పరిస్థితి వచ్చింది. ఏది ఏమైనప్పటికీ సభా సాంప్రదాయాలకు, నియమనిబంధనలకు ఆటంకం కలిగించామనే ఉద్దేశంతో మంగళవారం

(26.08.2014) రోజు నన్ను, గౌరవ సహచర సభ్యుడు మణిగాంధీగారిని ఈ సభ నుంచి సస్పెండ్ చేయడం జరిగింది. ఏది ఏమైనప్పటికీ...

MR.SPEAKER: You know as to why you were suspended.

శ్రీ ఆర్. శివప్రసాద రెడ్డిః అధ్యక్షా, ఏది ఏమైనప్పటికీ సభా సాంప్రదాయాలకు భంగం కలిగించి, నియమనిబంధనలకు ఆటంకం కలిగించామనే ఉద్దేశంతో మా ఇద్దరినీ సస్పెండ్ చేయాలని చెప్పి, ఈ రాష్ట్ర ప్రభుత్వం వారి హక్కులను, అధికారాలను ఉపయోగించి, మీ ముందుకు తీసుకురావడం జరిగింది.

(అధికారపార్టీ నుంచి అభ్యంతరం)

స్పీకర్ సర్ చెబుతాను. నేను చెప్పటానికి సిద్ధంగా ఉన్నాను.

MR.SPEAKER: Please be brief. You tell the Chair what you want to tell.

(అధికారపార్టీ నుంచి అభ్యంతరం)

MR. SPEAKER: Please don't do such comments.

శ్రీ ఆర్.శివప్రసాద రెడ్డిః నేను చెప్పటానికి సిద్ధంగా ఉన్నాను అధ్యక్షా, నేను ఏ తప్పూ చేయలేదన్న అభిప్రాయంతో, నా ఆత్మసాక్షిగా నమ్ముతున్నప్పటికీ... స్పీకర్‌గా మీరు రూలింగ్ ఇచ్చిన తర్వాత, ఆ రూల్‌కి నేను బద్ధుడనై ఉండాల్సిన అవసరం ఉంది.

MR.SPEAKER: It is not the question of my Ruling. The entire House felt that you have committed mistake and violated the rules. You please come to the point. You have been given an opportunity, but you are taking that opportunity to tell that you have not committed any sort of mistake. You are telling that you have not violated the rules.

శ్రీ ఆర్.శివప్రసాద రెడ్డిః అధ్యక్షా, ఏది ఏమైనప్పటికీ, నా ద్వారా సభా సంప్రదాయాలకు భంగం కలిగించినట్లయితే నన్ను క్షమించండి.

మిస్టర్ స్పీకర్ః మణిగాంధీగారు..

శ్రీ ఎం.మణిగాంధీ (కోడుమూరు): అధ్యక్షా, మేం ఉద్దేశపూర్వకంగా అయితే చేయలేదు. గౌరవ సభాపతిగారిని మైకు ఇవ్వమని అడిగాం. చేయి తగిలింది, మాదేమైనా తప్పు ఉంటే క్షమించండి.

**MR.SPEAKER: Yes, Minister for Legislative Affairs.**

**Sri YANAMALA RAMAKRISHNUDU: Sir, with your permission, I beg to move:**

**"That under Sub Rule (2) of Rule 340 of the Rules of Procedure and Conduct of Business of the AP Legislative Assembly, the suspension may be revoked in the case of the following Members, as directed by the Chair:**

**1. Shri R Siva Prasad Reddy,**

**2. Sri M. Mani Gandhi".**

**MR. SPEAKER: Motion Moved.**

**Now, the question is:**

**"That under Sub Rule (2) of Rule 340 of the Rules of Procedure and Conduct of Business of the AP Legislative Assembly, the suspension may be revoked in the case of the following Members, as directed by the Chair:**

**1. Shri R Siva Prasad Reddy,**

**2. Sri M. Mani Gandhi."**

**(Pause)**

**The motion was adopted and the suspension was revoked, as directed by the Chair.**

**Now we will go to the Zero Hour.**

# జీరో అవర్

డా. కె. అప్పలనాయుడు (గజపతినగరం): అధ్యక్షా, నాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదములు. నా నియోజకవర్గం గజపతినగరంలో విజయరామ కోఆపరేటివ్ షుగర్స్' అనే షుగర్ ఫ్యాక్టరీ ఉంది. దానిని 1977లో స్థాపించారు. ఈ షుగర్ ఫ్యాక్టరీ మీద దాదాపు 18 మండలాల్లో, 540 మంది రైతులు ఆధారపడి, క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. దురదృష్టవశాత్తు గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు సరైన సమయంలో, సకాలంలో మద్దతు ధర ఇవ్వకపోవడం వల్ల చెరకు రైతులు తీవ్రంగా నష్టపోయారు.

మన రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాలు చాలా వెనుకబడిన ప్రాంతాలుగా, కరువు జిల్లాలుగా కూడా ఉన్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మరియు మోసపూరిత హామీల వలన రైతులు నష్టపోయారు. మా షుగర్ ఫ్యాక్టరీలకు సరైన నిధులు మంజూరు చేయక, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడం వలన, మా రైతుల అవసరాలను తీర్చే పరిస్థితిలో ఆ ఫ్యాక్టరీ లేదని చెప్పడానికి నేను చాలా బాధపడుతున్నాను. రైతు ప్రయోజనాలను కాపాడడం కోసం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి, మన ప్రియతమ నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి గారు 9రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన సంగతి మనందరికీ తెలిసినదే.

కాబట్టి, అధ్యక్షా, రైతుల ప్రయోజనాలను కాపాడడానికి, 543 గ్రామాల రైతులను ఆదుకొనేవిధంగా విజయరామ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ కోసం నిధులను మంజూరు చేయగలరనీ, అదేవిధంగా సాంకేతిక నిపుణుల నియామకాలు చేపట్టే అవకాశం కల్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, చెప్పిన విషయాలు నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధిత మంత్రిగారికి తెలియజేస్తాము.**

శ్రీమతి గౌరు చరితా రెడ్డి (పన్యం): ధన్యవాదాలు అధ్యక్షా. మన రాష్ట్ర విభజన సందర్భంలో తెలంగాణ రాష్ట్రంలో గోదావరి నది బోర్డు ఏర్పాటు చేసుకోవాలనీ, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కృష్ణానది బోర్డు ఏర్పాటు చేసుకోవాలని చట్టం చేయడం జరిగింది. అధ్యక్షా, మా కర్నూలు జిల్లాలో కృష్ణానది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయవలసిందిగా కోరుతున్నాను. కృష్ణానది, మరియు దాని ఉపనదులైన తుంగభద్ర, హంద్రీ వంటి నదుల పుట్టుక మరియు ప్రవాహము మా కర్నూలు జిల్లా ఎగువ ప్రాంతంలోనే ఉంది. అంతేకాక, నీటి పంపిణీ ప్రధాన కార్యాలయం, శ్రీశైలం రిజర్వాయర్ కూడా మా కర్నూలు జిల్లాలోనే ఉంది. రాయలసీమ, చెన్నై, నెల్లూరు వంటి ప్రదేశాలకు మంచినీటి పథకాల మూల నియంత్రణ వ్యవస్థ

కూడా కర్నూలు జిల్లాలోనే ఉంది. కృష్ణానది కర్నూలు జిల్లాకు సమాంతరంగా ప్రవహిస్తోంది. ఆర్.డి.ఎస్., సుంకేసుల, జూరాల ప్రాజెక్టులు కర్నూలుకు దగ్గరలో ఉన్నాయి. తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలు కూడా కర్నూలు జిల్లాకు ఆనుకునే ఉన్నాయి. కాబట్టి, మేము కుంద్రేవుల ప్రాజెక్టు, పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్, జూరాల-పాకాల కాలువ, వంటివన్నీ కూడా కర్నూలుకు దగ్గరలోనే ఉన్నాయి. చెక్‌డ్యామ్‌లు కూడా కర్నూల్ జిల్లాలో ఉన్నాయి. కృష్ణానది యాజమాన్య బోర్డుకి కావలసిన ఆఫీసులు కూడా కర్నూలు జిల్లాలో ఉన్నాయి. కాబట్టి, కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయవలసిందిగా మీద్వారా ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాము.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు (మైలవరం): అధ్యక్షా, చెప్పిన విషయాలు నోట్ చేసుకోవడం జరిగింది. తదుపరి చర్యలు తెలియజేస్తాము.**

శ్రీ గద్దె రామమోహన్ (విజయవాడ-ఈస్ట్): అధ్యక్షా, నా నియోజకవర్గంలోని మూడు జూనియర్ కాలేజీల గురించి ప్రస్తావించడం కొరకు, ముఖ్యంగా నేను ఈ అవకాశం కోరడం జరిగింది.

నా నియోజకవర్గంలో కృష్ణలంక ప్రాంతంలో మధ్యతరగతి, దానికంటే దిగువ తరగతి ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతం. దాదాపు 35 సంవత్సరాల నుంచి జూనియర్ కాలేజీలు కావాలని అక్కడి ప్రజలందరూ కోరుకుంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ 3నెలల కాలంలో మన గౌరవ మంత్రివర్యులు గంటా శ్రీనివాసరావు గారి సహకారంతో, టెలిగ్రాఫిక్ ఆర్డర్స్‌తో జూనియర్ కాలేజీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. దానికి నేను మంత్రివర్యులకీ, ముఖ్యమంత్రివర్యులకీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. అక్కడి ప్రజలందరూ కూడా ఎంతో సంతోషించి, అన్ని వార్డుల్లో ఊరేగింపుగా తిరిగి పిల్లలని అక్కడ చేరమని చెప్పారు. పిల్లలందరూ కూడా చేరారు. లెక్చరర్స్‌ని అప్పాయింట్ చేయడంలో కొంచెం ఆలస్యమవుతుండడం వల్ల పిల్లలు నిరాశకు లోనవుతున్నారు. ఎక్కడైనా సర్‌ప్లస్ లెక్చరర్స్ ఉంటే వారిని గానీ, లేదా కాంట్రాక్టు లెక్చరర్స్‌ని తీసుకోవడం ద్వారా గానీ, మా జూనియర్ కాలేజీకి లెక్చరర్స్‌లేని లోటును భర్తీ చేయాలనీ, అంతేకాకుండా, ప్రక్కనే ఉన్న కాలేజీల్లో నుంచి ప్రస్తుతానికి ఒక గంట, రెండు గంటల చొప్పున లెక్చరర్స్‌ని డిప్యూట్ చేసినట్లైతే, విద్యా సమయం వృథా కాకుండా, పిల్లలు చదువుకోగలుగుతారని, కాబట్టి ఈ విషయమై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను. అదేవిధంగా వారు కూర్చోడానికి సరైన బల్లలు లేవు. అదేవిధంగా కాలేజీ కట్టేందుకు వీలుగా సుమారు 5ఎకరముల స్థలం సిద్ధంగా ఉంది. కాలేజ్ బిల్డింగ్ కట్టించవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, చెప్పిన విషయాలు నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధిత శాఖామంత్రికి తెలియజేస్తాము.**

శ్రీమతి వి.కళావతి (పాలకొండ)ః అధ్యక్షా, నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. మాది పాలకొండ నియోజకవర్గం. మాది పూర్తిగా గిరిజన నియోజకవర్గం. మా గిరిజనులు, గిరిజనేతరులు అందరూ పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నవారమే. మాకు నాగావళి, వంశధార నదుల ద్వారా సాగునీరు అందుతోంది. దానికి తోటపల్లి ప్రాజెక్టు నుండి కుడి, ఎడమ కాలువల ద్వారా నీరందుతుంది. దానికి 1902వ సంవత్సరంలోనున్న పాత కాలువల ద్వారానే 40,000 ఎకరాలకు 1416 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది. 1902 నుండి రెవిన్యూ రీకన్‌స్ట్రక్షన్ రివైజ్ చేయని కారణంగా, అదనంగా 25,000 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగిన కారణంగా, 8వ బ్రాంచ్ టెయిల్ ఎండ్‌కు సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాబట్టి, సుమారు 70,000ల ఎకరాలకు సరిపడే విధంగా రెవిన్యూ రీకన్‌స్ట్రక్షన్ రెయిజ్ చేయడం వలన, సాగునీరు అందడమే కాకుండా, నీటిపన్ను రూపంలో రెవిన్యూ కూడా వస్తుంది. ఆ రెవిన్యూని కూడా సంబంధిత ఆర్.డి.ఓ. గారు నీటిపారుదల శాఖకు బదిలీ చేయకపోవడం వలన కూడా ఈ కాలువ పనులు చేయలేకపోతున్నారు. అదేవిధంగా, ఆధునికీకరణ కోసం శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు రూ.30కోట్లు మంజూరు చేసినప్పటికీ, శ్రీ కొణిజేటి రోశయ్య గారు శంకుస్థాపన చేసినప్పటికీ, 5సంవత్సరాలు గడుస్తున్నా కాలువ పనులు ప్రారంభం కాలేదు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ కాలువకు బెడ్ కాంక్రీటుతోపాటు, వాల్ కన్‌స్ట్రక్షన్ చేస్తూ ఆధునికీకరణ చేయడం ద్వారా, నీరు బాగా ప్రవహించి, దానితోపాటు మధుమల పరిణామం పెంచి, ప్రజల అవసరాలకు ఇస్తే, దాని క్రిందకు కూడా నాలుగు చెక్ డ్యాములు కట్టించడం వలన టెయిల్ ఎండ్ వరకు నీరు వస్తుంది. ఆవిధంగా మా ప్రాంత ప్రజలకు న్యాయం చేసిన వారవుతారు. జంపర్ కోటలో మినీ జలాశయం 1988లో నిర్మించదలచారు. 15 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కానీ, నేటివరకు నిర్మించలేదు. నాలుగైదు కోట్ల రూపాయల వ్యయంతో గిరిజన ప్రాంతాల్లో నిర్మించ తలపెట్టిన మినీ జలాశయాలు కూడా పూర్తి కాలేదు. మా మండలంలో వంశధార ఫేజ్-2 క్రింద కరకట్టల నిర్మాణం జరగలేదు. నేరడి-బి మండలంలో ఒరిస్సా నుండి సారాబడి గ్రామంలో, కరకట్టలు రాళ్ళతో కట్టడం వల్ల అవి మేటలు, కోతలకు గురవుతూ మూడు గ్రామాల ప్రజలు చాలా తీవ్రంగా నష్టపోతున్నారు.

**శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావుః అధ్యక్షా, చెప్పిన విషయాలు నోట్ చేసుకోవడం జరిగింది. తప్పకుండా చర్యలు తీసుకుంటాము.**

శ్రీ టి.జయరాములు (బద్వేల్) ః అధ్యక్షా, సభకు, మీకు నా నమస్కారము. నా నియోజకవర్గంలో శ్రీ అవధూత కాశినాయన పుణ్యక్షేత్రముంది. రోజుకు 1,500 నుండి 2,000

మంది దర్శనానికి వస్తూంటారు. సంవత్సరానికి ఒకసారి ఆరాధనోత్సవాలు జరుగుతాయి. అపుడు 3లక్షల నుండి 4లక్షల భక్తులు హాజరవుతారు. పూర్వం ఇది నరసింహ క్షేత్రముగా పిలువబడేది. డిసెంబర్ 6, 1995లో కాశినాయన తాత మరణించిన తరువాత అక్కడ కార్యక్రమాలు జరగడం మొదలైయ్యాయి. ఆ పుణ్యక్షేత్రానికి వెళ్ళడానికి రోడ్డు మార్గం లేదు. దేవాదాయ శాఖ ఆ పుణ్యక్షేత్రాన్ని స్వాధీనం చేసుకొని, అర్థాంతరంగా ఆగిపోయిన పనులను పూర్తి చేయవలసిందిగా తమరి ద్వారా మంత్రి గారిని కోరుకుంటున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాం. సంబంధిత శాఖామంత్రి గారికి తెలియజేస్తాం.**

శ్రీ ఏలూరు సాంబశివరావు (పార్చుర్)ః అధ్యక్షా, సభలో మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. నా నియోజకవర్గం వ్యవసాయాధారిత నియోజకవర్గం. అక్కడున్న ప్రజలు నూటికి తొంభై మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అక్కడ నాగార్జున సాగర్, కొమ్మమూరు కాలువ చివరిలో, ఆయకట్టు చివర ప్రాంతం కావడం వల్ల ఎంతో కష్టపడి వ్యవసాయం చేస్తున్నారు. వారిని ఆదుకోవడం, అభివృద్ధి చేయడం కోసం నాలుగు విషయాలు మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకురాదలచుకున్నాను.

ఈ ప్రాంతంలో ప్రత్తి, శనగ, మొక్కజొన్న, మిరప ఎక్కువగా సాగు చేస్తారు. ఈ పంటలకు సంబంధించిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నియోజకవర్గ హెడ్‌క్వార్టర్ అయిన పర్చూరులో ఇండస్ట్రియల్ అగ్రికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తే కొంత ప్రగతి సాధించే అవకాశముంది. ఒక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఇవ్వడం ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశముంటుంది. కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటుచేయడం ద్వారా పరిశోధనా ఫలితాలు రైతాంగానికి చేరే అవకాశముంటుంది. అలాగే కూరగాయలు ఎక్కువగా పండించే మార్టూరు పరిసర ప్రాంతాలలో వెజిటబుల్ ప్యాక్ హౌజ్‌ని, కోల్డ్ స్టోరేజ్‌ను కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేయడం ద్వారా రైతాంగానికి ఎక్కువగా ఉపయోగముంటుంది. మంత్రిగారు ఈ విషయాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాం. సంబంధిత శాఖామంత్రి గారికి తెలియజేస్తాం.**

శ్రీ పి.నారాయణమూర్తి (గన్నవరం)ః అధ్యక్షా, సభలో మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు నమస్కారములు. 2013-14 సంవత్సరానికి ఎస్సీ సంక్షేమ నిధులు మా నియోజకవర్గానికి కేటాయించారు. ఎస్సీ కార్పోరేషన్ నుంచి రాజీవ్ యువశక్తి క్రింద లోన్ కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ కూడా అనుమతినిచ్చి బ్యాంకులకు

వెళ్ళమన్నారు. బ్యాంకు వారు పూచీ ఇవ్వమంటున్నారు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గంలో ష్యూరిటీ ఎక్కడి నుంచి వస్తుంది? 2013-14 సంవత్సరంలో ఇదే విధానాన్ని కొనసాగించారు. గత ప్రభుత్వం ఆ నిధులను హుస్సేన్‌సాగర్‌లో పూడిక తీయడానికి, రోడ్డు ప్రక్కన మొక్కలు నాటడానికి ఉపయోగించారే తప్ప దళితవర్గాలకు ఏ విధంగా ఉపయోగించలేదు. దానిపై సంబంధిత అధికారిపై, మంత్రిపై తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

2013-14 సంవత్సరంలో హౌసింగ్ కింద ఎస్సీలకు కేటాయించిన ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ఎస్సీ, ఎస్టీలకు నిర్మించే గృహాలకు ఆ మొత్తాన్ని రూ.1,50,000/-లకు పెంచడం జరిగింది. అదే విధంగా భవిష్యత్తులో ఇళ్లు ఇంకా కేటాయించే అవకాశం ఉందా అని అడుగుతున్నాను.

**శ్రీ రావెల కిశోర్ బాబు (ప్రత్తిపాడు): అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు చెప్పిన విషయాలన్నీ నోట్ చేసుకున్నాం. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాలు, సూచనలు, సలహాలు పాటించి తగు చర్యలు తీసుకుని హరిజనులు, గిరిజనుల సంక్షేమానికి పాటుపడతాం.**

శ్రీ పి.డేవిడ్ రాజు (ఎర్రగొండపాలెం): అధ్యక్షా, ఈ రాష్ట్రంలోనున్న ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన చాలా సున్నితమైన అంశం నేను ప్రస్తావించబోతున్నాను. ఈ రోజు ప్రశ్నల రూపంలో మంత్రిగారిని అడిగాను. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల విషయంలో మంత్రిగారు లిఖితపూర్వక సమాధానంలో 4300 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వాస్తవానికి రాష్ట్ర విభజన జరిగిన తరువాత రాష్ట్రంలోనున్న ఉద్యోగుల వివరాలు, ఖాళీల వివరాలు సేకరించడానికి, రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగాలను పంపిణీ చేయడానికి కమలనాథన్ కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించిన విషయం అందరికీ తెలుసు. రాష్ట్ర కేడర్ పోస్టులు, సెక్రటేరియేట్‌లోని పోస్టులు మొత్తం కలిసి 20,630 పోస్టులు ఖాళీలు ఉన్నాయని వారు నివేదిక ఇచ్చారు. 21-08-2014వ తేదీన ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు ఈ పోస్టులు పంపిణీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఖాళీల వివరాలు ప్రకటించేటప్పుడు ఎన్ని ఎస్సీ, ఎస్టీ పోస్టులున్నాయని గుర్తించకుండా కేవలం అంకె మాత్రమే ప్రకటించారు. దీనివల్ల రాష్ట్రంలోనున్న ఎస్సీ, ఎస్టీలకు చాలా అన్యాయం జరిగే అవకాశముంది. 20,630 ఖాళీలలో దాదాపు 15,000 ఎస్సీ, ఎస్టీ ఖాళీలున్నాయని మాకు తెలిసింది. దళిత ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగ యువకులు ఎంతో ఆందోళనతో ఉన్నారు. దయచేసి మంత్రి గారు ఈ విషయంపై దృష్టి సారించి ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగకుండా ఎస్సీ, ఎస్టీ ఖాళీలను వారికే కేటాయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రి గారిని మనవిచేస్తున్నాను.

**శ్రీ రావెల కిశోర్ బాబుః అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాం. వాటిపై తగిన చర్యలు తీసుకుంటాం.**

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం-నార్త్)ః అధ్యక్షా, సభకు, మీకు నమస్కారములు. ప్రస్తుతం ఇసుక లేక కన్‌స్ట్రక్షన్ యాక్టివిటీ మొత్తం రాష్ట్రంలో ఆగిపోయింది. ఇసుక రీచ్‌లను ఫైనలైజ్ చేయనందుకు బ్లాక్ మార్కెటింగ్ విపరీతంగా మూడు రెట్లు పెరిగిపోయింది. దీని విధివిధానాలు నిర్ణయం కాకపోతే, అంతవరకు ఎంఆర్ఓ నుంచి అనుమతి తీసుకొని ప్రయివేట్ వ్యక్తులకు, ప్రభుత్వం చేసే పనులకు ఇసుక వచ్చే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాం. సంబంధిత శాఖామంత్రి గారికి తెలియజేస్తాం.**

శ్రీ జి.వి.అంజనేయులు(వినుకొండ)ః అధ్యక్షా, వినుకొండ నియోజకవర్గంలో గుంటూరు జిల్లా జోన్1కి నాగార్జున సాగర్ నుంచి నీటిని నిన్న విడుదల చేశారు. చాలా సంతోషకరమైన విషయం. దీనివల్ల రైతాంగానికి చాలా ప్రయోజనాలు చేకూరుతాయి. సకాలంలో నీటిని విడుదల చేసినందుకు మంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జోన్1 మైలు రాయి 83 వరకు ఉంది. జిల్లా మొత్తానికి మా నియోజకవర్గంలోని ఒక మండలం మాత్రమే జోన్1లో కవర్ అవుతుంది. అదే మైలు రాయి 85 వరకు జోన్1లో కలిపినట్లైతే ఆ నియోజకవర్గంలోని మిగిలిన మండలాలు కూడా జోన్1 క్రింద వస్తాయి. అలాగే గుంటూరు జిల్లా మొత్తం జోన్1 క్రింద వస్తుంది. ఇలా చేయడం వల్ల పంట దిగుబడి పెరుగుతుంది. గతంలో జోన్2లో ఇచ్చినపుడు పంట దిగుబడి తగ్గింది. ఈ విషయాన్ని మంత్రిగారు పరిశీలించాలని కోరుతున్నాను.

ఇంకొక విషయం అధ్యక్షా, గుళ్లపల్లి మండలం దొమ్మర్ల గొంది గ్రామంలో లక్ష ఎకరాలకు సాగునీటిని అందించేందుకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఒక ప్రాజెక్టుకు ఆలోచన చేయడం జరిగింది. కానీ, ఆ తరువాత వచ్చిన ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారు వరికపూడిశిల దగ్గర కేవలం ఐదు వేల ఎకరాలకు సాగు నీరందించడానికి ఒక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం జరిగింది. కానీ, దానిని ఏ మాత్రం పట్టించుకోలేదు. అందువల్ల ఈ దొమ్మర్ల గొంది ప్రాజెక్టు అంశాన్ని పునఃపరిశీలన చేసినట్లయితే లక్ష ఎకరాలకు సాగు నీరందించే అవకాశముంది. అట్లాగే బొల్లాపల్లి మండలంలో తాగు నీరు లేదు. ఈ ప్రాజెక్టును కనుక చేపట్టినట్లయితే బొల్లాపల్లి మండలానికి తాగు నీరు మరియు దుర్గి మండలానికి తాగునీరు, లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ విధంగా రెండింటికి కూడా తాగునీరు, లక్ష ఎకరాలకు సాగునీరు అందించే అవకాశముంటుంది. కాబట్టి ఆ

అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రకృతి వనరులను ఉపయోగించుకొని రెండింటికి ఉపయోగించుకునే విధంగా మంత్రి గారు తగిన ఆలోచనతో నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. తప్పకుండా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.**

డాక్టర్ ఎస్.రామానాయుడు (పాలకొల్లు): అధ్యక్షా, అవకాశం కల్పించినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో వరిని అత్యధికంగా పండించే జిల్లాలలో పశ్చిమ గోదావరి జిల్లా ఒకటి అని అందరికీ తెలుసు. అటువంటి జిల్లాలో గత పది సంవత్సరాలుగా రైతులు ఎవరు కూడా వ్యవసాయం చేయలేని పరిస్థితి గ్రామాల్లో నెలకొని ఉంది. దానికి ప్రధాన కారణాలు గత పది సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలు మరియు ప్రకృతి విధించిన శాపం. ప్రకృతి శాపం వల్ల రైతులు పంట పొలాలు ఏవైతే నష్టపోయారో వారికి నష్ట పరిహారం అందించాలని మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు గతంలో తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టి నిరవధిక నిరాహార దీక్షలు జరిపిన సంగతి మనందరికీ తెలుసు. ఆ సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రిగారు ఎకరానికి నాలుగు వేల రూపాయల ఇన్‌పుట్ సబ్సిడీ నష్ట పరిహారంగా ఇస్తామని ప్రకటించడం జరిగింది. అయితే 2012లో పశ్చిమ గోదావరి జిల్లాలో వచ్చిన నీలం తుఫానుకు సంబంధించి కేవలం నూటికి 75 మందికి మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ అందింది. మిగిలిన వారికి ఎకౌంట్ నెంబర్స్ ట్యాలీ కాలేదన్న కారణంగానో లేకపోతే పేర్లు రిపీట్ అయ్యాయన్న కారణంతోనో అందలేదు. ఆ విధంగా ఇన్‌పుట్ సబ్సిడీ అందకుండా పోయిన పశ్చిమ గోదావరి జిల్లా రైతాంగానికి వెంటనే అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి తెలియజేస్తాను.**

శ్రీ బగ్గు రమణ మూర్తి (నర్సన్నపేట): అధ్యక్షా, మా నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు పశు పెంపకం, గొర్రెల పెంపకం మీద ఆధారపడి తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు. అయితే గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలవల్ల తగిన సంఖ్యలో పశు వైద్యులను నియమించకపోవడం వల్ల చాలా చోట్ల పశువైద్యుల కొరత ఉంది. నాలుగు సెంటర్లకు ఒక వైద్యుడున్నాడు. అట్లాగే పశు వైద్యశాలల్లో దిగువస్థాయి సిబ్బంది కూడా లేనందువల్ల రైతులు తమ పశు సంపదను కోల్పోయి తీవ్రంగా నష్టపోవడంతోపాటు అనేక ఇబ్బందులెదుర్కొంటున్న పరిస్థితి వుంది. దానిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, కాంట్రాక్టు

విధానంలో అయినా పశు వైద్యశాలల్లో అవసరమైన పశు వైద్యులను, సిబ్బందిని నియమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి తెలియజేయడం జరుగుతుంది.**

శ్రీమతి ఉప్పులేటి కల్పన (పామర్రు)ః అధ్యక్షా, నా నియోజకవర్గంలో కూచిపూడి గ్రామం ఉంది. అది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కళాక్షేత్రం. ఆ కళా పీఠం చుట్టూ వున్న గ్రామ కంఠంభూమి, చెరువు, ఆర్అండ్బీకి సంబంధించిన దాదాపు ఐదు ఎకరాల భూమిని ఆక్రమణ చేసుకున్నారు. ఆ ఆక్రమణలను తొలగించాలని గత 15/20 సంవత్సరాలుగా ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఆ ఆక్రమణలు తొలగిపోలేదు. ఆ ఆక్రమణల వల్ల అంతర్జాతీయ కేంద్రం స్థాయికి ఎదగాల్సిన కూచిపూడి కళాక్షేత్రం. ఆ అదృష్టానికి నోచుకోలేకపోయింది. కేంద్ర ప్రభుత్వం సహాయంతో వంద కోట్ల రూపాయల వ్యయంతో కృష్ణా, అనంతపూర్ జిల్లాలలోని మెగా టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించడం జరిగిందని చెప్పారు. అందులో ఈ కూచిపూడి కళాక్షేత్రం అభివృద్ధి కూడా ఉందా అని నేను మంత్రి గారిని అడుగుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, గౌరవ సభ్యురాలు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి తెలియజేస్తాను.**

శ్రీ మహమ్మద్ ముస్తఫా (గుంటూరు-ఈస్ట్)ః అధ్యక్షా, అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అట్లాగే సభ్యులందరికీ నమస్కారాలు తెలియజేస్తున్నాను. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి కోస్తాంధ్రలోనే అత్యంత పేరుగాంచిన ఆసుపత్రి. దాని చుట్టుపక్కల వున్న నాలుగు జిల్లాలలోని ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలనందిస్తున్నది. ఎన్నో దశాబ్దాలు గడచినా అక్కడ వైద్య సదుపాయాలు ఇంకా మెరుగుపడలేదు. కొత్తగా నిర్మించిన మిలీనియం బ్లాకులో వైద్య పరికరాలు లేనందున అన్ని విభాగాలలో మెరుగైన వైద్య సేవలందించలేకపోతున్నారు. వీటికి సుమారు ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేయాల్సిన అవసరమున్నది. అదేవిధంగా మిలీనియం బ్లాకులో 500కేవీలతో రెండు జనరేటర్లను మంజూరు చేయవలసివుంది. అలాగే ఆసుపత్రికి కిచెన్ భవన నిర్మాణం చేపట్టవలసి వుంది. ఆ ఆసుపత్రికి నిత్యం మూడు నుంచి నాలుగు వేల మంది రోగులువస్తుంటారు. ప్రస్తుతం అక్కడ 1177 పడకలున్నాయి. వాటిని ఇంకా ఐదు వందల వరకు పెంచాల్సిన అవసరమున్నది. అదేవిధంగా కాన్పుల వార్డులో తగిన పడకలు లేనందు వలన బాలింతలను, శిశువులను కిందే పడుకోబెట్టే పరిస్థితి వున్నది. ఆ ఆసుపత్రిలోని ఇబ్బందులను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి తెలియజేస్తాను.**

శ్రీ కలమట వెంకటరమణ మూర్తి (పాతపట్నం)ః అధ్యక్షా, అసెంబ్లీలో మొట్టమొదటిసారిగా మాట్లాడడానికి అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు. పాతపట్నం నియోజకవర్గానికి సంబంధించి కొత్తూరు మండలంలో 2006లో పెనుగోటివాడ గ్రామ కరకట్టకు సుమారు ఐదు వందల మీటర్ల మేర గండి పడింది. దాని వల్ల సుమారు ఐదు వందల ఎకరాల మేర భూమి ఇసుకమేటలు వేసింది. దానిపై ప్రభుత్వాలు ఇంతవరకు స్పందించలేదు. దాని వల్ల మాతల, పెనుగోటివాడ, వీరనారాయణపురం, కుద్బిగాం, మాతవరం తదితర గ్రామాలు ప్రతి సంవత్సరం వరదలవల్ల భూములు ముంపునకు గురవుతున్నాయి. ముఖ్యంగా జూలై నుంచి సెప్టెంబర్ వరకు పెనుగోటివాడ, మాతల గ్రామాల ప్రజలు పూర్తిగా ప్రాణభయంతో వుండాల్సిన పరిస్థితులున్నాయి. ముఖ్యంగా ఈ పెనుగోటి వాడ గ్రామమయితే వరదలొస్తే గ్రామం చుట్టూ నీరు చేరిపోయి ఒక ద్వీపంలాగా వుంటుంది. అందువల్ల నేను గౌరవ మంత్రి గారిని మీ ద్వారా ఆ కరకట్టకు పడిన గండ్లను వెంటనే పూడ్చి మా పెనుగోటివాడ గ్రామ ప్రజల ప్రాణాల్ని, భూముల్ని కాపాడాలని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావుః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాను. తప్పకుండా తగు చర్యలు తీసుకుంటాను. సభ్యులకు తెలియజేస్తాను.**

శ్రీ గౌతు శ్యామ సుందర శివాజి (పలాసా)ః సర్, ఇది జీరో అవర్‌కు సంబంధించిన అంశం. జీరో అవర్‌కున్న ప్రాధాన్యత మీకు తెలియంది కాదు. సభ్యులు ఏ నోటీసు ఇవ్వకుండానే వాళ్ల తాలూకు సమస్యల గురించి సభలో ప్రస్తావించడానికి సభ్యులకు మీరిచ్చే అవకాశం ఇది. గతంలో సభ్యులు ప్రస్తావించిన అంశాన్ని మంత్రులు నోట్ చేసుకొని పిదప దానిమీద యాక్షన్‌కు సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్ వచ్చేది. అటువంటి అక్నాలెడ్జ్‌మెంట్లు ఇప్పుడు రావడం లేదు. అలాంటి అక్నాలెడ్జ్‌మెంట్లు గనుక వస్తే సభ్యులు దానిపై సంబంధిత అధికారుల వద్ద ఫాలో అప్ చేసుకోవడానికి అవకాశముంటుంది. జీరో అవర్‌లో ప్రస్తావించిన అంశాలకు సంబంధించి సభ్యులందరికీ అక్నాలెడ్జ్‌మెంట్లు తప్పనిసరిగా అందేలా చేయమని మీకు నా తాలూకు జీరో అవర్ రిక్వెస్ట్.

మిస్టర్ స్పీకర్ః కరెక్టే శివాజి గారూ, ఇక్కడ రెండు పార్టీలకు కూడా మ్యాక్జిమమ్ నంబరాఫ్ జీరో అవర్ మెన్షన్స్‌కు అవకాశమిస్తున్నాము. అంతేకాదు అసెంబ్లీ సమావేశాలు మొదలు కాకముందు కూడా అధికార యంత్రాంగాన్ని మొత్తం పిలవడం జరిగింది. జీరో అవర్ మెన్షన్స్ కావచ్చు, క్వశ్చన్స్ కావచ్చు, పిటీషన్స్ కావచ్చు మీరు స్టిపులేటెడ్ టైమ్‌లో వాటిని పంపించమని చెప్పడం జరిగింది. I request the Ministers who are noting the Zero

Hour mentions to refer the matters to the concerned Ministers and the concerned Officers of the particular departments.

శ్రీ పల్లా శ్రీనివాసరావు(గాజువాక)ః అధ్యక్షా, మొట్టమొదటిసారిగా నాకు ఈ సభలో మాట్లాడే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. ప్రభుత్వ పాఠశాలలను, ఆసుపత్రులను రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికి వెళ్లి చూసినా అక్కడ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా ఒక ప్రణాళిక అంటూ లేకుండా జరుగుతున్నాయి. మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేదేమంటే ఒక ఆర్కిటెక్చర్ ఫర్మ్‌ను నియమించి ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులు, కోర్టు భవనాల, ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణానికి సమగ్రమైన ప్రణాళిక సిద్ధంచేసి ఆ ప్రణాళిక అమలయ్యేలా చూడాలని కోరుతున్నాను. ప్రభుత్వం నుంచి విడుదల కాగానే ఒక భవనం నిర్మాణం చేస్తారు, తదుపరి నిధులు రాగానే మరొక నిర్మాణం చేస్తారు. ఆ విధంగా అక్కడ అందుబాటులో ఉన్న స్థలం అంతా అర్థం, పర్థం లేకుండా చేస్తున్నారు. తద్వారా పుట్టగొడుగుల్లా భవనాలు వెలుస్తున్నాయి. భవనాల నిర్మాణంలో ఒక మంచి ప్రణాళికతో, ఎలివేషన్ వచ్చేటట్లు దశలవారీగా భవనాలు అభివృ ద్ధి చేసినా, నిర్మించినా ప్రణాళికాబద్ధంగా ఉండేట్లు చేస్తే మంచిదని నా ఉద్దేశం. మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేదేమంటే, మంచి ఆర్కిటెక్చర్ ఫర్మ్‌ను అపాయింట్ చేయాల్సిందిగా కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథరెడ్డిః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి తెలియజేస్తాను.**

శ్రీ అరిమిల్లి రాధాకృష్ణ (తణుకు)ః అధ్యక్షా, మొట్టమొదటిసారిగా ఈ సభలో మాట్లాడే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు స్వీపర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా చాలా జిల్లాలలో కన్వర్షన్ చేయడం జరిగింది. కానీ పశ్చిమ గోదావరి జిల్లాలో ఇంతవరకు ఆ జీవోను అమలుచేయలేదు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథరెడ్డిః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి తెలియజేస్తాను.**

శ్రీ వి.ప్రభాకర్ చౌదరి (అనంతపురం-అర్బన్)ః అధ్యక్షా, 1996లో శ్రమదానం అనే మహోద్యమంలో భాగంగా జన్మభూమి కాన్సెప్ట్ కింద మా నియోజకవర్గంలో 72 ఎకరాలలో పార్కును ఏర్పాటు చేశాం. ప్రముఖ సంఘసేవకులు శ్రీ అన్నా హజారే గారు కూడా ఆ పార్కును సందర్శించి ప్రశంసించారు. కానీ ఆ పార్కు ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. ప్రభుత్వం దానిలో కొంత భాగాన్ని శిల్పారామం ఏర్పాటు చేయడానికి కేటాయించాలని ఆలోచిస్తున్నట్లుగా

తెలుస్తోంది. ఆ పార్కు మొత్తం 72 ఎకరాలను శిల్పారామానికి తీసుకొని ప్రభుత్వం నుంచి విడుదల చేసి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథరెడ్డిః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి తెలియజేస్తాను.**

శ్రీ ఎం.మణిగాంధీ(కొడుమూరు)ః అధ్యక్షా, మా కోడుమూరు నియోజకవర్గంలో కర్నూలు నుంచి బళ్లారి రహదారి మొత్తం మోకాలి లోతు గుంతలు పడ్డాయి. ఇటీవల సాధారణ ఎన్నికల తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇప్పటికి 25 మంది చనిపోయారు. ఇటీవల భార్యాభర్తలు ద్విచక్ర వాహనం మీద వెళుతూ గుంతలో పడి రోడ్డుపై పడిపోతే వెనుక వచ్చిన లారీ కింద పడి చనిపోయారు. ఆ రోడ్డు స్థితిని పట్టించుకొనే నాథుడే లేడు. పులకుర్తి ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు పెద్దలు సూర్యప్రకాశ్ రెడ్డి గారు ప్రాజెక్ట్ ప్రాంతానికి వెళ్లకుండా కర్నూలులోనే శంకుస్థాపన కార్యక్రమం చేశారు. కావున మంత్రి గారు చర్యలు తీసుకొని పులకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని, కర్నూలు-బళ్లారి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావుః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. తదుపరి చర్యలు తెలియజేస్తాను.**

శ్రీ జలీల్ ఖాన్(విజయవాడ-వెస్ట్)ః అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగిన తరవాత మన రాష్ట్రంలో ఉన్న జనాభాకు దామాషా ప్రకారం బడ్జెట్‌ను కేటాయించాలి. ప్రస్తుత బడ్జెట్‌లో మైనారిటీ శాఖకు కేటాయించినది రూ.370కోట్లు మాత్రమే. జనాభా ప్రాతిపదికన చూస్తే 0.62శాతం మాత్రమే ఉంది. కనీసం ఒక శాతం బడ్జెట్ కూడా కేటాయించలేదు. ఇది మా కర్మ అనుకుంటాం. మీ ద్వారా మంత్రి గారిని కోరేదేమంటే, గత ఏడాది ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాల బకాయిలు రూ.137కోట్లు ఉన్నాయి. ప్రస్తుత సంవత్సరం ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాలకు రూ.110కోట్లు అవసరముంది. రెండూ కలిపితే సుమారు రూ.250కోట్లు అయింది. కానీ మైనారిటీ శాఖకు కేటాయించిన బడ్జెట్ మొత్తం రూ.370కోట్లు మాత్రమే. ఆ మొత్తం ఆ శాఖ అవసరాలకు ఏ విధంగా సరిపోతుందో తెలియడం లేదు. అట్లాగే ఈ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సుమారు 2500, 2200 హాస్టళ్లు చొప్పున ఉంటే ముస్లీం మైనారిటీలకు రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లు కేవలం 25 మాత్రమే ఉన్నాయి. అదే విధంగా సంక్షేమ శాఖలలో ఉద్యోగుల విషయానికి వస్తే, ఎస్సీలు దాదాపు నాలుగువేలు, బీసీలు దాదాపు ఆరు వేలు ఉంటే ముస్లిం మైనారిటీ సెక్షన్‌లో కేవలం 180 మంది మాత్రమే ఉద్యోగులున్నారు. అది కూడా డెప్యుటేషన్‌పై ఇతర శాఖల నుంచి తీసుకొన్న పరిస్థితి ఉండడం చాలా బాధాకరంగా ఉంది. అదే విధంగా బ్యాంకుల నుంచి రుణాల కోసం ముస్లిం మైనారిటీలు 29,000 మంది దరఖాస్తు చేసుకుంటే అందుకోసం బడ్జెట్‌లో కేటాయించినది కేవలం రూ.15కోట్లు మాత్రమే.

MR.SPEAKER: Jaleel Khan garu, raise the issue and tell. No speeches.

శ్రీ జలీల్ ఖాన్(విజయవాడ-వెస్ట్): అధ్యక్షా, నా డిమాండ్ ఏమిటంటే, మా నియోజకవర్గంలో ఒక్క నర్సరీ స్కూలు కూడా లేదు. అలాగే పి.ఇ.టి. కళాశాల కూడా లేదు. ముస్లిం మహిళలు ఆర్థిక ఇబ్బందులలో ఉన్నారు. మా నియోజకవర్గంలో అలాగే పి.ఇ.టి. కళాశాల, నర్సరీ స్కూలు ఏర్పాటు చేయాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. అలాగే ముస్లిం మైనారిటీలకు సబ్‌ప్లాన్‌ను రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. సచార్ కమిటీ రిపోర్టులోని సిఫార్సులను అమలు చేయాలని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథరెడ్డి: అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. తగు చర్యలు తీసుకొని తెలియజేస్తాను.**

శ్రీ బూరుగుపల్లి శేషారావు(నిడదవోలు): అధ్యక్షా, పశ్చిమ గోదావరి జిల్లా ప్రధానంగా డెల్టా ప్రాంతం. సర్ ఆర్థర్ కాటన్ గారు, అలాగే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు మా జిల్లాకు సాగునీటి వసతి బాగా కల్పించారు. తద్వారా గోదావరి జలాలను జిల్లా ప్రజలు పూర్తిగా వినియోగించుకుంటున్నారు. కానీ గత ప్రభుత్వం గోదావరి డెల్టా ఆధునికీకరణ కింద చేపట్టిన పనులు పొందిన కాంట్రాక్టు సంస్థలు శాశ్వత నిర్మాణాలు వదలిపెట్టాయి. కొన్ని ఏజెన్సీలు అనగా హయగ్రీవ కన్‌స్ట్రక్షన్స్, ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్స్, ఐవిఆర్‌సిఎల్ సంస్థలు వారికి లాభదాయకమైన పనులు మాత్రమే చేసి మిగిలిన వాటిని వదలివేశారు. మీ ద్వారా నీటిపారుదల శాఖ మంత్రికి తెలియజేసేదేమంటే వంద సంవత్సరాల క్రితమే సర్ ఆర్థర్ కాటన్ మాకు ఒక వరాన్ని ఇచ్చారు. దానిని మరలా ఇవాళ కూడా కొనసాగించి రాబోయే తరాలకు కూడా అందించి మనమందరం ఆదర్శవంతంగా ఉండాలి. మా నియోజకవర్గంలో చూసే కానూరు ఛానల్ కింద ఆరు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే పెండ్యాల పంపింగ్ పథకం కూడా ఉంది. ఆ రెండు పనులను ఈపిసీ విధానంలో చేపట్టినచో లాభదాయకం కాదని వాటిని కాంట్రాక్టర్లు చేయకుండా వదలివేశారు. ఆ పనులు నాన్-ఈపీసీ విధానంలో చేపట్టి పనులు పూర్తి చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు: అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. తదుపరి చర్యలు తెలియజేస్తాను.**

శ్రీ బొండా ఉమామహేశ్వరరావు (విజయవాడ-సెంట్రల్): అధ్యక్షా, పెనమలూరు నియోజకవర్గంలో రవీంద్ర భారతి హైస్కూలు ఉంది. నేను చెబుతున్న అంశాన్ని మానవత్వంతో చూడాలి. 2006వ సంవత్సరంలో నాలుగు, ఐదు, ఆరు తరగతులు చదువుతున్న 12 సంవత్సరాల లోపు పసిపిల్లలను కీసర బ్రిడ్జి దగ్గరకు పాఠశాల యాజమాన్యం ఎక్స్‌కర్షన్‌కు తీసుకెళ్లింది. ఆ సందర్భంలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినందున నీటిలో

పడి 16 మంది పసిపిల్లలు చనిపోయారు. దాని మీద అప్పటి తెలుగుదేశం పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి శ్రీ గద్దె రామ్మోహన్ గారు, మేమూ కలిసి పెద్ద ఉద్యమం చేశాం. ఆ పిల్లల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని హ్యూమన్ రైట్స్ కమీషన్ కూడా తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. కానీ అప్పుడున్న ప్రభుత్వ సహకారంతో అప్పుడున్న ఎంఎల్ఏ సహకారంతో ఇవాల్టి వరకూ ఎలాంటి చర్యలూ ఆ స్కూలు మీద చేపట్టలేదు. ఈరోజుకి కూడా సత్యనారాయణపురంలో ఉన్న రవీంద్రభారతి స్కూలు ఒక్క రోజు కూడా స్కూలు మూసేయకుండా, నష్ట పరిహారం చెల్లించకుండా పిల్లల తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. ఏడెనిమిది సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటం వలన ఎవరూ ఆ తల్లిదండ్రుల బాధను పట్టించుకోలేదు. స్కూలు యాజమాన్యం డబ్బులిచ్చి మేనేజ్ చేసుకున్నారు. ఆ స్కూలు మీద తక్షణం చర్యలు చేపట్టి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించేలా ఆదేశాలివ్వాలని ఈ సభ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రికి తెలియచేస్తాను.**

* * *

**MR.SPEAKER: Now, moving of Demands. Yes, Minister for Irrigation.**

**SRI DEVINENI UMAMAHESWARA RAO (Minister for Irrigation): On behalf of the Minister for Transport and Roads and Buildings, Sir, with your permission, I beg to move:**

**"That the Government be granted a sum not exceeding Rs.2683,93,37,000/- under Demand No. XI (11)- Roads, Buildings and Ports."**

**SRI DEVINENI UMAMAHESWARA RAO (Minister for Irrigation): Speaker Sir, I beg to move:**

1. **"That the Government be granted a sum not exceeding Rs. 7913,94,13,000/- under Demand No. XXXIII (33) - Major and Medium Irrigation."**

**2. "That the Government be granted a sum not exceeding Rs.551,48,52,000/- under Demand No. XXXIV(34) -Minor Irrigation.**

**SRI PALLE RAGHUNATHA REDDY (Minister for Information and PR): On behalf of the Chief Minister: Speaker Sir, with your permission, I beg to move:**

**"That the Government be granted a sum not exceeding Rs.7163,77,78,000/- under Demand No. XXXV(35)- Energy."**

**MR. SPEAKER: Demands moved. Now, discussion on Demands.**

శ్రీ కూన రవికుమార్(ఆముదాలవలస)ః అధ్యక్షా, ఈరోజు బీసీల సంక్షేమం పైన, ఈ రాష్ట్రంలో ఉన్న అణగారిన వర్గాలకు ఈ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల పైన మాట్లాడే అవకాశం ఒక బీసీగా నాకు వచ్చినందుకు ఈ సభ ద్వారా మీకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. ఆనాడు అన్న నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటి నుంచే ఈ రాష్ట్రంలో ఉన్న బీసీలకు స్వర్ణయుగం ప్రారంభమైందని ఈ సభ ద్వారా అందరి దృష్టికి తీసుకువస్తున్నాను.

1983వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతనే ఈ రాష్ట్రంలో ఉన్న బీసీలు, బడుగు, బలహీన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా, సాంఘికంగా అన్ని రంగాల్లో కూడా ముందుకు తీసుకువచ్చింది. బీసీలకు పెద్దయెత్తున అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ, అన్న నందమూరి తారక రామారావు గారని ఈ సందర్భంగా మీదృష్టికి తీసుకువస్తున్నాను. ఆనాడు రాజకీయాల్లోకి రావాలంటే బాగా డబ్బులున్న వాళ్లు రావాలి. లేదా ఎవరైనా ముందున్న వర్గాల వాళ్లు రావాలి. రాజకీయాల్లో అవకాశాలు రాలేదని బాధపడుతున్న ఆ సందర్భంలో అన్న నందమూరి తారకరామారావుగారు ఎంతో మంది బలహీన వర్గాల వారికి, ఎంతో మంది చదువుకున్న వారికి ఆనాడు అవకాశాలు కల్పించారు. ఈరోజు వివిధ పార్టీల్లో ఉన్నటువంటి ఇదే శాసన సభలో చాలా స్థానాల్లో కూర్చున్న వ్యక్తులు కూడా ఆనాడు నందమూరి తారక రామారావు గారు తయారు చేసిన వ్యక్తులు, ఈరోజున కూడా సభలో ఉన్నారని నేను చెప్పడానికి గర్వపడుతున్నాను.

ఆనాడు అప్పటి వరకూ బీసీలకు ఈ రాష్ట్రంలో సరైన గుర్తింపు లేదు. ఎన్నో అవమానాలు, ఎన్నో అఘాయిత్యాలు.... అప్పుడున్న ఆంధ్ర రాష్ట్రంలో బీసీల కోసం అణగారిన వర్గాల కోసం, చేనేత వృత్తుల వారి కోసం, కుల వృత్తుల కోసం పోరాటం చేసింది స్వర్గీయ

గౌతు లచ్చన్న గారని ఈ సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ఆనాడు గౌతు లచ్చన్న గారు బీసీల కోసం ఏవిధంగా పోరాడారో ఆయన చేపట్టిన ఉద్యమాన్ని తెలుగుదేశం పార్టీని స్థాపించడం ద్వారా తెలుగుదేశం పార్టీ పేదల కోసం, బీసీల కోసం ఎప్పుడూ అండగా ఉంటుందని, బీసీల్లో ఉన్న అణగారిన వర్గాన్ని బయటకు తీసుకురావడానికి ఎన్‌టిఆర్ గారు కృషి చేశారని చెప్పకతప్పదు. ఆనాడు బీసీల అభ్యున్నతి కోసం, వారి జీవన ప్రమాణాలను పెంచడం కోసం 1986 లో మురళీధరరావు కమీషన్‌ను ఏర్పాటు చేశారు. మురళీధరరావు కమీషన్ చేసిన సిఫారసులన్నింటినీ యధాతథంగా అమలు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీ, నందమూరి తారకరామారావు గారికి దక్కుతుందని చెప్పక తప్పదు. బీసీలకు స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి మొట్టమొదటిగా ఈ భారతదేశంలోనే 20శాతం రిజర్వేషన్లు కల్పించింది తెలుగుదేశం పార్టీ అని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. అంతేకాదు బీసీల కోసం, బీసీ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి తద్వారా ఈ సమాజంలో ఎవరైతే బీసీలుగా అణగదొక్కబడుతున్న అణగారిన వర్గాలకు ఆర్థిక సహాయం చేయాలని, స్వయంప్రతిపత్తిగా బీసీలు కూడా వారి కాళ్లమీద వారు నిలబడాలని ఆనాడు బీసీ కార్పోరేషన్‌ని ఏర్పాటు చేసింది తెలుగుదేశం పార్టీ అని ఈ సందర్భంగా ఈ సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

కాంగ్రెస్ ప్రభుత్వం 1951వ సంవత్సరంలో భారతదేశంలో బీసీల కోసం కకోళ్కర్ కమీషన్‌ను ఏర్పాటు చేసి కూడా వారిచ్చిన సిఫారసులను అమలు చేయలేదు. కాంగ్రెస్ పార్టీ ఏనాడు కూడా ఈ దేశంలో గానీ, ఈ రాష్ట్రంలో గానీ, బీసీలను అణగదొక్కే కార్యక్రమాలు చేపట్టారు తప్ప ఏనాడూ బీసీలను సమానంగా గౌరవించలేదు. ఇప్పుడున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 50శాతం ఉన్న బీసీ జనాభాని గౌరవించి రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా చేయూతనిచ్చి ముందుకు నడిపించే కార్యక్రమం గత 50, 60 సంవత్సరాల చరిత్రలో కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీలను గుర్తించే కార్యక్రమాన్ని చేయలేదని ఈ సభ ద్వారా మీదృష్టికి తీసుకువస్తున్నాను. కేంద్రంలో అధికారంలో ఉన్న జనతా ప్రభుత్వం 1978వ సంవత్సరంలో మండలి కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ మండలి కమీషన్ ఇచ్చిన సిఫారసులను తరువాత కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదు.

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్‌టి రామారావు గారు ఆనాడు నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి, నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా వారి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం మండల కమీషన్ సిఫార్సులను అమలు చేయడం వలన కేంద్రంలో ఓబీసీలకు 27 శాతం ఉద్యోగాల్లో రిజర్వేషన్ లభించిందని తెలియజేస్తున్నాను. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే, కాంగ్రెస్ పార్టీ ఏనాడు కూడా రాష్ట్రంలో గానీ, దేశంలో గానీ ఎప్పుడు కూడా, బీసీలను అణగద్రొక్కే కార్యక్రమాలను మాత్రమే చేపట్టింది. ఎప్పుడు కూడా బీసీలను రాజకీయంగా పైకి తీసుకొచ్చే కార్యక్రమాలను చేపట్టలేదు. బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ముందుకు తీసుకెళ్లే

కార్యాక్రమాలను రూపొందించలేదు. కేవలం తెలుగుదేశం పార్టీ ఒక్కటే ఈ రాష్ట్రంలో ఉన్న బీసీల కోసం, అణగారిన వర్గాల కోసం, అల్పసంఖ్యాక వర్గాల కోసం ఎప్పుడు కూడా కృషి చేసిందని మనవి చేస్తున్నాను. ఆనాడు ఎన్‌టి రామారావు గారి ఆధ్వర్యంలో తెలుగుదేశం ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ చేసిన కార్యక్రమాలను ఈ సభ ద్వారా సభ్యులందరి దృష్టికి తీసుకొస్తున్నాను. అంతేకాదు ఆనాడు యుపీఏ ప్రభుత్వంలో, గతంలో ఉన్న మన్మోహన్ సింగ్ గారు ఒక చట్టాన్ని చేశారు. కేంద్రంలో ఉన్న విద్యా రంగంలోనే కాదు, విద్యా, ఉద్యోగ రంగాల్లో 27శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పారు. కానీ, ఆ చట్టం అమల్లోకి రాలేదు. దానికి కారణం, దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ నేటి వరకు ఎంత మంది బీసీలు ఉన్నారో, ఆ బీసీ కులాల జనగణన కూడా చేయించని ఈ దౌర్భాగ్యపు పరిస్థితికి కారణం కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వమని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. రిజర్వేషన్లను కల్పిస్తామనే భ్రమలు కల్పించి, అల్పసంఖ్యాక వర్గాలను అణగద్రొక్కాలనే ఒకే ఒక్క ఆలోచనతో చట్టాలను చేస్తున్నామనే ముసుగులో, ఆ చట్టాలను చేస్తున్న క్రమంలోనే కొన్ని లోపాలను పెట్టి అవి కోర్టుల్లో నిలిచిపోయే విధంగా చేసిన పరిస్థితులు ఉన్నాయి.

ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు కావని తెలిసి కూడా, ఈ శాసనసభలో ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, నాలుగు శాతం రిజర్వేషన్‌ను కల్పించి, అది కోర్టులో మురిగిపోయే విధంగా ఆనాడు చట్టాలను చేశారు. ఇది దుర్మార్గమైన ఆలోచన. ఆనాడు ఉన్న ప్రభుత్వానికి తెలుసు, ఒక రిజర్వేషన్ కార్యక్రమాన్ని అమలు చేయాలంటే, వారి తాలూకు సంఖ్యాబలం ఎంత ఉందో గణన చేయాలి, లెక్కలు చూపించాలి, వాటి ఆధారంగా, రేపు చట్ట ప్రకారం అమలయ్యే విధానాన్ని చూపిస్తూ చట్టసభల్లో చట్టాలను చేయాలి. కానీ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా ఆ సామాజిక వర్గాలను అణగద్రొక్కాలనే ఆలోచనతో, ముస్లిం మైనారిటీల ఓట్లను దండుకోవడానికి, వారి ఓట్ల కోసం వారి వైపు చూస్తున్నారు తప్ప, నిజంగా వారికి ఏనాడు కూడా చట్టసభల ద్వారా సరైన న్యాయం చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చేయలేదని ఈ సభ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మరి ఆనాడు ఎన్‌టి రామారావు గారు రాజకీయ చైతన్యం తీసుకొచ్చారు. రాజకీయ పదవుల్లో బీసీలకు ఎన్నో అవకాశాలను కల్పించారు. 1995 నుండి 2004 వరకు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో బీసీలు ఒక్క రాజకీయాల్లోనే కాదు, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా ముందుకు తీసుకురావాలని ఎన్నో విప్లవాత్మకమైన కార్యక్రమాలను చేపట్టారు.

గ్రామీణ ప్రాంతాల్లో అట్టడుగు వర్గాల వారికి అండగా నిలబడాలని, ఎవరైతే కుల వృత్తుల వారు ఉన్నారో, వారి కుల వృత్తులను ప్రోత్సహించాలని, ఎవరైతే చేతి వృత్తుల వారు ఉన్నారో వారందరినీ ఆదుకోవాలని, ఆనాడు విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు.

అందులో భాగంగా బీసీలకు విద్యాపరంగా చూస్తే 1995 నుండి 2004 మధ్య కాలంలో 92 ఆశ్రమ పాఠశాలు, బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఆ 92 ఆశ్రమ పాఠశాలల్లో 15 బాలికల నిమిత్తం ఏర్పాటు చేయగా, మిగిలినవి బాలురు కోసం ఏర్పాటు చేశారు. ఆరోజు 1995 నుండి 2004 వరకు సుమారు 48 వేల మంది బాలబాలికలు ఉంటే, ఈరోజు 2004 నుండి 2014 వరకు కేవలం 18 వేల మంది మాత్రమే బాలబాలికలు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బీసీల ఓట్లను దండుకొని ఓట్లేసే యంత్రాలుగా చూస్తున్నారు తప్ప బీసీలను విద్యాపరంగా ముందుకు తీసుకువెళ్లే ఆలోచన చేయడం లేదనడానికి నిదర్శనమేమంటే నిన్న 2004 నుండి 2014 వరకు కేవలం 6 ఆశ్రమ పాఠశాలలను మాత్రమే బీసీ విద్యార్థుల కొరకు ఏర్పాటు చేశారు. అంటే బీసీల పైన కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వాలు చూపిస్తున్న వివక్ష, నిర్లక్ష్యాన్ని చాలా స్పష్టంగా గణాంకాలతో సహా మీ ముందు ఉంచుతున్నాను. అంతేకాదు, ఆనాడు కుల వృత్తుల వారి కోసం, కల్లు గీత కార్మికుల కోసం, వారి కుల వృత్తులను ప్రోత్సహించాలని, తద్వారా వారి ఆర్థిక ప్రమాణాలను పెంచాలని, వారి జీవితాలు బాగుండాలని, ఈ సమాజంలో వారికి గుర్తింపును తీసుకురావడం కోసం తెలుగుదేశం ప్రభుత్వం పని చేసింది. బీసీలకు రాజకీయ ప్రాధాన్యతనిచ్చిన అంశాలను చూస్తే, స్వర్గీయ శ్రీ కె.యర్రం నాయుడు గారిని ఆనాడు తెలుగుదేశప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ కేంద్రంలో క్యాబినెట్ మంత్రి పదవినిచ్చి గౌరవించిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. గత 10 సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ యుపీఏ ప్రభుత్వం మన రాష్ట్రం నుండి 10మందికి మంత్రులుగా అవకాశం ఇచ్చింది. కానీ చివర్లో సంవత్సరంన్నర కాలానికి సహాయ మంత్రిగా బీసీ అభ్యర్థులకు అవకాశం ఇచ్చింది. అంటే బీసీలపైన కాంగ్రెస్ పార్టీకి ఉండే ఆలోచన విధానం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను అణగద్రొక్కే విధానం దీని ద్వారా తేటతెల్లమవుతుందని ఈ సందర్భంగా తమరి దృష్టికి తీసుకొస్తున్నాను.

అంతేకాదు, ఆనాడు 1995-2004 మధ్యకాలంలో గీతకార్మికుల కోసం, వారందరు బాగుండాలని, వారి తాలుకు కుల వృత్తులను ప్రోత్సహించాలని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ముందుకు రావాలని, వారి వృత్తులకు సమాజంలో సమాన అవకాశాలు రావాలని, తాటి, ఈత వనాలను పెంచుకోవడానికి వీలుగా ఆనాడు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండి, ప్రతి కుటుంబానికి అయిదు ఎకరాల చొప్పున భూమిని కేటాయిస్తూ ఆదేశాలను జారీ చేయడం జరిగింది. అంతేకాదు, గొర్రెల కాపరులు ఉన్నారు, వారికి కూడా బంజరు భూముల్లో గానీ చెరువుల్లో గానీ, కుంటల్లో గానీ వారి గొర్రెలను పెంచుకోవడానికి ఆనాడు ప్రభుత్వం ఆదేశాలను జారీ చేయడం జరిగింది.

కులవృత్తులను ఒక వైపు ప్రోత్సహిస్తూ, చేతివృత్తుల వారి నైపుణ్యాన్ని పెంచడంతోబాటు వారికి అవసరమైన చేతి పనిముట్లను అందించాలనే ఉద్దేశంతో ఆనాడు కొన్ని వేల కోట్ల రూపాయలను వెచ్చించి ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఆ పథకం ద్వారా

చేతివృత్తుల వారికి పనిముట్లను అందజేసి, వారికి వృత్తి నైపుణ్యాన్ని పెంచి, ఆర్థిక అసమానతలను తొలగించడానికి ప్రయత్నం చేసింది, వారికి ప్రయోజనం కల్పించింది గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వమని ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకొస్తున్నాను. అలాగే, నాయీ బ్రాహ్మణులు ఉన్నారు. వారు ఈనాడు గ్రామాల్లో చాలా ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో, ఆనాటి ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంది. తీర్థయాత్ర స్థలాల్లో వాళ్లందరికీ తలనీలాలు, పుట్టు వెంట్రుకలు తీయడానికి వీలుగా ఆనాడు ఆదేశాలను జారీ చేశారు. ఆలాగే మత్స్య కారులకు సబ్సిడీ ద్వారా అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

అధ్యక్షా, వ్యవసాయ రంగం తరువాత ఈనాడు మన రాష్ట్రంలో అతి పెద్ద రంగం ఏదైనా ఉందంటే అది చేనేత రంగం. సుమారు 65లక్షల కుటుంబాలు ఈనాడు రాష్ట్రంలో చేనేత రంగం మీద ఆధారపడి బతుకు జీవనాన్ని వెళ్లగక్కుతున్నాయి. చేనేత రంగం పైన ఆధారపడి జీవిస్తున్న వారి కుటుంబాలు బాగుపడాలనే ఉద్దేశంతో ఆనాడు స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారి నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం సగం ధరలకే జనతా వస్త్రాల పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆనాడు ఆప్కోలో ఉన్న చేనేత వస్త్రాల నిల్వలను పది శాతం రిబేట్‌తో అమ్ముకోవడానికి అవసరమైన వెసులుబాటును కల్పించారు. ఆనాడు రిబేట్ సదుపాయాన్నిచ్చి చేనేత రంగాన్ని ఆదుకున్నది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం. 1997వ సంవత్సరంలో ఆప్కో నిర్వహణను సరిగా నిర్వహించుకోలేని సందర్భంలో చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో ఏర్పడిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేనేత వర్గాల కోసం, వారి అభ్యున్నతి, సంక్షేమం కోసం ఎప్పుడు కట్టుబడి ఉందనే నమ్మకాన్ని కల్పించి, ఆపదలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో పది వేల కోట్ల రూపాయల గ్రాంట్‌ను ఇచ్చి ఆప్కోను ఆదుకొని నిలదొక్కుకునే ప్రయత్నం చేసింది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమనే విషయాన్ని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, చేనేత వృత్తుల వారికి హౌస్- కం- వర్క్‌షెడ్లను ఏర్పాటు చేసింది మొట్టమొదటి సారిగా ఆనాటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వమనే విషయాన్ని ఈ సందర్భంగా సభ్యులందరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది. అంతేగాకుండా, రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడే చేనేత వర్గాలకు సంబంధించిన పవర్‌లూమ్స్‌కు 50శాతం విద్యుత్ సబ్సిడీని ఇచ్చి చేనేత రంగాన్ని ఆదుకున్నది కూడా శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీ ప్రభుత్వానిదే. చేనేత వృత్తిలో రాష్ట్రానికి సంబంధించిన 65 లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయనే విషయాన్ని గమనించి, ఆయా కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

అధ్యక్షా, తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించిందే వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం. బీసీల సంక్షేమం గురించి మొట్టమొదటిగా మాట్లాడింది స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు. తెలుగు దేశం పార్టీని స్థాపించిన తరువాతే బీసీల గొంతులు బయటకు వచ్చాయి. ఆనాడు బీసీ విద్యార్థుల కోసం అనేక ఆశ్రమ పాఠశాలలను రాష్ట్రంలో ప్రారంభించడం జరిగింది. అలాగే మత్స్యకారుల కొరకు, గొర్రెల పెంపకందార్ల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను ప్రారంభించి అమలుచేసిన ఘనత ఆనాటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఆనాడు చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి గాను అమలు చేసిన కార్యక్రమాల పట్ల అభినందించాల్సిన అవసరముంది.

అదే విధంగా బీసీ విద్యార్థులకు ఆనాడే పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్స్ గానీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గానీ అమలు చేసింది తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం. అంతేగాకుండా పోటీ పరీక్షల్లో బీసీ నిరుద్యోగ యువత నెగ్గి ఉద్యోగాలు పొందాలనే ఆకాంక్షతో ఆనాడు "బీసీ స్టడి సర్కిల్" ను ఏర్పాటు చేసింది తెలుగు దేశం పార్టీ ప్రభుత్వమే. బీసీలే గాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేసిన ఘనత కూడా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులకు సంబంధించిన బోధనా రుసుముల కోసం ఈనాటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రణాళికా కేటాయింపులో ఈ ఏడెనిమిది నెలల కాలానికి రూ.2,419.00 కోట్లు ప్రణాళికా వ్యయం క్రింద కేటాయించడం జరిగింది. అలాగే బి.సి.ల అభ్యున్నతి కోసం రూ. 3,130.00 కోట్లు బడ్జెట్‌లో కేటాయించిన ఈ రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవ ముఖ్యమంత్రి గారికి నేనొక బీసీ శాసనసభ్యుడిగా నా హృదయపూర్వక ధన్యవాదాలను సభాముఖంగా తెలియజేసుకుంటున్నాను. గత పది సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు మొత్తం 23జిల్లాలకు కలిపి బీసీల అభ్యున్నతికిగాను ఆయా బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాలు రూ.4,000.00 కోట్లు ఉంటే, ఈనాడు పదమూడు జిల్లాల్లోని బీసీల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో రూ.3,130.00 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ వ్యత్యాసాన్ని గమనించాలని సభాముఖంగా సహచర సభ్యులను కోరుతున్నాను. అంతేగాకుండా బీసీ ఉపప్రణాళిక ఏర్పాటుకు గౌరవ ముఖ్యమంత్రి గారు రూపకల్పన చేస్తున్నారు. బీసీల అభ్యున్నతికోసం మరో పది వేల కోట్ల రూపాయలతో ఉపప్రణాళికను ఏర్పాటు చేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు కేవలం ఏడెనిమిది మాసాలకు సంబంధించినవే. రాష్ట్ర విభజన అనంతరం అనేక సమస్యలు మనకు పుట్టుకువచ్చాయి. ప్రజానీకం ఇబ్బందుల్లో ఉంది. తద్వారా వచ్చిన సమస్యలను అధిగమించి, సవాళ్లను అధిగమించి బడ్జెట్ కేటాయింపుల్లో బీసీల అభ్యున్నతికి పెద్దపీట వేసి ఉప ప్రణాళిక ఏర్పాటుకు గాను రూపకల్పన చేసినటువంటి గౌరవ ముఖ్యమంత్రి గారికి ఈ సభ ద్వారా నేను అభినందనలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం, వారి ప్రయోజనాల కోసం, ఆర్థిక, విద్య, సామాజికంగా బీసీ వర్గాలు అభివృద్ధిని సాధించాలనే కాంక్షతో బడ్జెట్‌లో కేటాయింపులను చేయడం జరిగింది. అదే నిదర్శనం. బీసీ విద్యార్థుల కోసం రాష్ట్రంలోని పదమూడు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ పరిణామం చాలా అభినందనీయం. బీసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా అభినందించక తప్పదు. గత పది సంవత్సరాల కాలంలో గానీ, ముఖ్యంగా రాజశేఖరరెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో బీసీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైంది. బీసీల కోసం గానీ, చేనేత వృత్తుల వారి సంక్షేమం కోసం గానీ బీసీ కార్పొరేషన్ నుంచి ఒక రూపాయి కూడా విడుదల చేయలేదు. బీసీలను అణగద్రొక్కే ప్రయత్నాన్ని గత పది సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేశాయనే విషయాన్ని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ముగ్గురు ముఖ్యమంత్రుల పదవీ కాలంలో బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడం జరిగిందనే విషయాన్ని ఈ సభ ద్వారా మీ ముందుకు తీసుకువస్తున్నాను. ఆ పరిణామం బీసీ వర్గాలకు చాలా బాధకల్గించింది. బీసీ ఫెడరేషన్‌ను ఏర్పాటుచేసి కనీసం కూర్చోడానికి కుర్చీలు కూడా లేకుండా చేసి కేవలం మాటలు చెప్పి బీసీలను అణగద్రొక్కే ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేశాయి. ఫెడరేషన్లను ఏర్పాటు చేస్తున్నామనే విషయాన్ని కేవలం పేపర్ మీద పెట్టి బడ్జెట్ కేటాయింపుల్లో సున్నా చూపించిన ఘనత కూడా గత పది సంవత్సరాల కాలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి, ముగ్గురు ముఖ్యమంత్రులకే దక్కుతుందనే విషయాన్ని మీ ద్వారా ఈ సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ఫెడరేషన్స్‌ను ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పంతో ఈనాటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లోనే పెద్దపీట వేసి ప్రజానీకానికి ప్రభుత్వ సంకల్పాన్ని చాటి చెప్పింది. తద్వారా ఈ రాష్ట్రంలోని ప్రతి బీసీ ప్రభుత్వాన్ని అభినందించాల్సిన సమయం ఆసన్నమైందనే విషయాన్ని సభ ద్వారా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేస్తున్నాను. బీసీ కమీషన్ కూడా గత కాంగ్రెస్ పార్టీ పది సంవత్సరాల పరిపాలనలో నిర్వీర్యమైంది. బీసీ ఫెడరేషన్ గానీ, బీసీ కమీషన్ గానీ ఏర్పాటు చేయకపోవడం వల్ల బీసీలు వారి బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యేవారు. బీసీ వర్గాల సమస్యలను చెప్పుకోవడానికి కూడా ఆనాడు అవకాశం లేకుండా చేసింది ముగ్గురు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల్లోని ముఖ్యమంత్రులే. సభ ద్వారా నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను. బీసీ కమీషన్‌ను సత్వరమే ఏర్పాటుచేసి బీసీల పట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటిచెప్పాలని ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

బీసీల పట్ల ఉన్న ప్రేమ అనురాగం, నిబద్ధతను ఈ ప్రభుత్వం చాటిచెప్పాలని ఈ సభద్వారా మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. కేంద్రంలోఉన్న నేషనల్ బ్యాక్ వర్డ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ నుండి ఫండ్స్ తీసుకొచ్చి ఈ రాష్ట్రంలో బీసీలకు ఒక్క రూపాయి కూడా ఇచ్చినట్లు కనపడలేదు. ఆనాటి ప్రభుత్వ ముఖ్యమంత్రులు రాజశేఖరరెడ్డి గారు, కిరణ్ కుమార్‌రెడ్డి గారు రోశయ్య గారు మేం దళితుల కోసం ఎంతో చేశామని చెప్పారు. అది ఎంతటి విచిత్రమంటే

బీసీల ఆర్థిక పరిపుష్టి కోసం, భూమి కొనుగోలుకు  కోసం కేంద్రం నుండి ఎన్‌డిఎఫ్‌సి నిధులు ఇస్తామంటే  ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారు వద్దని ఉత్తరాలు రాశారు. ఇదీ ఆనాటి ప్రభుత్వాల ముఖ్యమంత్రులకు దళితుల మీద ఉన్న ప్రేమ అని మీకు తెలియజేస్తున్నాను. ఈ నాడు ఈ రాష్ట్రంలో ఉన్న బీసీల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో  వృద్ధులకు పింఛన్ రూ.1000 కి పెంచారు. 1996లో రూ.200 ఇచ్చారు. తరువాత కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చే పింఛను పెంచారు. కానీ 2014వరకు రూ.200లే చెల్లించారు. రాష్ట్ర ఆదాయం 2004 నాటికి రూ.32,000 కోట్లు ఉంటే 2014-15 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.1.75 చూపించారు. పెంచారు. కానీ 200 రూపాయలే గొప్పగా ఇచ్చామని చెప్పుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా వారికి అందకుండా విడదీసి ఇద్దరికీ పంపిణీ చేసి మేము గొప్ప పరిపాలన అందించామని గత కాంగ్రెస్ ప్రభుత్వాల ముఖ్యమంత్రులు రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి గార్లు చెప్పారు. అది చాల సిగ్గుచేటని ఈ సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈనాడు ఆదాయం పెరిగింది. పేదవాడు బ్రతక లేని పరిస్థితుల్లో ఉన్నారు. ఎక్కువగా పింఛన్లు పొందే వారిలో ఎస్సీలు, ఎస్టీలు, మరియు అల్పసంఖ్యాక వర్గాల వారు ఎక్కువగా ఉన్నారు. వారిని ఆదుకోవాలని అందరితో సమానంగా ఈ సమాజంలో వారిని గౌరవించాలని, వారికి ఆర్థిక పరిపుష్టినివ్వాలని పింఛన్ సొమ్ము ఈ ప్రభుత్వం ఈనాడు రూ.200 నుండి 1000కి పెంచింది. ఇటువంటి ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి దక్కుతుందని ఈ సందర్భంగా మీకు తెలియజేసుకుంటున్నాను.

(ఈ దశలో ప్రధాన ప్రతిపక్ష  సభ్యులు శ్రీమతి ఆర్‌కె.రోజా నుండి అభ్యంతరం )

ఏమ్మా ఏం కావాలి. నేను చెపుతున్నాను, వినమ్మా. వినే ఓపిక కూడా లేకపోతే ఎలా.

MR.SPEAKER: No cross talking, please continue. You don’t have to respond to them. Please continue.

శ్రీ కూన రవికుమార్ (ఆముదాలవలస): అలాగే సార్. వికలాంగులకు ఆరోజు కేంద్ర ప్రభుత్వం రూ.500 పింఛన్ చెల్లిస్తామంటే రాజశేఖరరెడ్డిగారు ఆ మొత్తాన్ని వారికి అందజేయలేకపోయారు. అందుకనే ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్టోబర్ 2వతేది నుండి పింఛన్ మొత్తాల్ని రూ.500-1000లకు, రూ.1000 -1500లకు పెంచుబోతుంది. ఇక్కడొక విషయాన్ని సభ్యులందరు గమనించాలి. ఈ రాష్ట్రం విడిపోయిన తరువాత రాష్ట్ర విభజన వలన అనేక సమస్యలు, సవాళ్లు వచ్చాయి. రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.16000కోట్లు పైబడి ఉంది. ఈనాడు కొత్త రాజధానిని నిర్మించుకోవాల్సి ఉంది. ఈ రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం ఇవ్వాలని అణగారిన వర్గాలను ఆదుకోవాలని వారికి ప్రాధాన్యం ఇవ్వాలని బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు చేసిన ఘనత ఈ తెలుగుదేశం ప్రభుత్వానికి ఉంది. ఎస్సీ, ఎస్టీల గురించి చెప్పాల్సి వస్తే 2004 నుండి

2014వరకు రూ.55000కోట్ల రూపాయలు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు ఖర్చు చేయాల్సి ఉండగా, అందులో రూ.38000 కోట్ల రూపాయలు ఎస్సీల కోసం ఖర్చు పెట్టామని చెప్పారు. అందులో కూడా ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం కోసం ఇతరత్రా అవినీతి అక్రమాలు జరుపుకోవడం కోసం సుమారు రూ.18000కోట్లు అణగారిన వర్గాలు, దళితులు, గిరిజనులకు సంబంధించిన నిధులు దారిమళ్లించారు. అవినీతి కార్యక్రమాలు చేపట్టారు. రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలోనే రూ.18000కోట్ల రూపాయలు దారిమళ్లించిన విషయాన్ని ఈ సందర్భంగా తమ దృష్టికి తీసుకువస్తున్నాను. ఒక్కసారి గమనించినట్లైతే దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలు అంటే మీకు ఓట్లేసే యంత్రాలు కాదు. పల్లకి మోసేవాళ్లెవరంటే బీసీలే పల్లకి మోసేవాళ్లుగా పరిగణించబడుతున్నారు.

ఆనాడు కింజరాపు యర్రన్నాయుడు గారికి కేంద్ర మంత్రి పదవి ఇవ్వడం, ఈనాడు ఈ సభలో ఒక బీసీకి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడం ద్వారా తెలుగుదేశం పార్టీ బీసీలను గౌరవించింది. తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం ప్రభుత్వం బీసీలను ఓట్లువేసే యంత్రాలుగా చూడడం లేదు. ఈ సమాజంలో ఎవరైతే అణగారిన వర్గాలుగా ఉన్నారో వారందరిని అందరితో సమానంగా గుర్తించబడాలని, వారిని ఆర్థిక రాజకీయ సాంఘిక, సామాజికంగా ముందుకు తీసుకురావాలని ఈ ప్రభుత్వం తీవ్ర కృషి చేసిందనడానికి ఈనాటి ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులే అందుకు నిదర్శనమని తెలియజేసుకుంటున్నాను. మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ ః యామినీ బాల.

(మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి అని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టి సభ్యులుచే సభకు అంతరాయం )

శ్రీమతి బి.యామినీ బాల (సింగనమల)ః నమస్కారం అధ్యక్షా, సభలో దళిత వర్గాల వారికి ఎప్పుడు మాట్లాడే అవకాశం వచ్చినా వారు మహిళలు అయినా పురుషులు అయినా ఒకే విధంగా వారిని మాట్లాడనీయకుండా ఎదుర్కోవడం ప్రతిపక్షానికి సమంజసం కాదు. నిన్న ఎనిమిది సార్లు అడ్డుకున్నారు. ఈరోజు ఒక మహిళ మాట్లాడుతుండగా అడ్డుకోవడం కరెక్ట్ కాదు. ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం అని నమ్ముకున్నారు, శ్రీ నందమూరి తారక రామారావు గారు.

(అంతరాయం)

MR.SPEAKER: Please be seated. మీకు మాట్లాడే అవకాశం వస్తుంది. No, don't interrupt. No interruption please. If you disturb, you will loose your own

party time. Please go back to your seats. If you interrupt, that time will be deducted from your own party time. Please resume your seats. Please go back to your seats.

(వై.ఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు శ్రీమతి ఆర్. కె.రోజాతో సహా కొంతమంది సభ్యులు వెల్‌లోకి మరియు పోడియందగ్గరకి వచ్చి, క్లారిఫికేషన్ కావాలని, ఒక్క నిమిషం మాత్రమే మాట్లాడతామని, మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరుతూ, ప్రతిపక్షంలో ఉన్న బీసీ సభ్యుల గొంతును నొక్కుతున్నారని నినాదాలు చేయసాగారు.)

మిస్టర్ స్పీకర్: మీరు ఇక్కడ ఎంత సమయం ఉంటే, అంత సమయం రోజాగారికి కేటాయించిన దాంట్లో కట్ అవుతుంది. Please go back to your seats.. please. don't waste the time of the House.

(వెల్‌లో, పోడియం వద్దనున్న వై.ఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు క్లారిఫికేషన్ కావాలని, ఒక్క నిమిషం మాత్రమే మాట్లాడతామని, మైకు ఇవ్వమని పదేపదే గౌరవ సభాపతిని కోరుతూ, ప్రతిపక్ష ంలో ఉన్న బీసీ సభ్యుల గొంతును నొక్కుతున్నారని నినాదాలు చేయసాగారు.)

దయచేసి మీ సీట్లలో మీరు కూర్చోండి.. మీరు ఇక్కడ ఎంత సమయం వృథా చేస్తే, మీకిచ్చే సమయంలో అంత కట్‌చేయడం జరుగుతుంది. దయచేసి వినండి. మీరు క్లారిఫికేషన్స్ అన్నీ కూడా మంత్రిగారి దగ్గర్నుంచి, ప్రభుత్వం దగ్గర్నుంచి తీసుకోవాలి. సభ్యుల నుంచి కాదు. Please go back to your seats.. please. don't waste the time of the House. No interruptions please.

(వై.ఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు శ్రీమతి ఆర్. కె.రోజాగారు మాట్లాడటానికి 45 నిమిషాలు సమయం కావాలని అడుగగా, గౌరవ సభాపతి ఇస్తానని చెప్పారు.)

Minister for Legislative Affairs:

శ్రీ యనమల రామకృష్ణుడు (ఆర్థికశాఖ మంత్రి): అధ్యక్షా, ఇప్పుడు డిమాండ్స్ మీద చర్చ జరుగుతుంది. డిమాండ్స్ మీద చర్చ జరుగుతున్నప్పుడు మెంబర్స్ వాళ్లకి తోచిన విధంగా వాళ్లు మాట్లాడుకుంటారు. ఇందాక తమరు చెప్పినట్లుగానే వాళ్ల మెంబరు మాట్లాడారు, మా మెంబరు కూడా మాట్లాడుకోవచ్చు, మెంబరు క్లారిఫై చేసేదేమీ ఉండదు. సభ్యులు వాళ్ల ధోరణిలో వాళ్లు మాట్లాడతారు. క్లారిఫికేషన్ కావాలంటే గౌరవ మంత్రిగారు రిప్లై ఇచ్చిన తర్వాత క్లారిఫికేషన్ అడగండి, తప్పకుండా గౌరవ మంత్రిగారు క్లారిఫై చేస్తారు.

(వై.ఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులచే అంతరాయం)

MR. SPEKAER: Please go back to your seats.. Please be seated.

(వై.ఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు శ్రీమతి ఆర్. కె.రోజాతో సహా వెల్‌లోకి మరియు పోడియందగ్గరకి వచ్చిన సభ్యులు తిరిగి వెళ్లి తమ తమ సీట్లలో కూర్చొన్నారు.)

మిస్టర్ స్పీకర్ః యామిని బాలగారూ..

శ్రీమతి యామిని బాల(సింగనమల)ః అధ్యక్షా, ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం, అని తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ, సమాజంలో సమన్యాయం కావాలని స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావుగారు ఎన్నో విధాలుగా మనకు తెలియచేయడం జరిగింది. ఈరోజు మేం ఇక్కడ నిలబడి మాట్లాడగలుగుతున్నామంటే, అది కేవలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు అందరికీ ఇచ్చిన అవకాశాల వలనే.

(ట్రెజరీ బెంచీల నుంచి చప్పట్లు)

గతంలో చూసినప్పుడు మా బిడ్డలు ప్రతిభాభారతిగారు, జి.ఎం.సి. బాలయోగి గారు, లోక్‌సభ, శాసనసభ స్పీకర్‌లుగా, ఎన్.టి.రామారావుగారి ప్రభుత్వంలో ఆర్థిక శాఖామంత్రిగా, మా బిడ్డలను ఎంతో అభివృద్ధి పరిచి, మాకు ఎంతో గౌరవం ఇచ్చి, అన్ని విధాలుగా మమ్మల్ని అభివృద్ధి పరిచిన మా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారిని నమ్మి, తెలుగుదేశం పార్టీ మీద నమ్మకం ఉంచి మా ఎస్సీ, ఎస్టీ అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు అందరం కూడా మా భద్రతను, మా భవిష్యత్‌ను, అభివృద్ధిని, పెద్ద అన్నగా మా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబునాయుడుగారే తీరుస్తారనే నమ్మకంతో రాష్ట్ర ప్రజలందరూ కూడా అత్యధికంగా ఓట్లు వేసి, వేయించి, గెలిపించి ముఖ్యమంత్రిగా తీసుకురావడం జరిగింది.

గతంలో అవకాశాలు లేని సమాజంలో, అట్టడుగు వర్గాలుగా ఉన్న మా ఎస్సీ, ఎస్టీల గొంతు నొక్కి, అధికారికంగా, బలవంతంగా, ఆర్థికంగా అణిచివేతకు గురైన మా వర్గ ప్రజలకు, అమెరికా అధ్యక్షునితో పాటు కూర్చోపెట్టి, మహిళలకు ఎంతో గౌరవం ఇచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం. ఆ కార్యచరణ అంతటినీ కూడా తన భుజస్కందాలపై వేసుకుని, ఎప్పుడూ సమాజంలో స్త్రీకి సమాన స్థానం, ఆస్తిలో సమాన హక్కు, సమాన అవకాశాలు ఇవ్వాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఎప్పుడూ చెబుతూనే ఉంటారు.

అదే విధంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు తీసుకున్న నిర్ణయాలలో డ్వాక్రా గ్రూపులు, మహిళా సంఘాలు, మహిళకు ఆర్థిక స్వావలంబన, ఆర్థిక

సాధికారత, భద్రత అన్నవి కేవలం తెలుగుదేశం ప్రభుత్వంలోనే మనం చూశాం. మహిళలకు అత్యంత గౌరవం, అన్ని అవకాశాలు ఇచ్చిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారికి ఈ సభాముఖంగా పాదాభివందనాలను తెలియజేస్తున్నాను.

మహిళల తరపున, కేవలం బడ్జెట్ గురించి, డ్వాక్రా మహిళల గురించి మాత్రమే మాట్లాడాలి. ఏవో తెచ్చి పెట్టుకున్న రెండు డైలాగుల గురించి మాట్లాడటం కాదు. ముఖ్యంగా చరిత్ర గురించి తెలుసుకొని మాట్లాడాలి. ముఖ్యంగా మహిళల ఆర్థిక, రక్షణ, భద్రత, సమాజంలో సమాన అవకాశాలు ఇచ్చిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారికి మరొక్కసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఎస్సీ కార్యక్రమాలను ఈ బడ్జెట్‌లో చెప్పిన విధంగా రూ.6,547 కోట్లను కేటాయించడం జరిగింది. విద్యతోనే సమాన అవకాశాలు, విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది అని నమ్మిన వ్యక్తి.. విద్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా వసతిగృహాల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్ కార్పోరేషన్, నిర్వీర్యమైన ఎస్సీ వెల్ఫేర్ గ్రూపులన్నింటికీ ఆర్థిక స్వావలంబన కల్పించి, ఆర్థికంగా వాటి అభివృద్ధి కొరకు తిరిగి చర్యలను చేపట్టడం జరిగింది. అదేవిధంగా బాలుర వసతి గృహాలన్నిటినీ కూడా రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చడం జరిగింది. వసతి గృహాలలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను మనం టీవీలలో చూస్తున్నాం. సమాజంలో యువత ఆర్థిక స్వావలంబనకు ఎటువంటి అవకాశం లేకుండా పోయింది. కేవలం ఏ వర్గానికో, ఆధిపత్యానికో బల ప్రదర్శనగా మారిన ఈ సమాజంలో ప్రభుత్వం చేకూర్చిన ఎస్టీ సంక్షేమానికి మొట్టమొదటిగా పీట వేసింది తెలుగుదేశం పార్టీనే.

...

గురుకుల పాఠశాల, బాలికలకు రెసిడెన్షియల్ స్కూల్స్, అదేవిధంగా 'వయోజన విద్య, రాత్రి బడి, బడికి వెళ్దాం'వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల వారికి, అన్ని వయస్సుల వారికి అవకాశాలను కల్పించింది తెలుగుదేశం పార్టీనే. అంతేగాక, మహిళలు తాము స్వతహాగా బ్యాంకుకు పోయి, బ్యాంకు అకౌంటులను తెరచి, ఆర్థిక లావాదేవీలు చేసుకునేవిధంగా తమ సామర్థ్యాన్ని పెంచిన ఈ ప్రభుత్వానికి మహిళలు ఎప్పుడూ అండగా ఉంటారు. గురుకుల పాఠశాలలు, ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్స్, ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యమై, మూత పడిపోయి, బూజులు పట్టిన వాటిని తిరిగి దులిపి, ఈ నూతన రాష్ట్రంలో ఎస్సీ వెల్ఫేర్‌ను...

(ప్రతిపక్ష సభ్యులచే సభకు అంతరాయం.)

ఒకే వైపు అభివృద్ధి అనే గత ప్రభుత్వాల పనితీరువల్ల భ్రష్టు పట్టిన ఈ వ్యవస్థకు, నూతన జవసత్వాలను కల్పించి, ఎస్సీ, ఎస్టీలకు వెలుగును చూపి, పెద్దన్నలా నేనున్నానంటూ

ముఖ్యమంత్రివర్యులు వారికీ, అదేవిధంగా ఆర్థిక అంధకారంలో ఉన్న బడ్జెట్‌కు ఒక రూపునిచ్చే ప్రయత్నం చేస్తున్న ఆర్థిక శాఖామాత్యులు శ్రీ యనమల రామకృష్ణుడు గారికీ నేను ఈ సభాముఖంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న ఏకైక నమ్మకం శ్రీ నారాచంద్రబాబునాయుడు గారే. ముఖ్యమంత్రిగారు కల్పించిన ఈ అవకాశాలన్నింటినీ కూడా అందిపుచ్చుకొని, మా బాలబాలికలు, మా అన్నదమ్ములు, మా అక్కతమ్ముళ్ళు అభివృద్ధి పథంవైపు నడవగలరని ఆశిస్తున్నాను. గతంలో దారిమళ్ళిన ఎస్సీ, ఎస్టీ నిధులను తిరిగి రాబట్టాలనీ, అక్రమార్కులకు శిక్ష వేయించాలనీ, దారితప్పిన వ్యవస్థను గాడిలో పెట్టి, మా అభివృద్ధికి అన్నివిధాలా చేదోడువాదోడుగా ఉంటున్న గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతూ, వారికి మరొక్కసారి నా కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః శ్రీమతి రోజా గారు.

శ్రీమతి ఆర్.కె.రోజా(నగరి) ః అధ్యక్షా, నాకీ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. గౌరవ సహచర శాసనసభ్యులు మాట్లాడుతూ 'డైలాగులు రాసిస్తే చెప్పారు' అని అన్నారు. 15సంవత్సరాల పాటు మహిళల కోసం పోరాడాము. మహిళా సమస్యల గురించి మాట్లాడాము. మేము ఎన్నికల ముందు బెంగుళూరు నుంచి రాలేదు. అది వాళ్ళు గమనించాలి. వాళ్ళ నాయకుడి గురించి, వారి కంటే మాకే బాగా తెలుసునని ఆవిడ గమనించాలి. అధ్యక్షా, 2014వ సంవత్సరాన్ని, మహిళా నామ సంవత్సరంగా ప్రకటించి, మహిళల ఔన్నత్యాన్ని చాటిచెప్పింది, తెలుగుదేశం పార్టీ అని వారి మ్యానిఫెస్టోలో చెప్పారు. ఇది చాలా సంతోషం. గానీ, నెల్లూరు జిల్లా దూబగుంటలో మద్యపాన నిషేధం గురించి మొదలుపెట్టిన ఉద్యమాన్ని నీరు గార్చింది ఇదే తెలుగుదేశం పార్టీ అని ఈ 2014-మహిళానామ సంవత్సరం సందర్భంగా చెప్తున్నాను. నెల్లూరులో మహిళలు మద్యపాన నిషేధం గురించి పోరాడుతూ ఉంటే, పెద్ద మనసుతో అన్న శ్రీ ఎన్.టీ.రామారావు గారు మద్యపాన నిషేధాన్ని అమలుచేయడం జరిగింది. వెన్నుపోటుతో ప్రభుత్వాన్ని లాక్కున్న చంద్రబాబునాయుడు గారు, మద్యపాన నిషేధాన్ని ఎత్తేసి, బెల్ట్‌షాపులకు, గేట్లెత్తేసి, ఎక్సైజ్ డిపార్టుమెంటుకు టార్గెట్లు పెట్టి అమ్మించారు. మనందరం కూడా చూశాం. నా రెండవ సంతకం బెల్ట్‌షాపులు తొలగించడానికే అని గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు చెప్పారు. మరి బెల్ట్ షాపులు తొలగిస్తామని చెప్పి, సంతకాలు చేశారు. సెల్‌ఫోన్లలో ఆర్డర్ చేస్తే డోర్ డెలివరీ చేసే స్థాయిలో తెలుగుదేశం కార్యకర్తలు దిగజారిపోయి ఉపాధి హామిలాగే పెట్టుకున్నారంటే దాని గురించి ఆలోచించాల్సి ఉంది. ఎక్సైజ్ శాఖ మద్యాన్ని అమ్మే ఏజెంట్‌గా కాకుండా, ప్రభుత్వానికి ఒక ఆదాయ వనరుగా కాకుండా, ఎక్కడా బెల్టు షాపులనేవే లేకుండా నియంత్రించే వ్యవస్థగా ఎక్సైజ్ శాఖను మార్చాలని మహిళల తరఫున నేను కోరుతున్నాను.

మహిళా సంక్షేమ ప్రభుత్వమని తెలుగుదేశం పార్టీ వారు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇది మహిళా సంక్షేమ ప్రభుత్వం కాదు, మహిళా సంక్షోభ ప్రభుత్వమని ఈ 3 నెలలలో మొదటి బడ్జెట్‌లో స్పష్టంగా తెలిసిపోయింది. మహిళా స్వయం సహాయక, డ్వాక్రా సంఘాలకు రూ.14,204 కోట్లు రుణాలు ఉంటే అణాపైసలతో కూడా మేము వాటినన్నింటినీ మాఫీ చేస్తామని చెప్పిన వారు, అధికారంలోకి వచ్చిన తరువాత కుంటిసాకులు చూపించి, చివరకు బడ్జెట్‌లో ఆ సంఘాల బలోపేతానికి లక్ష రూపాయలు కేటాయిస్తున్నామే తప్ప, రుణమాఫీ గురించి చెప్పలేదు. ఆ లక్ష రూపాయలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని కోరుతున్నాం. అసలు, వడ్డీ కట్టే పరిస్థితులలో మేము లేము, రుణ మాఫీ చేయాలని కోరాం. పూర్తిగా రుణ మాఫీ చేస్తారని మిమ్ములను నమ్మి ఓట్లు వేస్తే మమ్ములను ముంచుతారా అని మహిళలు తిరగబడుతున్నారు. అది కూడా సాక్షాత్తు శ్రీ చంద్రబాబునాయుడు గారి సొంత జిల్లా అయిన చిత్తూరు జిల్లాలో కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లె మండలంలోని సెట్టిపల్లెలో మహిళలు చెబుతున్నారు. మేము రుణం తిరిగి చెల్లించమని, మాకు హామి ఇచ్చినట్లు రుణం మాఫీ చేయలని ఐకేపి అధికారులపై తిరగబడ్డారు.

మహిళా, డ్వాక్రా సంఘాలు ప్రవేశపెట్టింది మేమని తెలుగుదేశం పార్టీ వారు గొప్పలు చెప్పుకుంటున్నారు. చిన్న క్లారిఫికేషన్, గతంలో కేంద్ర ప్రభుత్వం ఇలాంటి గ్రూపులను ఫామ్ చేస్తే, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ప్రవేశపెట్టారు. ఆంధ్ర రాష్ట్ర మహిళలు చైతన్యవంతులు కనుక ఒక ఉద్యమరూపంలో ఈ సంఘాలు ఏర్పడ్డాయే గానీ, దీనిలో గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రమేయం ఏమీ లేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మహిళలకు గోరంత సాయం చేస్తే, కొండంత ఎదుగుతారు అన్న విషయాన్ని చాలా మంది తెలుసుకోవాలి. వారు ఆర్థికంగా ఎదగడం కోసం వడ్డీల చక్రవ్యూహాలలో చిక్కుకొని, దిక్కుతోచని పరిస్థితులలో ఉన్నప్పుడు ఆర్థిక స్వాలంబన చేయాల్సిన బాధ్యత తనపై ఉందని దివంగతనేత శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు పావలా వడ్డీ. . . . . (మైక్ కట్ చేయబడింది)

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి) : అధ్యక్షా, తెలుగుదేశం పార్టీని విమర్శించే నైతిక విలువ, అర్హత శ్రీమతి రోజా గారికి లేదు. ఈ రాష్ట్రంలోని మహిళలు ఎన్ని జన్మలెత్తిన స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు, శ్రీ నారా చంద్రబాబునాయుడు గార్లకు రుణపడి ఉంటారు. ప్రభుత్వ సంస్థల్లో, ప్రభుత్వరంగ సంస్థల్లో, స్థానిక సంస్థల్లో 33.3శాతం మహిళా రిజర్వేషన్ పాటించిన ఘనత యావత్ భారతదేశంలో ఒక్క తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది.

(అధికారపక్ష పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

శ్రీమతి రోజా గారు తెలుగుదేశం మహిళా అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు, ఊరూరా, వీధివీధినా తిరిగి తెలుగుదేశం పార్టీ మహిళల కోసం బాగా కృషి చేస్తుందనీ, శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ఏమీ చేయలేదనీ చెప్పిన క్లిప్పింగులు, వార్తా పత్రికలలో పుంఖాలు పుంఖాలుగా వచ్చాయి.

శ్రీమతి ఆర్.కె.రోజా(నగరి) : అధ్యక్షా, శ్రీ పల్లె రఘునాథ రెడ్డి గారు చాలా చక్కగా చెప్పారు. 'యథా రాజా, తథా ప్రజ' అంటారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో శ్రీ చంద్రబాబు నాయుడు గారు చిన్ననీటి శాఖా మంత్రిగా ఉన్నప్పుడు ఎన్టీఆర్ ఏమైనా గొప్పా? ఆయనపైననే నేను పోటీ చేస్తాననీ..., తెలుగుదేశం పార్టీ ఒక గాలి పార్టీ, దానికి భవిష్యత్తు లేదనీ చెప్పారు.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

'ఇల్లరికంలో ఉంది మజా' అని సూట్‌కేసులు చంకలో పెట్టుకొని అదే తెలుగుదేశం పార్టీలోకి జంప్ చేసిన విషయాన్ని ఈనాడు వార్తాపత్రికలో పతాక శీర్షికలో వేసిన కార్టూన్లు మనకు గుర్తు ఉండే ఉంటాయి.

అధ్యక్షా, ఏ పార్టీలో ఉన్నామనేది ముఖ్యం కాదు, మహిళలకు అన్యాయం జరిగితే ఏ పార్టీలో ఉన్నా నేను మాట్లాడుతాను, వారి కోసం పోరాడతాను. మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసిన శ్రీ చంద్రబాబు నాయుడు గారి పార్టీలో ఉండి కూడా బెల్టు షాపులు తొలగించాలని రాత్రనకా, పగలనకా అన్ని జిల్లాల్లో తిరిగి మహిళల కోసం పోరాడిన మహిళగా మాట్లాడే హక్కు నాకుందన్న విషయాన్ని ఈ సభాముఖంగా అధికారపక్ష సభ్యులకు తెలియజేస్తున్నాను.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

గోరంత సాయం చేస్తే, కొండంత ఎత్తుకు ఎదగగల శక్తి మహిళల సొంతం. అలాంటి ఆడపడుచులు వడ్డీల చక్రవ్యూహంలో చిక్కుకొని, దిక్కుతోచని పరిస్థితులలో ఉన్నప్పుడు, ఆర్థిక స్వాలంబన కోసం తన బాధ్యతగా దివంగత నేత శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు పావలా వడ్డీకి మహిళలకు రుణాలిచ్చి ఆ అక్కాచెల్లెళ్లను కాపాడిన విషయాన్ని గుర్తుచేసుకోవాలి.

(అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు)

గత ప్రభుత్వంలో 'స్త్రీనిధి' అని మహిళా బ్యాంకును ప్రారంభించారు. దీని కోసం ప్రభుత్వం వడ్డీలేని రుణాలివ్వాలని జీ.ఓ.389ను విడుదల చేశారు. దీని ప్రకారం అప్పు తీసుకున్న సంఘాలు అసలు చెల్లిస్తే చాలు, వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని సర్క్యులర్ ఇవ్వడం జరిగింది. కానీ, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అసలు, వడ్డీ సంఘాలే చెల్లించాలని స్త్రీనిధి బ్యాంకు ఎండీ గారు 01-07-2014వ తేదీన సర్క్యులర్ ఇచ్చారు. ఇది మహిళలను మోసం చేయడం కాదా అని ఈ సందర్భంగా నేను ప్రశ్నిస్తున్నాను.

(అధికారపార్టీ సభ్యులు 'ప్యాక్‌అప్, ప్యాక్‌అప్' అని అంటే దానికి ప్రతిగా శ్రీమతి రోజా గారు మీరు ప్యాక్‌అప్ అయ్యే రోజు దగ్గరలోనే ఉందన్నారు)

(ఈ సందర్భంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు వాగ్బాణాలు విసురుకున్నారు)

గొడ్డు చాకిరీ చేసేది మహిళలు. అందుకు ఉదాహరణ అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు. వారి వేతనాలను పెంచాలని 30-03-2000లో హైదరాబాదులోని ఇందిరాపార్క్ చౌరస్తా దగ్గర వారి డిమాండ్లు సాధించుకోడానికి ఏ విధంగా పోరాడారో మీకు కూడా తెలుసు అధ్యక్షా. వారిపై గుర్రాలతో తొక్కించి, లాఠీ చార్జీ చేయించిన ఘనత ఈ తెలుగుదేశం పార్టీకి చెందుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు పెద్ద మనస్సుతో అంగన్‌వాడీ, వర్కర్లను కాపాడాలని 5 సంవత్సరాలలో రెండుసార్లు వారి వేతనాలను పెంచారు. కేంద్రం ఇచ్చే వేతనాలకు సంబంధం లేకుండా అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ప్రత్యేక వేతనాలు అందిస్తామని 2009వ సంవత్సరంలో చెప్పారు. కాని దురదృష్టవశాత్తు ఆయన మరణించగానే అంగన్‌వాడీ వర్కర్ల సంక్షేమానికి ఎదురుదెబ్బ కూడా తగిలింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి అంగన్‌వాడీ టీచర్లకు, వర్కర్లకు, హెల్పర్లకు వేతనాలు పెంచుతామని చెప్పారు. కాని అధికారంలోకి రాగానే కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. వారు అడిగిన విధంగా రూ.10,000/- వేతనాలు ఇవ్వాలని మహిళల తరుఫున ప్రభుత్వానికి  తెలియజేస్తున్నాము.

(అధికారపక్ష సభ్యులు 'ఐరన్‌లెగ్ రోజా' అని అన్నారు, దానికి వెంటనే శ్రీమతి రోజా గారు స్పందిస్తూ 'ఆ మాటంటే నా నోట్లో మంచి మాటలు రావు'  అని చెప్పారు)

శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి గారు తన హయాంలో 'బంగారు తల్లి' అనే గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టారు. దానిలో 3,50,000 మంది నమోదు చేసుకున్నారు. 25 శాతం మందికి మాత్రమే రూ.2,500/- చొప్పున మొదటి సంవత్సరం ఇచ్చారు. ఇంతవరకు ఆ పథకానికి అతీగతీ లేదు, అసలు ఆ పథకం ఉందో, లేదో కూడా తెలియదు. అది వారు చెప్పాల్సిన అవసరముంది. దీని గురించి మాట్లాడకుండా 'మహాలక్ష్మి' పథకమని పెట్టారు. పుట్టిన ప్రతి ఆడబిడ్డ పేరుతో అర్హులైన కుటుంబాలకు  రూ.30,000/-లు  డిపాజిట్ చేసి, యుక్తవయస్సు వచ్చే నాటికి రూ.2,00,000/- అందిస్తామంటున్నారు. అర్హులైన కుటుంబాలు అంటే ఎవరు? తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసిన వారా, ఆ పార్టీలో ఉండేవారా అని మాకు తెలియాలి.

శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, ఆమె ఏమి మాట్లాడుతుందో ఆమెకే తెలియడం లేదు. మంచి కార్యక్రమాలు చేస్తున్నప్పుడు అభినందించాల్సిందిపోయి ఈ విధంగా

మాట్లాడటం చాలా దుర్మార్గం. అందుకే కొంతమంది ఆమెను ఐరన్‌లెగ్ అని అంటున్నారు. దాని గురించి నేను మాట్లాడడం లేదు.

(ఈ సందర్భంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు వాగ్బాణాలు విసురుకున్నారు)

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): అధ్యక్షా, ఒక చిన్న క్లారిఫికేషన్, ఐరన్ లెగ్ అని అంటున్నారు. 1999 మీ నియోజకవర్గానికి ఎన్నికల ప్రచారానికి నేను వచ్చాను. అక్కడ 26 రోజులు ప్రచారం చేశాను. మొదటిసారి ఎన్టీఆర్ నుంచి వెన్నుపోటు పొడిచి శ్రీ చంద్రబాబు నాయుడు గారు పదవిని లాక్కున్నారు. రెండవసారి ప్రత్యక్షంగా ఎన్నికలలో పాల్గొనేటప్పుడు నేను పార్టీ కోసం ఎంత కష్టపడ్డానో మీ మనస్సాక్షికి తెలుసు. అప్పుడు శ్రీ చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి అయ్యారు. ఐరన్‌లెగ్ నేను కాదు, శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి గారు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. శ్రీ చంద్రబాబు నాయుడు గారికి యాక్సిడెంట్ జరిగినపుడు ఆ కారులో ఉన్నది శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి గారే. అలాగే శ్రీ రాజశేఖర్ రెడ్డి గారు మరణించడానికి ముందురోజు శ్రీ మోత్కుపల్లి నర్సింహులుతో క్యాంప్ ఆఫీసుకు వెళ్ళినది శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి గారే అన్న విషయం పాత వార్తాపత్రికలు తిరగేస్తే తెలుస్తుంది. మహిళ అని చూడకుండా ఎక్కడ నేను ఎదిగిపోతానోనని నాపై నిందలు వేయడం సరికాదని తెలియజేస్తున్నాను. యాక్సిడెంట్‌లో శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి గారికి మతిపోయిందేమో డాక్టర్‌కు చూపించుకుంటే మంచిది.

శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి: ఈ సంస్కృతి మంచిది కాదు. ఆ సంఘటన జరిగినపుడు నేను కారులో ఉన్నాను. నన్ను పేల్చాలని కాదు, ముఖ్యమంత్రి గారిని చంపాలని చూసారు. బాంబు ఎవరు పెట్టారో మాకు తెలుసు. బాంబు పెట్టింది శ్రీ గంగిరెడ్డి అనే వ్యక్తి. శ్రీమతి రోజా గారి అప్పటి స్టేట్‌మెంట్స్‌ను కాపీని మీకు పంపిస్తాను అధ్యక్షా.

(ఈ సందర్భంలో శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి గారు పాత పత్రికల కాపీని తీసుకొని చదవసాగారు)

(సభకు తీవ్ర అంతరాయం)

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి): చాలా ఉత్సాహంతో శ్రీమతి శమంతకమణి గారి కూతురు శ్రీమతి యామిని బాల గారు పత్రికల కాపీని తెచ్చింది. వారి తల్లి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు శ్రీ చంద్రబాబు నాయుడు గారిని ఎన్ని మాటలు అన్నారో అవి కూడా చదివితే బాగుంటుంది.

వికలాంగుల సంక్షేమం విషయానికి వస్తే శ్రీ చంద్రబాబు నాయుడు గారు అధికారంలో ఉన్నపుడు రూ.75/- పెన్షన్ ఇవ్వడానికి చాలా కష్టపడేవారు. డా.రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వం వచ్చిన తరువాత దానిని రూ.200/-కు పెంచారు. 2008వ సంవత్సరంలో రూ.500/-లకు పెంచారు. అంటే 2004వ సంవత్సరం ముందున్న వికలాంగుల పెన్షన్‌ని డా.రాజశేఖర్ రెడ్డి గారు అధికారంలోకి రాగానే దాదాపు మూడు రెట్లు పెంచి రూ.200/- చేశారు, ఆ తరువాత రూ.500/- చేశారంటే ఏడు రెట్లు పెన్షన్ పెరిగింది. శ్రీ చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం 2004లో రూ.9 కోట్లు కేటాయిస్తే అదే డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వం 2008 నాటికి రూ.496 కోట్లకు పెంచబడింది. వికలాంగులపై ఎవరికి చితశుద్ధి ఉందో అర్థమవుతుంది. శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 40 లక్షల వికలాంగులుంటే కేవలం లక్ష మందికి మాత్రమే పెన్షన్లు ఇవ్వడం జరిగింది. అది కూడా రూ.75/-లు మాత్రమే.

కాని రాజశేఖర రెడ్డి గారు తన హయాములో ఎనిమిది లక్షల 55వేల మంది వికలాంగులకు పెన్షన్‌గా ప్రతి నెల రూ.500 చొప్పున అందించారు. అంతేకాకుండా వికలాంగుల పెన్షన్‌కోసం అప్పుడున్న తొమ్మిది కోట్ల రూపాయల బడ్జెట్‌ను రూ.496 కోట్లకు పెంచారు. అంటే వికలాంగుల పట్ల రాజశేఖర రెడ్డి గారికున్న అభిమానమెలాంటిదో దీనివల్ల తెలుస్తుంది.

వీళ్లు ఈ రోజు బీసీల గురించి మాట్లాడుతున్నారు. ఈ రోజు ఫీజు రీయింబర్స్‌మెంటు ద్వారా అత్యధికంగా లబ్ధి పొందిన వారెవరైనా వున్నారంటే అది బీసీలు మాత్రమే. అందుకే పది సంవత్సరాల పాటు బీసీలు వీళ్లను అధికారానికి దూరంగా పెట్టారన్న విషయాన్ని వీళ్లు గుర్తు చేసుకోవాలి. అట్లాగే ఆరోగ్యశ్రీ కింద ఎంత మంది బీసీలు లబ్ధి పొందారో ఒకసారి వీళ్లు తెలుసుకోవాలి. డ్వాక్రా రుణాల విషయంలో కాని, గృహనిర్మాణం విషయంలో కాని ఎక్కువ లబ్ధి పొందింది ఎస్సీ, ఎస్టీలే. కాని ఈ ప్రభుత్వం రాగానే ఇళ్లను ఎక్కడికక్కడే ఆపేశారు. మొదలు పెట్టని వాటికి, గ్రౌండ్‌లెవెల్‌లో వున్న వాటికి, మొదలు పెట్టి ఆపేసిన వాటికి, 25 శాతం మాత్రమే పూర్తి చేసిన వాటికి వీళ్లువచ్చిన తరువాత డబ్బులు చెల్లించే ప్రసక్తే లేదని చెబుతున్నారు. దీనివల్ల ఎక్కువగా ఇబ్బంది పడేది, అన్యాయమై పోయేది ఎస్సీ, ఎస్టీలు మాత్రమే అన్న సంగతి వీళ్లు తెలుసుకోవాలి. అట్లాగే మహిళా సంక్షేమం విషయంలో కాని మహిళా సాధికారత విషయంలో కాని ఎక్కువ పాటు పడింది ఒకే ఒక ముఖ్యమంత్రి మా దివంగత నేత వై.ఎస్.రాజశేఖర రెడ్డి మాత్రమేనని గర్వంగా చెప్పగలము. సంక్షేమ పథకాలతో, చరిత్రాత్మక నిర్ణయాలతో ఈ రాష్ట్రంలో ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయింది మా తిరుగు లేని నేత రాజశేఖర రెడ్డి మాత్రమే. సంక్షేమ పథకాలన్నది ప్రజలను సోమరిపోతులను చేయడానికే అని, వ్యవసాయం దండగ అని చెప్పిన చంద్రబాబు నాయుడు గారు ఈ రోజు సంక్షేమానికి పెద్దపీట వేశారని వాళ్లు చెప్పకోవడం చాలా బాధాకరం. ఒక చేనేత కుటుంబానికి చెందిన కోడలిగా నేను చెబుతున్నదేమంటే ఎన్నికల మేనిఫెస్టోలో చేనేత రుణాల విషయంలో కాని పవర్‌లూమ్

రుణాల విషయంలో కాని పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పిన ఈ ప్రభుత్వం యొక్క గవర్నర్ ప్రసంగంలో ఆ మాటే లేదు. బడ్జెట్‌లో దానికి ఏమి కేటాయించారో చెప్పమనండి. ఈ రోజు చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు ఐదు వేల కోట్ల రూపాయలున్నాయి. వాటిపై ఎటువంటి నిర్ణయాన్ని తెలియజేయకపోయినా మా తోటి సభ్యుడు మాత్రం చేనేత రుణాలు, పవర్‌లూమ్ రుణాలు మాఫీ చేస్తామని గొప్పగా చెప్పడం చూస్తుంటే మా తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడండి అన్నట్లుంది.

ఈరోజున ప్రజలు మనకు అధికారం ఇచ్చారు. ఏం చేస్తారోనని ప్రజలు చాలా ఆతృతతో ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్ధానాలను అమలు చేయమని ప్రభుత్వాన్ని ప్రతిపక్షం కోరుతుంటే, ఎప్పుడు చూసినా ప్రభుత్వం రాజశేఖరరెడ్డి గారి కుటుంబాన్ని, ప్రతిపక్షాన్ని తిట్టడం, గొంతు నొక్కడానికే ప్రయత్నం చేస్తుంటే ఎట్లా? మీరు ప్రజలకు ఏం చేయబోతున్నారని మేం అడుగుతుంటుంటే ఆ విషయాలేమీ ప్రభుత్వం చెప్పడం లేదు. నేను గట్టిగా ఒక విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించదలిచాను. ఈనాడు రాష్ట్రం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు ముఖ్య కారణం శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారే. బ్లాంక్ చెక్ పైన సంతకం చేసినట్టుగా తెలంగాణ రాష్ట్రాన్ని విడదీయమని ఆయన చెప్పడం వల్లే ఈనాడు మన రాష్ట్రం అన్ని ఇబ్బందులను ఎదుర్కొంటోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా ఇప్పుడు బాధపడితే లాభం లేదు. (మైకు ఆగిపోయింది)

శ్రీ కాలువ శ్రీనివాసులు: అధ్యక్షా............

మిస్టర్ స్పీకర్: చీఫ్ విప్ గారు మాట్లాడతారు. దయచేసి కూర్చోండి రోజా గారు. శ్రీనివాసులు గారు మీరు మాట్లాడండి.

శ్రీ కాలువ శ్రీనివాసులు(రాయదుర్గం): అధ్యక్షా, మా చెల్లెమ్మ శ్రీమతి రోజా గారు బీసీల సంక్షేమం, అభ్యున్నతి గురించి చాలా ఆవేశంగా మాట్లాడుతున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను నేను ఒకే విషయాన్ని అడుగుతున్నాను. సమాజంలో 52% పైగా ఉన్న వెనుకబడినవర్గాల సంక్షేమానికి సంబంధించిన చర్చ సభలో జరుగుతున్న సందర్భంగా ఎంత మంది బీసీ సభ్యులను ఈ చర్చలో ప్రసంగించడానికి అవకాశం కల్పించారో ఒకసారి మననం చేసుకోవాల్సిన అవసరముంది. బీసీల గొంతును ఎవరు నొక్కుతున్నారో అర్థం చేసుకోండి. శ్రీమతి రోజా గారు బీసీల అభ్యున్నతి గురించి మాట్లాడడం ఎట్లా సాధ్యమవుతుంది? శ్రీమతి రోజా గారో, చెవిరెడ్డి భాస్కరరెడ్డి గారో, శ్రీమతి చరితా రెడ్డి గారో బీసీల గురించి మాట్లాడతారా? ఈ రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్‌లను పెట్టించి, తద్వారా అక్రమంగా వసూలుచేసిన మొత్తాలతో అధిక వడ్డీలకు ఇప్పించి చాలా మంది మరణాలకు కారణభూతులైన డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు బీసీ సంక్షేమానికి పాటుపడినారనే విషయాన్ని శ్రీమతి రోజా

గారు చెబుతుంటే మేం వినాలా? బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు తల్లి. ముసుగువేసుకువచ్చి బీసీల సంక్షేమం గురించి మేం మాట్లాడతామంటే నమ్మేటటువంటి భ్రమల్లో ప్రజలు లేరు. దయచేసి అర్థం చేసుకోండి.

MR.SPEAKER: Please continue Roja garu....... You can continue.

శ్రీమతి ఆర్.కె. రోజా(నగరి): అధ్యక్షా, కాలువ శ్రీనివాసులు గారంటే నాకు చాలా గౌరవం ఉంది. కానీ వారు మాట్లాడుతూ, "బీసీల గురించి మాట్లాడే అర్హత మీకు లేదు" అని మాట్లాడుతున్నారు. ఇందాక ఒక బీసీ నాయకుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వమంటే ఇవ్వలేదు. ఒక మహిళగా నేను మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, అధికారపక్షం అడ్డుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరం. ఈరోజున నేను ఒక బీసీ వర్గానికి చెందిన చేనేత కుటుంబానికి చెందిన కోడలుగా బీసీల గురించి మాట్లాడే అర్హత, హక్కు నాకుందనే విషయాన్ని తెలుసుకోవాల్సిందిగా సభాముఖంగా అధికారపక్షానికి తెలియజేస్తున్నాను. న్యాయం చేయాలనే విషయాన్ని సంబంధిత వర్గాలకు చెందిన సభ్యుడే అడగనక్కర్లేదు. సమన్యాయం చేయమని ఏ వర్గానికి చెందిన సభ్యుడైనా కోరవచ్చు. ఒక నాయకుడు మంచిగా ఉంటే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందనే విషయం డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారిని తలచుకుంటే తెలుస్తుంది. రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందనే విషయాన్ని అధికార పక్షం గుర్తుచేసుకోవాల్సిన అవసరముందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. కానీ ఎంత సేపు అధికారపక్షం "పరనిందే పరమావధి" గా పెట్టుకుని, ప్రతిపక్షాన్ని తిట్టడానికి సమయాన్ని కేటాయించుకుంటోంది. కానీ అది ముఖ్యంకాదు. అధికారం కట్టబెట్టిన ప్రజలకు మీరు ఏం చేయబోతున్నారో చెప్పండి? చేనేత రంగానికి గాను ప్రభుత్వం తీసుకునే చర్యల గురించి గానీ బడ్జెట్‌లో కేటాయింపు చేసే దమ్ము, ధైర్యం గానీ ఈ ప్రభుత్వానికి లేదు. కనీసం గవర్నర్ ప్రసంగంలో కూడా అందుకు సంబంధించిన ప్రస్తావన చేయడానికి ప్రభుత్వానికి దమ్ము లేదు. కానీ, చేనేత రంగం గురించి అధికారపక్షం మాట్లాడుతుండడం సిగ్గుచేటుగా నేను భావిస్తున్నాను.

(అధికారపక్ష సభ్యుల నుంచి సభకు అంతరాయం)

ఈరోజున మహిళలకు కూడా అన్యాయం చేసింది ప్రభుత్వం. అదే విధంగా రైతులకు, చేనేత కార్మికులకు కూడా ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. మనం టి.వి.లో గానీ, పత్రికల్లో గానీ అడ్వర్‌టైజ్‌మెంట్లను, బయట హోర్డింగ్స్‌ను చూస్తుంటాం. "జీరో పర్సెంట్ వడ్డీకి అప్పులు ఇస్తాం" అని చెబుతుంటారు కానీ ఆ ప్రకటన క్రింద ఒక చుక్క పెట్టి "కండీషన్స్ అప్లై" అనే మాట కూడా ఉంటుంది. ఆ విధంగానే ఓటరు వేలి మీద సిరా చుక్కపడిన కారణంగా అధికారంలోకి రాగానే "కండీషన్స్ అప్లై" అంటూ ప్రతి హామీకి కోతలు పెట్టే ప్రయత్నాన్ని ఈ ప్రభుత్వం చేస్తోంది.

రైతులను, డ్వాక్రామహిళలను, చేనేత కార్మికులను బ్యాంకు అధికారులు దొంగలను చూస్తున్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యేలుగా ఉన్న మేం వాళ్లదగ్గరకు వెళ్లిన సందర్భంగా వాళ్ల బాధలు చెప్పుకున్నప్పుడు, ఆ బాధల పరిష్కారం విషయమై మేం బ్యాంకు అధికారులతో మాట్లాడడానికి వెళ్లినప్పుడు మా మీద కూడా దాడులు చేస్తున్న సంఘటనలు చాలా ఉన్నాయి.

అధ్యక్షా, ఈరోజున మేం అడిగేదేమిటంటే, సంక్షేమానికి బడ్జెట్‌లో మీరెన్ని కోట్లు కేటాయించారు? మహిళా సాధికారతకు మీరు తీసుకునే చర్యలేమిటి? ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు, మైనారిటీ వర్గానికి మీ ప్రభుత్వం ఏం చేయబోతోంది? ఆ అంశాల గురించి మీరు ప్రస్తావించండి. ఎప్పటి చరిత్రో తిరిగేసి మమ్మల్ని తిట్టడం సమంజసం కాదని సభాముఖంగా తెలియజేస్తున్నాను. బడ్జెట్ కేటాయింపులకు సంబంధించిన అంశాలను పెడచెవిన పెట్టి ఎప్పుడు చూసినా ప్రతిపక్షాన్ని తిట్టడానికి సమయాన్ని వినియోగించడం ఏమాత్రం అధికార పక్షానికి సమంజసం కాదనే విషయాన్ని కూడా మీ ద్వారా అధికారపక్షానికి తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి.శ్రావణ్ కుమార్(తాడికొండ): అధ్యక్షా, ఈరోజున సంక్షేమ పద్దు పైన..........

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి: అధ్యక్షా.........

మిస్టర్ స్పీకర్: రఘునాథరెడ్డి గారు మీరు మాట్లాడండి. శ్రావణ్ కుమార్ గారు మీరు దయచేసి ఒక నిమిషం కూర్చోండి.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి (పుట్టపర్తి) : అధ్యక్షా, శ్రీమతి ఆర్.కె.రోజాగారు తన ప్రసంగంలో మాట్లాడుతూ ఇందాక ఒక మాట చెప్పడం జరిగింది. "వ్యవసాయం దండగా అని" చంద్రబాబు నాయుడు గారు చెప్పినట్టుగా రోజా గారు చెప్పడం జరిగింది. చాలా సార్లు మేం ఆ విషయమై డిమాండ్ చేశాం. చంద్రబాబు నాయుడు గారు చెప్పినట్టుగా ఏ పత్రికలో వచ్చింది? ఏ టి.వి. ఛానల్‌లో వచ్చింది? ఏ రోజున చెప్పారు? పూర్తి వివరాలను చెప్పవల్సిందిగా కోరుతున్నాను.

అధ్యక్షా, ఆరోజున చంద్రబాబు నాయుడు గారు కూడా చెప్పిందేమిటంటే, వ్యవసాయం లాభసాటిలోకి రావాలి, రైతులే ఖర్చు తగ్గించాలి, ఉత్పత్తి పెంచాలి అని చెప్పడం జరిగింది. వీళ్ల లాగా గ్లోబల్ ప్రచారం మాత్రం మేం ఎప్పుడు చేయలేదు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులకు లేదు. కారణమేమిటంటే, వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు అధికారంలోకి రాకముందు ఎప్పుడూ ప్రజలకు ఒకే మాట చెప్పుకుంటూ వచ్చారు. "మేం అధికారంలోకి వస్తే ఈ రాష్ట్రంలో ఏ ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోడని" చెప్పాడు. కానీ ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత కనీవినీ ఎరుగని రీతిలో దేశంలోని ఏ ఇతర రాష్ట్రాల్లో కూడా జరగనంతగా దాదాపు ఐదు వేల మంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు

చేసుకున్నారు.  తద్వారా ఆత్మహత్యలప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చిన ఘనత రాజశేఖరరెడ్డి గారికే దక్కుతుంది.

అధ్యక్షా, చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు లక్ష కుటుంబాలకు రూ.35వేల కోట్ల మేరకు రైతు రుణాలను మాఫీ చేసిన ఘనత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్:  శ్రావణ్ కుమార్ గారు......

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల):  అధ్యక్షా........

మిస్టర్ స్పీకర్:  శ్రావణ్ కుమార్ గారు దయచేసి కూర్చోండి. జగన్మోహన్ రెడ్డి గారు మాట్లాడతారు.  జగన్‌మోహన్ రెడ్డి గారు మాట్లాడండి.

శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి(పులివెందుల): అధ్యక్షా, మంత్రి గారు ఒక విషయం తెలుసుకోవాలి. ఆనాడు చంద్రబాబు నాయుడు గారి హయాంలో ఎవరైతే రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారో వారి కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి లక్షన్నర రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని దివంగత నేత రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాతే ప్రభుత్వం తరఫున చెల్లించడం జరిగిందనే విషయాన్ని తెలుసుకోమని గౌరవ మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: శ్రావణ్ కుమార్ గారు మీరు మాట్లాడండి.

శ్రీ టి.శ్రావణ్ కుమార్(తాడికొండ):  అధ్యక్షా, ఈనాడు సంక్షేమ పద్దుకు సంబంధించిన డిమాండ్  మీద మాట్లాడే అవకాశం కల్పించిన గౌరవ సభాపతి గారికి మొదటగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. సంక్షేమం గురించి మాట్లాడడానికి 1983వ సంవత్సరానికి ముందు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీకి, అందులోని నాయకులకు ఎవరికి కూడా ఏ మాత్రం హక్కు లేదనే విషయాన్ని నేను స్పష్టంగా సభాముఖంగా తెలియజేసుకుంటున్నాను. ముఖ్యంగా సంక్షేమం అంటే "సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు" అనే నినాదం వినిపించిన స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు అన్న గారి సూక్తితో మొదలైన తెలుగు దేశం పార్టీ రెండు, మూడు అంశాల అమలులో స్పష్టంగా అధికారంలోకి వచ్చిన తరువాత చూపించింది.

అధికారంలో ఉన్న ప్రతిసారీ సంక్షేమాన్ని ఏ రకంగా తీసుకెళ్లిందో ఒకసారి గుర్తుంచుకోవాలి.  సంక్షేమంతోబాటు వారి అభివృద్ధిని కూడా రెండో  కన్నుగా చూసి ఈ రెండు

కళ్ళా ఉంటేనే ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని శ్రీ ఎన్.టి.రామారావు గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత ముందుకు వెళ్లిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. సంక్షేమం విషయంలో ఏయే అంశాల మీద సంక్షేమం కింద ప్రభుత్వాలు చర్చించాయో గుర్తు చేసుకుంటే విద్యలో ముందుండడం ముఖ్యమని గుర్తించారు. మొట్టమొదటిసారిగా కింది స్థాయి వర్గాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించాలని, వారిని అభివృద్ధిలోకి తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించింది స్వర్గీయ ఎన్.టి.రామారావు గారు, తెలుగుదేశం పార్టీ అనే సంగతి గుర్తు చేస్తున్నాను. అప్పటివరకు ఉన్న పాఠశాలల స్థానంలో రెసిడెన్షియల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడంతో అనేక వేల మంది కింది స్థాయి వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ రోజున ఉన్నత స్థానాలకు ఎదిగారంటే దానికి కారణం తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వం.

రెండోవది, గృహనిర్మాణ పథకం. 1983కు ముందు భారతదేశంలో కేంద్రంలో, రాష్ట్రాలలో ఎన్నో పార్టీల నాయకత్వంలో ప్రభుత్వాలు వచ్చినా పేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలనే ఆలోచన చేశారా అని ప్రశ్నిస్తున్నాను. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రాన్ని పరిపాలించినంత కాలం సంక్షేమంలో గృహనిర్మాణం గురించి పరిశీలిస్తే, వారు పేదలకు ఇంటికోసం ఒక్కొక్క కుటుంబానికి 25 తాటి ఆకులు, పది వెదురు బొంగులు మాత్రమే ఇచ్చి ఆ ఇళ్లలోనే ఉండమనేవారు. 1983లో ఎన్టీ రామారావు గారు అధికారంలోకి వచ్చిన తరువాత పేదవారికి కూడా పక్కా ఇళ్లు ఉండాలనే ఆలోచనతో పక్కా ఇళ్లు కట్టించాలని ఎన్నికలలో ప్రామిస్ చేసి నిర్మిస్తామని వారు చెప్పారు. ఆ కాలంలో నేను విద్యార్థిగా ఉన్నాను. అపుడు పత్రికలలో వారు పేదల కోసం పక్కా ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన వార్తను చదివాను. అప్పుడు శాసనసభ్యులుగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, ఇదేదో సినిమా సెట్టింగ్ అనుకుంటున్నారు ఎన్టీ రామారావు గారు, పక్కా ఇళ్లు కడతానంటున్నారు, అదెలా సాధ్యమన్నారు. కానీ పక్కా ఇళ్లు పేదవారికి ఎలా ఇస్తారని కూడా అన్నారు. కానీ చేసి చూపించిన ఘనత తెలుగుదేశం పార్టీది, ఎన్టీ రామారావు గారిది. భారతదేశంలో మొట్టమొదటిసారిగా సంక్షేమం కోసం పేదవాడికి పక్కా ఇళ్లు ఉండాలనే ఏకైన ఆలోచనతో అమలుచేసినది తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తు చేస్తున్నాను. అంతటి మంచి పథకాన్ని పేదవారి సంక్షేమం కోసం చేపట్టారు. పేదవర్గాలకు ప్రవేశపెట్టిన పథకానికి వీరు చేసినదేమంటే కేవలం ఆ పథకం పేరు మార్చారు. గౌరవనీయులు రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్లు అని పేరు మార్చారు. ఇందిరమ్మ ఇళ్లను ఒకసారి చూస్తే దాని విషయంలో కొన్ని వాస్తవాలు మీ దృష్టికి తీసుకురాదలచాను. పేదలకు పక్కా ఇళ్లను నిర్మించడం ప్రారంభించినది ఎన్టీ రామారావు గారు.

2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గత పది సంవత్సరాలలో గృహనిర్మాణంలో జరిగిన విషయాలను చర్చిస్తే తప్ప ఇపుడు ఇళ్లు ఎందుకు మంజూరు చేయడంలేదో, ఎందుకు తాత్కాలికంగా ఆగిపోయిందో, దాని వెనకాల ఉన్న కారణాలేమిటో, తిరిగి ఈ పథకంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత ఏ రకమైన విధానాలు

అవలంబించబోతున్నారో అర్థం కావడానికి చెబుతాను. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత, ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరవాత రాష్ట్రంలో పూర్తిగా పక్కా ఇళ్లు నిర్మించి గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని అంటే నిజంగా ప్రజలు నమ్మారు. ప్రజలు అలా నమ్మిన తరవాత ఒకసారి లెక్కలు చూస్తే అందులో మంజూరైన ఇళ్లు 71 లక్షలు కాగా, పూర్తయినవి రెండు లక్షలు, ఇంకా నిర్మాణం కావలసినవి పది లక్షలు, అసలు నిర్మాణమే మొదలుకానివి 16లక్షలు. పురోగతిలో ఉన్నవి 2.85లక్షలు. ఖర్చు అయిన నిధులు దాదాపు 19కోట్లు, దుర్వినియోగమైనది రూ.265కోట్లు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినవి 18.8లక్షలు. అసలు ఈ బోగస్ ఇళ్లు రావడానికి కారణం ముందుగా మంజూరు చేయడం. అప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను. అందుకోసం రెండు, మూడు నిమిషాలు సమయం తీసుకుంటాను. నేను శాసనసభ్యుడిగా కాక ముందు జిల్లా అధికారిగా పనిచేశాను. అప్పుడు రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఒక నియోజకవర్గానికి ఇళ్లు నిర్మించడానికి నేను ప్రత్యేకాధికారిగా పనిచేశాను. ఆ విషయంలో డిడిఆర్‌సి సమావేశంలో ఒక పెద్ద రభస జరిగింది. బోగస్ ఇళ్లు మంజూరు చేశారని అప్పుడు అధికార పార్టీకి చెందిన శాసనసభ్యులు అడిగారు. దాని మీద ఎంక్వైరీ ఆఫీసర్‌గా ఎంక్వైరీ చేసింది నేను. అందులో 65 నుంచి 70శాతం బోగస్ అని ఆరోజే తెలిసింది. ఎలా బోగస్ అని తేలిందో సభ దృష్టికి తీసుకురావాలి. ఎందుకంటే ముఖ్యంగా సభకు తెలియాల్సిన అంశమేమంటే, ఇళ్ల మంజూరుకు అర్హతగా రేషన్ కార్డును ఫిక్స్ చేశారు. ముఖ్యమంత్రిగా ఆయన శాచ్యురేషన్, శాచ్యురేషన్ అనే మాట చెప్పేవారు. శాచ్యురేషన్ పాయింట్ అంటూ రేషన్ కార్డును అర్హతగా ఫిక్స్ చేశారు. రేషన్ కార్డు కావాలన్న ప్రతివారి నుంచి రూ.500 లంచంగా తీసుకొని రేషన్ కార్డులిచ్చారు. రెండు ఇళ్లు నిర్మించుకోవడంకోసం అత్త పేరు మీద, కోడలి పేరు మీద, అక్క పేరు మీద, భార్య పేరు మీద తీసుకున్నారు. అసలు పేర్లు లేని చోట ఎక్కడో ఒకచోట రాసి చూపించారు. దీని వెనుక పూర్తి స్థాయిలో స్థానిక శాసనసభ్యులు, అక్కడి స్థానిక నాయకులు దుర్వినియోగం చేయడంతో రూ.265కోట్ల రూపాయలు దుర్వినియోగమయ్యాయి. నేను శాసనసభకు ఎన్నికైన తరవాత రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో చూశాకనే నాకు అర్థమయింది. సంక్షేమం పేరుతో బోగస్ ఇళ్లు మంజూరుచేసి, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారు.

జగన్మోహన్‌రెడ్డిగారు గృహనిర్మాణానికి ప్రభుత్వం కేటాయింపులు చేయలేదని, నాన్‌ప్లాన్‌లో పెట్టారని ప్రభుత్వాన్ని విమర్శించిన విషయం ఉదయం నేను సాక్షి పత్రికలో చూశాను. గౌరవనీయ ఆర్థిక మంత్రి గారు చాలా వివరంగా నిన్న సభలో వివరించారు. ఎందుకు నాన్‌ప్లాన్‌లో వస్తుందో, ప్లాన్‌లో ఎందుకు వస్తుందో చాలా వివరంగా చెప్పారు. వారు సభలో ఉండి గౌరవ మంత్రి గారు చెప్పిన మాటలు విని ఉంటే వారికి స్పష్టంగా తెలిసి ఉండేది, ఈ విధంగా స్టేట్‌మెంట్ ఇచ్చేవారు కాదు. నాన్‌ప్లాన్ వ్యయం ఎందుకు వస్తుందో, ఎందుకు పెట్టారో తెలియకుండా స్టేట్‌మెంట్ ఇచ్చారు. గృహనిర్మాణానికి కేటాయింపులను ఇపుడు మీ దృష్టికి తెస్తున్నాను. గతంలో ఆయా పథకాలకు చేసిన కేటాయింపులు కూడా మీ దృష్టికి

తెస్తున్నాను. కేటాయింపులు విపరీతంగా చేసినా ఖర్చు చేసింది చాలా తక్కువ. గృహనిర్మాణానికి 2004-05లో రూ.775కోట్లు కేటాయించి కేవలం రూ.900లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. 2005లో రూ.797కోట్లు కేటాయించి రూ.684కోట్లు, 2006లో రూ.1824కోట్లు కేటాయించి రూ.1035కోట్లు, 2008లో రూ.5844కోట్లు కేటాయించి రూ.3207కోట్లు ఖర్చు పెట్టారు. 2009లో రూ.5850కోట్లు కేటాయించి రూ.4083కోట్లు ఖర్చు పెట్టారు. మరొక విషయమేమంటే ఈ కేటాయింపులు జరిపినపుడు అందులో ఖర్చులను చూస్తే గృహనిర్మాణానికి పూర్తిగా వినియోగించలేదు. నేను అ సబ్జెక్ట్‌ను పూర్తిగా స్టడీ చేశాను కాబట్టి చెబుతున్నాను. అపుడు గృహనిర్మాణం భారీగా జరుగుతుందని చెప్పినపుడు సిమెంట్, స్టీల్, ఇటుక, ఇసుక ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యమంత్రి కొన్ని లక్షల ఇళ్లు నిర్మిస్తానని చెప్పగానే స్టీలు ధర టన్ను రూ.6500 నుంచి రూ.55,000లకు పెరిగింది. సిమెంట్ ధర రూ.65 నుంచి రూ.225కు, ఆ తరవాత రూ.260కి పెరిగింది. దీనిమీద సభలో గొడవ జరిగింది. ఆ తరవాత ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ అవసరమైతే సిమెంట్ కంపెనీలకు జాతీయం చేస్తామని, పేదవారి ఇళ్ల నిర్మాణానికి సిమెంట్‌ను తక్కువ ధరకే ఇస్తామని చెప్పారు. ఆ విషయమై రోశయ్య అధ్యక్షతన ఒక కమిటీని వేశారు. కానీ చివరగా తేలిసిందేమిటంటే సిమెంట్ బస్తా రూ.230/-లకు అమ్ముకోవచ్చునని చెప్పారు. గృహనిర్మాణ వ్యయం ఎందుకు పెరిగింది? దొంగ పేర్లతో దొంగ బిల్లులు పెట్టి ఇళ్లు మంజూరు చేయించుకున్నారు. రాజశేఖర్ రెడ్డి గారు చనిపోయిన తరవాత వచ్చిన ముఖ్యమంత్రి గారు కూడా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. రచ్చబండ కార్యక్రమానికి ఎన్ని లక్షల ఇళ్లకు అప్లికేషన్స్ వచ్చాయో, ఎన్ని ఇళ్లు కట్టారో చూస్తే తెలుస్తుంది. అంటే కేటాయింపులు ఎక్కువ జరిపి అవసరమైన చోట్ల కాంట్రాక్టర్లు, దళారులు చేరి ఈ రాష్ట్ర ధనాన్ని దోచుకున్నారు.

సంక్షేమం గురించి చెప్పాలంటే ఎస్సీ, ఎస్టీలకు సంబంధం లేని అంశాల మీద నిధులు మళ్లాయి. రింగురోడ్డు, హుస్సేన్ సాగర్ ప్రక్షాళన చేయడానికి ఎస్సీ, ఎస్టీ నిధులు వాడారు. బాపుఘాట్ దగ్గర బ్రిడ్జి నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీ నిధులు వాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పాదచారుల కొరకు కట్టిన వంతెన నిర్మాణం కొరకు ఎస్సీ, ఎస్టీ నిధులు వాడారు. ఎంఎంటిఎస్ రైలు ప్రాజెక్టుకు ఎస్సీ, ఎస్టీ నిధులు వాడారు. మెట్రో రైలు ప్రాజెక్టుకి ఎస్సీ, ఎస్టీ నిధులు వాడారు. ప్రభుత్వం ఇచ్చే అడ్వర్‌టైజ్‌మెంట్లకు ఎస్సీ, ఎస్టీ నిధులు వాడారు. హైవోల్టేజీ లైన్లు వేయడానికి ట్రాన్స్‌కోకు ఎస్సీ, ఎస్టీ నిధులు వాడారు. ఇదే అంశాన్ని గతంలో చూస్తే తెలుగుదేశం ప్రభుత్వం 1986 లోనే ఎస్సీ, ఎస్టీ నిధులను మళ్లించకూడదని ఒక మెమో ఇచ్చింది. తేదీ. 12.05.1986 లో జీఓ నెం.261ను ఇచ్చి ఎస్సీ, ఎస్టీ నిధులను మళ్లించకూడదని చెప్పిన అంశాన్ని మీదృష్టికి తీసుకువస్తున్నాను. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారానే ఖర్చు పెట్టాలని తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన జీఓను కూడా మీదృష్టికి తీసుకువస్తున్నాను.

రెసిడెన్షియల్ స్కూళ్లు గానీ ఇతర అంశాల మీద గానీ లైయింగ్ డిపార్ట్‌మెంట్లకు ఇవ్వకుండా కేవలం ఈ కార్పొరేషన్‌కే ఇచ్చి వారి ద్వారానే డబ్బులు ఖర్చు పెట్టించే చర్యలు తెలుగుదేశం పార్టీ చేసింది. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ చేసినంతగా ఏ పార్టీ కూడా చేయలేదనే విషయాన్ని సభాముఖంగా తెలియచేస్తున్నాను. ఎస్సీ, ఎస్టీల కొరకు ఉద్యమం చేస్తే ఆ ఉద్యమంలో భాగంగా చంద్రబాబు నాయుడు గారు జస్టిస్ పున్నయ్య గారి కమీషన్ వేశారు. ఆ కమీషన్ 42 సిఫారసులను చేస్తే ఆ సిఫారసులన్నింటినీ ఆమోదించి ఆయన్నే ఎస్సీ, ఎస్టీ కమీషన్‌కు ఛైర్మన్‌గా నియమించింది. అంటే నిష్పక్షపాతంగా ఒక జడ్జిగారిని నియమించి ప్రజలకు ఉపయోగపడే రీతిలో తీసుకు వచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వానిదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. తరువాతి కాలంలో ఎస్సీ, ఎస్టీ కమీషన్‌ను 10 సంవత్సరాల కాలంలో 4 సంవత్సరాలు మాత్రమే ఛైర్మన్‌ను నియమించారు. ఎలాంటి వ్యక్తులను నియమించారో చూస్తే ఎస్సీ, ఎస్టీల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుంది. చంద్రబాబు గారు రిటైర్డ్ జడ్జిని ఛైర్మన్‌గా నియమిస్తే తరువాతి కాలంలో ఇప్పటి వరకూ ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ లేరు. చిత్తశుద్ధి తెలుగుదేశం ప్రభుత్వానికి కాక మరెవరికి ఉంది. తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమే ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి చేసింది.

కేటాయింపుల విషయానికొస్తే ప్రస్తుత బడ్జెట్‌లో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఎకనమిక్ సపోర్ట్ కోసం, కులాంతర వివాహాల కోసం, ఇంటి స్థలాలు, పట్టాల కోసం డబ్బులు కేటాయించారు. కమ్యూనిటీ హాళ్ల కోసం, అంబేద్కర్ భవనాల నిర్మాణం కోసం బడ్జెట్ కేటాయించారు. విద్యలో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో స్టడీ సర్కిల్‌కి, స్టడీ సర్కిల్ బిల్డింగులకి, ఎస్సీ, ఎస్టీ కమీషన్‌కి కూడా డబ్బులు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద అనేక రకాల కేసులుంటాయి. ఆ కేసుల కోసం, అందులో పనిచేసే వ్యక్తుల కోసం, దాంట్లో వచ్చే కాంపన్సేషన్ కోసం డబ్బులు కేటాయించింది ఈ బడ్జెట్‌లోనే అనే విషయాన్ని తెలియచేస్తున్నాను. ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేసిన ఘనత రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వానిది. ఆయన మీటింగులకు వెళ్లినప్పుడు ప్రతీ దళితుణ్ణి టాటానో, బిర్లానో చేస్తాననేవారు. టాటా, బిర్లాల లాగా ఒక్కరు కూడా లేరు గానీ ఆయన కొడుకు గారు మాత్రం టాటా, బిర్లాల కంటే గొప్పవాడయ్యారు. మేము మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాం. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా, ఇచ్చిన సంక్షేమ పథకాలకు కూడా మార్జిన్ మనీ రిలీజ్ చేయకుండా బ్యాంకుల మీద ఆధారపడేలాగా చేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులందరూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. మార్జిన్ మనీని రద్దు చేయడం వలన ఎస్సీ, ఎస్టీలకు రుణాలు రాక బ్యాంకు వాళ్లు ఒప్పుకుంటే తప్ప ఎస్సీ, ఎస్టీలు ముందుకెళ్లే పరిస్థితి లేకుండా చేసిన ఘనత రాజశేఖర్ రెడ్డి గారిది. ఆయన ఇచ్చిన జీఓ మూలంగా, ఆయన వద్దనడం మూలంగా నేషనల్ ఎస్సీ కమీషన్ నుంచి వచ్చే గ్రాంట్స్ కూడా రాలేదు. అందుకనే ఈ ప్రభుత్వం ఖచ్చితంగా ఎస్సీ కార్పొరేషన్ కోసం డబ్బులు కేటాయించింది.

మిస్టర్ స్పీకర్ః ప్లీజ్ కన్‌క్లూడ్.

శ్రీ యనమల రామకృష్ణుడు (ఆర్థిక శాఖా మంత్రి) ః అధ్యక్షా, సభ్యుల దగ్గర చాలా సబ్జెక్ట్‌లుండవచ్చు గానీ మన దగ్గర టైము లేదు. మ.2.00 గంటలకు మీరు సభను వాయిదా వేస్తారు. ఈలోపల మాట్లాడే వాళ్ల లిస్టు కూడా ఉంది. వీలైనంత వరకూ మాట్లాడే వాళ్ల సంఖ్యను తగ్గించుకోవాలి. తరువాత మాట్లాడే సమయాన్ని కూడా తగ్గించుకోవాలి. ఇంకా ముగ్గురు మంత్రులు సమాధానాలు కూడా ఇవ్వాలి.

శ్రీ టి.శ్రావణ్ కుమార్ (తాడికొండ)ః మైక్రో ఫైనాన్స్ విషయానికొస్తే, మైక్రో ఫైనాన్స్ ద్వారా ఎంతో మంది అప్పులపాలయ్యారు. వారం వారం మహిళలు డబ్బులు కట్టడానికి ఎంతో భయపడిపోయారు. ఈ రాష్ట్రంలో దాన్ని పెంచి పోషించింది ఎవరు? విశాఖపట్టణం వాకపల్లిలో మహిళలు చనిపోతే ఆ అంశం మీద సభా సంఘం వేయమని అడిగితే గిరిజనుల గురించి పట్టించుకున్నారా? తెలుగుదేశం పార్టీ ఆరోజు అనేక రకాలుగా డిమాండ్ చేస్తే మసిపూసి మారేడు కాయ చేసి ఏరకమైన ఎంక్వైరీ సక్రమంగా జరపకుండా అదేదో కావాలని జరిగినట్లుగా చెప్పిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. సంక్షేమం కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో స్పష్టంగా పని చేస్తుంది. వివిధ రంగాల్లో, వివిధ గ్రాంట్లను రిలీజ్ చేసింది. అది చదవడానికి సమయం లేదు కాబట్టి స్పష్టమైన విధానాలతో ముందుకు వెళుతున్నది. క్రింది వర్గాల వారి సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని తెలియచేసుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీ పీడిక రాజన్నదొర(సాలూరు)ః అధ్యక్షా, డిమాండ్స్ మీద మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. డిమాండ్స్ మీద మాట్లాడే ముందు సబ్‌ప్లాను గురించి తమ ద్వారా ప్రభుత్వానికి, గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. సబ్‌ప్లాను వచ్చింది 1975వ సంవత్సరంలో, దీనికి చట్టం చేసింది 2013వ సంవత్సరంలో. 1975వ సంవత్సరం నుంచి ఏ ప్రభుత్వం వచ్చినా, ఏ ముఖ్యమంత్రి వచ్చినా దారి మళ్లించడం గానీ, ల్యాప్స్ కావడం గానీ జరుగుతూనే ఉంది. కానీ కేవలం రాజశేఖర్ రెడ్డి గారినే లక్ష్యం చేసుకోవడం మంచిది కాదని తమరి ద్వారా మనవి చేస్తున్నాను. నేను ఎవర్నీ విమర్శించడం లేదు.

నేను సబ్‌ప్లాను చట్టానికి సంబంధించి గౌరవ మంత్రి గారిని మొన్ననే ప్రశ్నించడం జరిగింది. ఇప్పుడు తమరి ద్వారా అడిగేది ఏమిటంటే చట్టం చేసే సమయంలోనే అందులో ల్యాప్స్ ఉన్నాయని నేను అంటే అప్పుడున్న మా గిరిజన మంత్రులే చట్టం ముందు రానివ్వు, తరువాత దాంట్లో ఉన్న ల్యాప్స్ గురించి మాట్లాడదాం అన్నారు. భారతదేశంలో ఇంత వరకూ చట్టం లేదు కాబట్టి మీరు పట్టుబట్టవద్దు అని చెబితే తగ్గాము. కాబట్టి ఇప్పుడు కూడా తమరి

ద్వారా ప్రభుత్వానికి, గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను. ఇప్పటి నుంచైనా సరే ఈ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లానుకు కేటాయించే డబ్బులు ఎట్టి పరిస్థితుల్లోనైనా డైవర్ట్ కాకుండా, ల్యాప్స్ కాకుండా మిగిలిన డబ్బులను క్యారీఫార్వర్డ్ చేయాలని తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, డిమాండ్స్‌లోకి వస్తున్నాను. ఈరోజు మానవ అభివృద్ధి సూచికను చూస్తే (Human Development Index) దీంట్లో 74 పేరామీటర్లు ఉంటాయి. ఏ పేరామీటర్‌ను చూసినా అట్టడుగున అణగారిన గిరిజన వర్గాలే ఉంటున్నాయి. మేము దేశం కోసం ప్రాణాలర్పించాము. ఆరోజు అల్లూరి సీతారామరాజుతో కలిసి పోరాటంలో మన్నెందొర, గంటందొర, అగ్గిదొర, వీరందొర అనేక మంది గిరిజన యోధులు ప్రాణత్యాగం చేశారు. మా నియోజక వర్గంలో కొర్రయ్యదొర, మంగయ్యదొర అల్లూరి సీతారామరాజుతో కలిసి పోరాటం చేశారు.

ఇంత మందిమి మేము పోరాటం చేస్తే ఈరోజున మా స్థాయి ఎక్కడ ఉంది? అట్టడుగున ఉన్నాము. నేను ఏ ప్రభుత్వాన్ని విమర్శించడం లేదు. తమరి ద్వారా అనేక సమస్యలు, వాస్తవాలు, నిజాలను, డిమాండ్లను మాత్రమే నేను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాను. ఏ వ్యక్తుని గానీ ఏ ప్రభుత్వాన్ని గానీ నేను విమర్శించదల్చుకోలేదు. అదేమాదిరిగా ఈ రోజు రాజశేఖరరెడ్డి గారి గురించి చెబుతున్నారు. ఆయన హయాంలో 48 లక్షల గృహాలను నిర్మించారు. వాటిలో 60 శాతం కంటే ఎక్కువ గృహాలను పొందిన వారిలో హరిజన గిరిజనులే ఉన్నారు. తప్పులు జరిగాయంటే, ఏ ప్రభుత్వంలోనైనా తప్పులు జరుగుతాయి. నేను ఏమి చెబుతున్నానంటే, మొన్న గౌరవ మంత్రి గారు స్టేట్‌మెంట్ ఇచ్చేటప్పుడు మధ్యలో నిలబడి నేను చెప్పాను. మీరు విచారణ జరిపించండి, కఠిన నిర్ణయాలను తీసుకోండి, కానీ ముందు ఇల్లుకు బిల్లివ్వండి, అందరూ అప్పులపాలై ఉన్నారు, ముఖ్యంగా పేదవాళ్లైన హరిజన గిరిజనులు దాంట్లో ఉన్నారు, తప్పు చేస్తే కఠినంగా శిక్షించే విధంగా రికమెండ్ చేయండి, ఎవరున్నా పర్వాలేదు, ఈవెన్ నేనున్నా క్రిమినల్ చర్యలను తీసుకోండని  కోరడం జరిగింది. కానీ ఇల్లు బిల్లును ఆపొద్దని కోరుతున్నాను. క్రొత్తగా ఇల్లు ఇవ్వండి. మాకు రెండు లక్షల యాభై వేలు ఇస్తామని గౌరవ మంత్రి గారు డిమాండ్లలో పొందుపరిచారు. చాలా సంతోషం. కానీ దానిని ఎప్పుడు ఇస్తారనేది కూడా చెప్పాల్సిన అవసరం ఉంది. అదే విధంగా 17లక్షలు ఉన్న పెన్షన్లను రాజశేఖరరెడ్డి గారి హయాంలో 71 లక్షలకు పెంచారు. వీటిలో 40శాతం కంటే పైగా హరిజన గిరిజన పేదవాళ్లు ఉన్నారు. దీనిని కూడా కాదంటే ఎట్లా? ప్రతి విషయంలో రాజశేఖరరెడ్డి గారిని టార్గెట్ చేయడం జగన్ గారిని నిందించడం ఎంత వరకు సబబు అని అడుగుతున్నాను. నేను ఎవరినీ విమర్శించడం లేదు, వాస్తవాలను చెబుతున్నాను.

అదేవిధంగా, ప్రాణదాత ఆరోగ్యశ్రీని ఇచ్చాడు. ముఖ్యంగా గిరిజనుల గురించి చెప్పాలంటే 6లక్షల ఎకరాల భూమిని గిరిజనులకు కేటాయించిన ఏకైక ముఖ్యమంత్రి రాజశేఖర

రెడ్డి గారు. అటువంటి మంచి వ్యక్తిని పట్టుకొని ప్రతి ఒక్కరూ విమర్శించుకుంటుపోతుంటే, విమర్శలు కాదు వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురండి. హరిజన గిరిజనులకు ఏవైనా మంచి పనులు చేయాలంటే ప్రభుత్వమే చేయాలి. ఏ ప్రభుత్వమైనా నేను ఎవ్వరినీ విమర్శించదల్చుకోలేదు.

అదేవిధంగా మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 68 సంవత్సరాలు అయ్యింది. ఈరోజుకు కూడా మా పరిస్థితులు ఎలా ఉన్నాయి? మా పోరాటాలన్నీ ఆస్తుల కోసమో, అంతస్తుల కోసమో, పదవుల కోసమో చేయలేదు. ఈ దేశానికి స్వాతంత్ర్యం వస్తే బాగుంటుంది ఆ స్వాతంత్ర్య దేశంలో మాకు మంచి స్థానం ఉంటుందని మేము పోరాటం చేశాము. కానీ ఈరోజున మేము అట్టడుగు స్థానంలో ఉన్నాము. అందుకే అడుగుతున్నాము.

డా.వైఎస్ రాజశేఖర రెడ్డి గారు అధికారంలోకి రాక ముందు మా పరిస్థితి ఎలా ఉందంటే 'గిరి మీద గిరిజనుడు – ఊరి చివరన దళితుడు' ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మా హరిజన గిరిజనుల పరిస్థితి ఇలా ఉంది. గిరి మీద గిరిజనులు ఉన్నారు, ఊరి చివరన దళితులు ఉన్నారు. కానీ వైఎస్.రాజశేఖరరెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తర్వాత గిరి దిగిన గిరిజనుడు – దరి చేరిన దళితుడు, రాజశేఖరరెడ్డి గారు వచ్చిన తర్వాత గిరిజనుణ్ని కొండ మీద నుండి క్రిందకు దించాడు, ఊరి చివరి నుండి దళితుడ్ని లోపలికి తీసుకొచ్చాడు. అందుకని, ప్రతి ఒక్కరు ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం మంచిది కాదని మనవి చేస్తున్నాను. అదేవిధంగా అభివృద్ధి వైపు కొంత అడుగులు వేశామంటే, అట్టడుగు నుంచి పైకి లేచామంటే, దానికి కారణం రాజశేఖరరెడ్డి గారని చెప్పాలి. కొంత ఎన్‌టి రామారావు గారు కూడా చేశారు. అందుకే ఆ మహనీయుడు అంటే మాకు గౌరవం. మా తండ్రి గారు అప్పట్లో తెలుగుదేశం పార్టీలో ఉండే వారు. నాకు కాంగ్రెస్ పార్టీలో సీటు ఇవ్వమని కూడా ఆయనే చెప్పారు. మా కుటుంబానికి ఎన్‌టి రామారావు గారంటే ఎంతో అభిమానం. అలాగే రాజశేఖరరెడ్డి గారు చేసిన దానిని కూడా మనం కాదనకూడదు. తప్పులుంటే ఎత్తిచూపాలి. అలాగే ఎన్నో పూరి గుడిసెలు ఉన్నాయి, ఎక్కడ చూసినా పూర్తికాని ఇళ్లు ఉన్నాయి. వాటన్నింటినీ పూర్తి చేయాల్సిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అలాగే మా మానవ వనరులను కొల్లగొడుతున్నారు. మా ఆస్తులను ఆక్రమిస్తున్నారు. వాటిని రక్షించమని కోరుతున్నాము. మా సామాజిక హోదాను, మా కులాన్ని అడ్డుపెట్టుకొని చాలా మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎంపీలు, ఎంఎల్ఏలుగా చెలామణి అవుతున్నారు. దానిని కాపాడమని అడుగుతున్నాం. నేను 2006వ సంవత్సరంలో నూతనంగా ఎమ్మెల్యేనైన వెంటనే కోర్టుకెళ్లి ఆ అంశం మీద పోరాటం చేయడం జరిగింది. కానీ ఎంత మంది గిరిజనులు కోర్టుకెళ్లి పోరాడగలరు? కాబట్టి అటువంటి పోరాటాలు లేకుండానే చట్టాలను కఠినతరం చేయాలి. ఏ అధికారి అయితే దొంగ గిరిజన సర్టిఫికెట్లను ఇస్తున్నారో ఆ అధికారిని కఠినంగా శిక్షించాలి.

ఎవరైతే దొంగ సర్టిఫికెట్లను తీసుకుంటున్నారో వారి నుండి అన్నింటినీ రికవరీ చేయాలి. వారి మీద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూడా తమరి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

అంతేకాదు ఐటిడీఏలను, ఎస్సీ కార్పోరేషన్లను, బీసీ కార్పోరేషన్లను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. మా జనాభా ప్రాతిపదికన గిరిజనులకు 5.33శాతం, మా దళిత సోదరులకు 17.1శాతం నిధులను కేటాయించాలి. ఎదగండీ.. ఎదగండీ..ఎదగండీ.. అంటే ఏ విధంగా ఎదుగుతాం అధ్యక్ష.. మేము అణగారిన వర్గాలము, అట్టడుగున ఉన్నాము, మేము ఎదగాలంటే ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రిగారు కావచ్చు, గౌరవ మంత్రిగారు కావచ్చు, ఈ శాతాన్ని పెంచాలి. గిరిజనులకు 15శాతానికి, హరిజనులకు 30శాతానికి పెంచినట్లయితే మేము సమాజ స్థాయికి ఎదుగుతాము. ఒక 5సంవత్సరాలో 10సంవత్సరాలో ప్రణాళికలను రూపొందించి, ఆ ప్రణాళికలను అమలు చేస్తే మేము అందరితో సమాజ స్థాయికి ఎదుగుతాము. అట్లాకాకుండా జనాభా ప్రాతిపదికన పెంచితే మా స్థాయి ఇక్కడే ఉంటుంది. మేము ఎదగలేమనే విషయాన్ని తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

మొన్న మీ ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలుగుదేశం పార్టీ పొందుపరచిన అంశాల గురించి అడుగుతున్నాను. నేను మిమ్మల్ని ఎక్కడా విమర్శించడం లేదు. 50 సంవత్సరాలు నిండిన గిరిజనులకు రూ.1000 చొప్పున పెన్షన్ ఇస్తామన్నారు. ఆ అంశాన్ని డిమాండ్స్‌లో గానీ, బడ్జెట్‌లో గానీ ఎక్కడ పొందుపరచారో చూపించాల్సిందిగా కోరుతున్నాను. అదే విధంగా గిరిజన మహిళకు వివాహం అయితే రూ.50వేలు ఇస్తామని చెప్పారు. ఆ రూ.50వేల గురించి డిమాండ్స్‌లో గానీ, బడ్జెట్‌లో గానీ, ఎక్కడ పొందుపరచారో చూపించాల్సిందిగా అడుగుతున్నాను. అదే విధంగా మా సాంప్రదాయాలను, మా ఆచారాలను, మా ప్రకృతి దైవాలను కాపాడటం కోసం, మా గిరిజన పూజారికి రూ.5000 ఇస్తామని చెప్పారు. ఆ అంశాన్ని బడ్జెట్‌లో ఎక్కడ పొందుపరచారో చూపించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అలాగే గత శాసనసభలో గిరిజన కమీషన్‌కి సంబంధించిన బిల్లును ఆమోదించడం జరిగింది. దానికి చట్టాన్ని తీసుకురావాలి. జీఓలను జారీ చేయాలి. అలాగే మాకు గిరిజన యూనివర్శిటీని ఇస్తామని చెప్పారు. దీనికి సంబంధించి కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు గారు 3000 వేల ఎకరాలను ఉచితంగా ఇస్తామని చెప్పారు. కాబట్టి మా సాలూరు నియోజకవర్గంలోనే ఆ స్థలం ఉంది. ఆ స్థలాన్ని తీసుకొని, గిరిజన యూనివర్శిటీని కూడా త్వరగా మంజూరు చేయాల్సిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అలాగే మాకు వనరులు ఉన్నాయి, మా వనరులను మా అనుమతితో, మా పీసా చట్టంతో, మా గ్రామ సభ ద్వారా తీసుకోవాలి. అది బాక్సైట్ కావచ్చు లేక మరొక గనికి సంబంధించిన అంశం కావచ్చు. గ్రామసభలో మీరు పబ్లిక్ హియరింగ్ పెట్టండి గిరిజనుల మనోభావాలను చూడండి, పర్యావరణం పరిస్థితి ఎలా ఉన్నా, అక్కడ ముఖ్యంగా బాక్సైట్‌ని

త్రవ్వేటప్పుడు రాక్‌పాట్ అనేది బయటకు వస్తుందని, అది విషపూరితమవుతుందని తెలిసింది. ఇప్పటికే కొండ చరియలు విరిగిపడటం వల్ల, పాము కాటు వల్ల, దోమ కాటు వల్ల ఎక్కువగా బలైపోతుంది హరిజన గిరిజనులు మాత్రమే. కాబట్టి ఇవి జరగకుండా ఉండాలంటే మా మనోభావాలను లెక్కలోకి తీసుకొని, మా అంగీకారంతో చేయాలని తమరి ద్వారా మనవి చేస్తున్నాను. ఆ విధంగా చేయకపోతే, దీని గురించి నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికే కొన్ని దిన పత్రికల్లో తమరు చూసి ఉంటారు. అక్కడి పరిస్థితులన్నింటినీ మా సాంప్రదాయ ఆయుధాలతోటే, మా గిరిజనులు కవాతులు చేస్తున్నారు. కాబట్టి, అటువంటి పరిస్థితులు రాకుండా చూడాలి.

అదేవిధంగా ఎడ్యుకేషన్‌కి సంబంధించి ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం మీద ఎనిమిది స్కూల్స్ ఉన్నాయి. వాటికి సంవత్సరాల తరబడి నిధులు రావడం లేదు. అవసరమైన నిధులను విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా గౌరవ మంత్రిగారికి తమరి ద్వారా మనవిచేస్తున్నాను. ముగించే ముందు కొన్ని డిమాండ్లను తమరి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాను. తమరు ప్రభుత్వానికి చెప్పి మాకు అవకాశమిస్తే, మేము చంద్ర మండలానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాము. మొన్ననే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి వచ్చిన మా పూర్ణ గిరిజన అమ్మాయికి మనం ధన్యవాదాలను కూడా తెలిపాము. అలాగే మా ఆనంద్ ఎస్సీ అబ్బాయి వీరిద్దరు కూడా ఎవరెస్ట్ శిఖరాన్ని ఆధిరోహించారు. మీరు అవకాశమిస్తే ఇంకా మేము చంద్ర మండలానికి కూడా వెళ్లగలము.

అదేవిధంగా, మా హరిజన గిరిజనులందరికీ పక్కా ఇళ్లను నిర్మించాలి, ఆ ఇళ్లకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా ఉండే విధంగా చూడాల్సిందిగా కోరుతున్నాను. అదేవిధంగా కొండ మీద, కొండ క్రింద ఉన్న అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలి. ప్రస్తుతం చాలా గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. కాబట్టి అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయాల్సిందిగా కోరుతున్నాను. అలాగే త్రాగు నీరు లేకపోవడం వలన ఇంకా మేము చాలాచోట్ల బురద నీరు, గుడ్డ నీరు త్రాగుతున్నాము. అన్ని గిరిజన గ్రామాలకు హరిజన వాడలకు మంచి నీటి సౌకర్యాన్ని కల్పించాల్సిందిగా కోరుతున్నాను. అలాగే రోడ్లు.. మా గిరిజన గ్రామాల నుండి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు వీలుగా రోడ్లను, లింకు రోడ్లను ఏర్పాటు చేయాలి. వాగులు, గడ్డలు ఉన్న చోట్ల బ్రిడ్జీలను కల్వర్టులను కూడా నిర్మాంచాల్సిందిగా కోరుతున్నాను.

ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించి 104, 108 సర్వీసులు మాదిరిగా ఒక మొబైల్ హెల్త్ క్లినిక్‌ని ఏర్పాటు చేయాలి. 104, 108 సర్వీసులు అనగానే రాజశేఖరరెడ్డి గారు గుర్తుకు వస్తారు. కాబట్టి 108కి ప్రస్తుతం ఉన్న పేర్లను మార్చుకుంటే మాకేమి అభ్యంతరం లేదు. 108 వాహనానికి ఎన్‌టి రామారావుగారి పేరు పెట్టండి, లేకపోతే చంద్రబాబునాయుడుగారి పేరు పెట్టండి. ఎవరి పేరు పెట్టినా 108 వాహనం మాత్రం నిత్యం తిరగాలి. గిరిజనులకు ఎప్పుడు

అవసరమైనా అరగంట లోపు మా గిరిజనులను ఆదుకునేవిధంగా అందుబాటులో ఉండేలా చూడాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. బీసీ కులానికి చెందిన గొప్ప నేత శ్రీ కె.ఎర్రంనాయుడు గారు ఈ మధ్యనే చనిపోయారు. ఎర్రం నాయుడు గారికి యాక్సిడెంట్ జరిగినప్పుడు, ఆ వాహనం ఆక్సిజన్ లేకుండా వెళ్లడం వలన వారు చనిపోయారు లేకపోతే బ్రతికి ఉండేవారేమో కాబట్టి అంటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ఇటువంటి వాహనాలను ప్రవేశపెట్టడం అవసరం.

అలాగే ఎమర్జెన్సీ సర్వీసుల క్రింద ఎక్స్‌టెన్షన్ సర్వీసులు ఉండాలి. అలాగే పశుసంపదను కాపాడటానికి వెటర్నరీ సర్వీసెస్ ఉండాలి. మా భూమి అక్కడి పండే పంటలకు సంబంధించి, జబ్బులకు సంబంధించి, నిత్యం డాక్టర్లు అందుబాటులో ఉండేవిధంగా చూసినట్లయితే మిగతా వారు కూడా అందుబాటులో ఉంటారు.

అధ్యక్షా, విద్యకు సంబంధించిన విషయాలను ఇప్పటికే తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ కళాశాలలను ఏర్పాటు చేయాలి. అవసరమైతే గిరిజన హాస్టళ్లను మూసివేసి వాటి స్థానంలో రెసిడెన్షియల్ కళాశాలలను, గురుకులాలను ఏర్పాటు చేయాలి. ఎందుకంటే చదువుకోవాలనే ఎస్టీ విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో ఎస్టీ విద్యార్థుల కొరకు రెసిడెన్షియల్ కళాశాలలను ఏర్పాటు చేయాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. గిరిజన ప్రాంతాల్లో చిన్న చిన్న జలవనరులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో మిని రిజర్వాయర్లు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి, ఇతర మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్దపీట వేయాలని తమరిద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. గిరిజన ప్రాంతాల్లో మిని రిజర్వాయర్లు, చెక్‌డ్యామ్‌లు చాలా ఉపయోగపడుతున్నాయి. కావున ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అధ్యక్షా, బోగస్ ఎస్టీ కుల ధృవీకరణకు సంబంధించి, యాక్ట్, 1968 చట్టం 1993వ సంవత్సరంలో అమలులోకి వచ్చింది. ఆ చట్టాన్ని కఠినతరం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. బోగస్ కులధృవీకరణ పత్రాలతో చాలామంది ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. తద్వారా గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. అంతేగాకుండా చట్ట సభల్లో ఎమ్మెల్యేలుగా, ఎం.పీలుగా కొనసాగుతున్నారు. చట్టసభల్లో బోగస్ కులధృవీకరణ పత్రాలతో కొనసాగిన చరిత్రలను మనం చూశాం. ఇప్పటికి ఆ సాంప్రదాయం కొనసాగుతూనే ఉండడం దురదృష్టకరమైన పరిణామం. మా పేరు చెప్పుకుని దొంగ కులధృవీకరణ పత్రాన్ని పొంది ఎన్నో ప్రయోజనాలను పొందుతున్నారు. ఆ చట్టాన్ని కఠినతరం చేయాలని కోరుతున్నాను.

వన సంరక్షణ చట్టాన్ని, పి.సా.చట్టాన్ని కఠినతరంగా అమలుచేయాల్సిన అవసరం ప్రభుత్వానికుంది. పకడ్బందిగా అమలు జరిగేలా ప్రణాళికను సిద్ధం చేయాల్సిన అవసరం ప్రభుత్వానికుంది. ముందుగా నేను తమరిద్వారా ప్రభుత్వానికి చెప్పుకున్నట్టుగా ఎస్టీ ఉప ప్రణాళిక చట్టంలో కొన్ని సవరణలు చేయాల్సి ఉంది. మాకు కేటాయించిన నిధులు డైవర్ట్‌కాకుండా గిరిజన సంక్షేమానికే ఆ నిధులు ఖర్చు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. రిజర్వేషన్ విధానంలో ముఖ్యంగా ఎస్టీ రోస్టర్ పాయింట్స్‌ను ప్రతి మూడు మాసాలకొకసారి బేరీజు వేసి ఎస్టీ ఉద్యోగులకు న్యాయపరంగా అందవల్సిన ప్రమోషన్లు గానీ, ఇతర వెసులుబాట్లు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. అందుకు గాను సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మరియు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నందలి డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారులు ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమై సమన్వయంతో రోస్టర్ పాయింట్స్ పైన చర్చించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఎస్టీ కమీషన్‌ను కూడా రాష్ట్రంలో సత్వరమే ఏర్పాటు చేయాలనే విషయాన్ని సభాముఖంగా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. గిరిజన యూనివర్సిటీని కూడా సత్వరమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని తమరి ద్వారా వేడుకుంటున్నాను. ఆ విషయంలో గౌరవ మంత్రి గారు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: Reply by the Minister. Minister for Social Welfare........

శ్రీ రావెల కిశోర్‌బాబు(ప్రత్తిపాడు): అధ్యక్షా..........

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి: సార్, ఎస్సీ మహిళలకు మాట్లాడే అవకాశం ఇవ్వండి.

MR.SPEAKER: Srikanth Reddy garu, please be seated. Minister for Social Welfare..........

శ్రీ రావెల కిశోర్‌బాబు (ప్రత్తిపాడు): అధ్యక్షా, చాలా కీలకమైన అంశం గురించి మాట్లాడే సమయానికి వచ్చాం. దయచేసి గౌరవ ప్రతిపక్షసభ్యులు సంయమనం పాటించి ఓపికతో చెప్పే విషయాలను వినాల్సిన అవసరముంది.

(ప్రతిపక్షపార్టీ సభ్యులు సర్వశ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి, కె. శ్రీనివాసులు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమా నాగిరెడ్డి, శ్రీమతి జి.చరితా రెడ్డి, శ్రీమతి ఉప్పులేటి కల్పన తదితరులు వారి స్థానాల్లో నుంచి లేచి పోడియం వద్దకు చేరి "మాట్లాడే అవకాశం కల్పించాలి" అంటూ నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కల్గించసాగారు)

MR.SPEAKER: No interruptions please. Please be seated.

శ్రీ రావెల కిశోర్‌బాబు (ప్రత్తిపాడు): అధ్యక్షా, చాలా ముఖ్యమైన విషయాలను ప్రభుత్వ పరంగా సభలో చెప్పేటప్పుడు వాళ్లు గమనించకపోతే వాళ్లకే నష్టం కాబట్టి దయచేసి గౌరవ సభ్యులు సభ సజావుగా జరగడానికి సహకరించాలి. దయచేసి గౌరవ ప్రతిపక్షసభ్యులు సంయమనం పాటించి ప్రభుత్వ పక్షంగా తాను చెప్పే మాటలను వినాల్సిందిగా తమరి ద్వారా వారిని కోరుతున్నాను.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

MR.SPEAKER: You can ask during clarifications. Please be seated.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

మినిస్టర్ గారు మాట్లాడండి.

శ్రీ రావెల కిశోర్‌బాబు (ప్రత్తిపాడు): అధ్యక్షా, బడ్జెట్‌కు సంబంధించిన రిప్లై ఇచ్చేముందు ఒక దురదృష్టకరమైన సంఘటన ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆ సంఘటన గురించి సభకు వివరించి, గౌరవ ప్రతిపక్షనాయకుడి ద్వారా వివరణ కోరాలని వారికి తమరిద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

నెల్లూరులో ఒక దళిత మహిళా ఉపాధ్యాయురాలు వై.ఎస్.ఆర్.సి.పి. కార్పొరేటర్ చేతిలో ఈనెల 11వ తారీఖున అత్యాచారానికి గురైంది.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

ఒక దళిత మహిళా టీచర్ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు విధులు నిర్వహిస్తోంది.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

MR. SPEAKER: You can ask during clarifications. Please resume your seats. Please be seated.

(Interruptions continued)

Do you want to disturb Srikanth Reddy garu?. Please resume your seats. Please be seated.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

శ్రీ రావెల కిశోర్‌బాబు (ప్రత్తిపాడు): నెల్లూరు జిల్లాకు చెందిన ఒక దళిత మహిళా టీచర్ వై.ఎస్.ఆర్.సి.పి. కార్పొరేటర్ చేతిలో అత్యాచారానికి గురైన సంఘటన వెలుగులోకి వచ్చింది. దాని మీద గౌరవ ప్రతిపక్షనాయకుడి వివరణ కోరవలసి ఉంది. నెల్లూరు జిల్లా, నెల్లూరు పట్టణానికి చెందిన అశోక్ అనే కార్పొరేటర్ ఈనెల 11వ తారీఖున ఒక మహిళా దళిత టీచర్ పైన అత్యాచారం చేశాడు. కేసు నమోదైంది.

MR SPEAKER: Please withdraw from the Well of the House. Please go back to your seats. Please be seated.

(Interruptions continued)

శ్రీ రావెల కిశోర్‌బాబు (ప్రత్తిపాడు): అధ్యక్షా, ఈ విధంగా వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులు రాష్ట్రంలో దారుణాలు చేస్తుంటే, హత్యలు, మహిళలపై అత్యాచారాలు చేస్తుంటే కనీసం విని వివరణ ఇవ్వడానికి కూడా ముందుకు రాకున్నారు. అంశాన్ని వివరించే అవకాశాన్ని కూడా ప్రతిపక్షం సభ్యులు ఇవ్వడం లేదు. నిజాలు బయటపడుతాయనే ఆందోళన ప్రతిపక్షసభ్యుల్లో స్పష్టంగా కనబడుతోంది. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, చేసిన లోపాలను కప్పిపుచ్చుకోవడానికి, అవినీతిని గానీ, దుర్మార్గాన్ని, దౌర్జన్యాన్ని గానీ, అత్యాచారాన్ని గానీ కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్షసభ్యులు చేసే ప్రయత్నం తప్ప మరొక ప్రయత్నం కాదు.

(ప్రతిపక్షసభ్యులు వెల్‌లో నిలబడి సభకు అంతరాయం కల్గించసాగారు)

బడ్జెట్ పైన చర్చ జరిగేటప్పుడు ముఖ్యంగా దళిత సంక్షేమానికి సంబంధించిన బడ్జెట్ పైన సభలో చర్చ జరిగే సమయంలో కనీసం వినడానికి కూడా ఓపిక లేకపోతే ప్రతిపక్షపార్టీ సభ్యులకు దళితులు పట్ల, వారి సంక్షేమం పట్ల వారికున్నటువంటి ప్రేమ ఎంతుందో, దళిత వ్యతిరేకత ఎంతుందో, దళిత అభివృద్ధికి, అభ్యున్నతికి, సంక్షేమానికి ఎంతగా వ్యతిరేకంగా ఉన్నారనేది ఈ పరిణామం ద్వారా అర్థమవుతోంది.

MR.SPEAKER: Now, you will miss the clarifications also. Please withdraw from the Well of the House. Please resume your seats.

(Interruptions continued)

Please carryon Minister garu.........

శ్రీ రావెల కిశోర్ బాబు (ప్రత్తిపాడు): అధ్యక్షా, ఎస్సీ బడ్జెట్‌కు 2014-15వ సంవత్సరానికి గాను మొత్తం రూ.2,956.94 కోట్లు కేటాయించడం జరిగింది. నాన్ ప్లాన్ క్రింద రూ.1,202.29 కోట్లు, ప్లాన్ క్రింద రూ.1,454.65 కోట్లు కేటాయించడం జరిగింది.

ఎస్టీలకు సంబంధించి 2014-15వ సంవత్సరానికి బడ్జెట్‌లో మొత్తం రూ.1,150.04 కోట్లు ప్లాన్ క్రింద, నాన్ ప్లాన్ క్రింద రూ.2,171.97 కోట్లు ట్రైబల్ సబ్ ప్లాన్ నిమిత్తం బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది.

అధ్యక్షా, మా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందనడానికి ఈ బడ్జెట్‌లో జరిగిన కేటాయింపులే నిదర్శనం. మా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి కట్టుబడి ఉంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను అమలు చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. గౌరవ శాసనసభ్యులు శ్రీ రాజన్నదొర గారు ఇందాక చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను రాష్ట్రంలో అమలుచేసే క్రమంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా, నిధులు దారి మళ్లించకుండా అన్ని చర్యలను తీసుకుంటామనే విషయాన్ని ప్రభుత్వపరంగా సభకు హామీ ఇస్తున్నాను. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయడంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గౌరవ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో చిత్తశుద్ధితో అమలుచేసి ఎస్సీ, ఎసీల సంక్షేమానికి మా ప్రభుత్వం పాటుపడేందుకు కృషి చేయడం జరుగుతుందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు సంబంధించినంత వరకు ఇంతవరకు నేను మూడు నోడల్ మీటింగ్స్‌ను నిర్వహించడం జరిగింది. చట్టంలో చాలా విప్లవాత్మకమైనటువంటి మార్పులకు శ్రీకారం చుడుతున్నాం. అదే విధంగా విప్లవాత్మకమైన నిర్ణయాలను మా ప్రభుత్వం తీసుకుంటోంది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ క్రింద ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి ఒక పైసా కూడా వృథా కాకుండా, దారి మళ్లించకుండా ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, అభివృద్ధికి వినియోగించడం జరుగుతుందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులపైన ఉంటుంది. అందుకు గాను మూడు ఇనిస్టిట్యూషన్స్‌ను మా ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. అందులో మొదటిది State Development Council ను గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో పటిష్టం చేయబోతున్నాం. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ మంత్రుల అధ్యక్షతన నోడల్ ఏజెన్సీని కూడా పటిష్టం చేయబోతున్నాం.

(ప్రతిపక్షసభ్యులు వెల్‌లో నిలబడి సభకు అంతరాయం కల్గించసాగారు)

ఎస్సీ, ఎస్టీలకు సంబధించిన ప్రతిఒక్క పైసా కూడా దారి మళ్లించకుండా, వృథాకాకుండా, వారి సంక్షేమానికి అభివృద్ధికి వినియోగిస్తాం. ప్రతి పైసా కూడా లెక్క చెప్పాల్సిన బాధ్యత అధికారుల మీద ఉంది. ఇందుకుగాను స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌ను గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో పటిష్టం చేయబోతున్నాము. సాంఘిక సంక్షేమ, మరియు గిరిజన సంక్షేమ మంత్రుల అధ్యక్షతన నోడల్ ఏజన్సీని పటిష్టం చేయబోతున్నాం. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు కోసం జిల్లాల్లో మానిటరింగ్ కమిటీస్ వేస్తున్నాం. ఈ

మానిటరింగ్ కమిటీస్‌లో అధికారేతరులు, ప్రజాప్రతినిధులు కూడా ఉంటారు. ప్రజాప్రతినిధులు జిల్లా కమిటీస్ మానిటరింగ్ ద్వారా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు, నిధులు ఖర్చు గురించి, పనితీరు గురించి వాటి ప్రభావం గురించి నిత్యం పర్యవేక్షణ చేయడానికి అన్నీ జిల్లాల్లో మానిటరింగ్ కమిటీస్‌ను వేస్తున్నాం. మంచి విషయాలను చెబుతున్నప్పుడు కనీసం విని హర్షించి వారు కూడా సంతోషం వ్యక్తంచేసి, అధికారపక్షంతోచేయి, చేయి కలిపి అభివృద్ధి సంక్షేమంలో పాలుపంచుకోవాలని తెలియజేస్తున్నాను.

(పోడియం ముందున్న ప్రధాన ప్రతిపక్ష సభ్యులు వెనుతిరిగి వారి, వారి స్థానాలకు వెళ్లి కూర్చున్నారు.)

ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్‌లో పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు రూ.209.83 కోట్లు, ట్యూషన్ ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు రూ.383.47కోట్లు, ఎస్సీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు రూ.26.10కోట్లు, 9వ తరగతి, 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు రాజీవ్ విద్యా దీవెన సెంట్రల్ స్కీమ్ ఉంది. ఇందుకు గాను రూ.25కోట్లు కేటాయించడం జరిగింది. హాస్టల్ భవనాల నిర్మాణాలకు రూ.519.79 కోట్లు కేటాయించడం జరిగింది. ఈరోజు రాష్ట్రంలో ఎందుకు ఇంత ఎక్కువగా కేటాయించాల్సి వచ్చిందంటే రాష్ట్రంలో ఉన్నటువంటి 1243 హాస్టల్స్ ఉన్నాయి. వీటికి సంబంధించి అనేక తనిఖీలు చేశాము. హాస్టల్స్ పనితీరు గతప్రభుత్వంలో సరిగా లేదు. గత ప్రభుత్వాలు వ్యవస్థలన్నింటినీ కుప్ప కూల్చాయి. ఆ వ్యవస్థలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించినంతవరకు హాస్టల్స్ పనితీరు వ్యవస్థ కూడా కుప్పకూలిపోయింది, చాలా దారుణంగా ఉంది. అందుకే మా గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాలేమనగా మూడు సంవత్సరాల కాలవ్యవధిలో అన్నీ హాస్టల్స్‌ను రెసిడెన్సియల్ స్కూల్‌గా మార్చి విద్యార్థులకు మంచి విద్య ఇవ్వాలనే సంకల్పంతో ఉన్నారు. ఈ రోజు ఎస్సీ విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. అలాంటి సామర్థ్యం ఉన్న వారు మనం అవకాశాలు కల్పిస్తే ఎవరెస్ట్ శిఖరాన్నే కాదు ప్రపంచాన్నే జయిస్తారు అనే ఆత్మవిశ్వాసాన్ని కల్పించాల్సిన బాధ్యత అవసరం మా మీద ఉంది. అందుకోసమే రూ.519కోట్లు హాస్టల్స్ నిర్మాణాలకు కేటాయించడం జరిగింది. ఇంతకు మునుపు గౌరవ శాసనసభ్యులు చెప్పిన విధంగా మన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విదేశాల్లో చదువుకోడానికి పెద్దఎత్తున అంబేద్కర్ ఓవర్‌సీస్ పథకాన్ని విస్తృతంగా ప్రచారంచేసి అత్యధిక సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను విదేశాల్లో చదివించేందుకు కృషిచేస్తాం. ఈ సందర్భంలో ఒక విషయాన్ని మనవి చేయదలచుకున్నాను. ఒకప్పుడు బరోడా మహారాజ్ (సాహు మహారాజ్) ఎవరైతే ఉన్నారో ఆయన ఇచ్చినటువంటి ఉపకారవేతనం (ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్) వల్ల డా.బిఆర్. అంబేద్కర్ కొలంబియా యూనివర్సిటీకి వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించి భారతదేశంలో అత్యున్నతమైన మేధా సంపత్తు కలిగిన వ్యక్తిగా, అపర వృద్ధులుగా, రాజ్యాంగ నిర్మాతగా, దళితుల హక్కుల కోసం పోరాడినటువంటి మహావ్యక్తిగా ఈ వేళ పూజిస్తున్నామంటే ఒకప్పుడు బరోడా మహారాజ్ (సాహు మహారాజు) గారు ఇచ్చినటువంటి

ఓవర్సీస్ వల్లనే. ఆ విధంగా మనం కూడా ఆ స్ఫూర్తితో, ఆ చైతన్యంతో నిబద్ధతతో మన ఎస్సీ విద్యార్థులను విదేశాల్లో చదివించడానికి నిధులు కేటాయించడం జరిగింది. ఎప్పుడు మాట్లాడినా రాజశేఖరరెడ్డి గారి గురించి మాట్లాడుతున్నారు అంటున్నారు. కానీ తప్పడం లేదు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ను నిర్వీర్యం చేశారు. వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకుండా చేసిన ఘనత గత వారి ప్రభుత్వంలోనే జరిగింది.

(ఈ దశలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ నుండి అభ్యంతరం )

కేంద్రప్రభుత్వం ఎన్ఎస్ఫ్డిసి కింద, నేషనల్ కర్మచార సఫాయి కార్పొరేషన్ కింద నిధులు ఇస్తుండగా ట్రైబల్ ఫైనాన్స్ కార్పోరేషన్ ద్వారా రుణాలు ఇస్తుండగా ఈ మూడు కార్పొరేషన్స్ ఇచ్చే రుణాలు మాకు వద్దు అని గత ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడం వలన వేలాదిమంది నిరుద్యోగ యువకులు ఉపాధిని కోల్పోయారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు కేంద్ర సాంఘిక సంక్షేమ మంత్రిగారిని కలిశారు. ట్రైబల్ వెల్ఫేర్ మంత్రిగారికి లేఖ రాశారు. ఈ మూడు కేంద్ర కార్పొరేషన్స్ ద్వారా వచ్చే రుణాలను పునరుద్ధరించాల్సిందిగా నిరుద్యోగ యువకులకు ఎకనమిక్ సపోర్ట్ ఇవ్వాల్సిందిగా కోరారు. వీటన్నింటిని రివైజ్ చేస్తాం. ఎస్టీలకు కూడా పెద్దఎత్తున నిధులు కేటాయించడం జరిగింది. రూ.1150కోట్లు ప్లాన్ బడ్జెట్లో ఉండగా నాన్ ప్లాన్ బడ్జెట్లో టిఎస్పీ కలిసి రూ.2171కోట్లు ఉంది.

గౌరవ శాసనసభ్యులు రాజేంద్రగారు చెప్పారు. అది వాస్తవమే. ఈ రోజు గిరిజన ప్రాంతంలో మంచినీళ్లు, రోడ్లు లేని ప్రాంతాలున్నాయి. హాస్పిటల్స్ లేని ప్రాంతాలు, కనీస అవసరాలు లేని గ్రామాలు చాలా ఉన్నాయి. వీటన్నింటికి కూడా తప్పకుండా ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రాజెక్టు, మిషన్స్ వంటి అనేక పథకాలు స్కీమ్స్ను పెద్దఎత్తున ఒక మిషన్ మోడ్లో చేస్తూ ముందుకు సాగుతోంది. డాక్టర్స్ సైతం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పోస్టింగ్స్ చేస్తే ముందుకు వచ్చి చేరడం లేదు. అందుకే ప్రతి ఒక్క డాక్టరు కోర్సు పూర్తి చేసికొన్న వెంటనే ప్రాక్టీస్ మొదలు పెట్టాలన్నా, ఉద్యోగంలో చేరాలన్నా వారు విధిగా కొంత కాలంపాటు గ్రామీణ, గిరిజన సుదూర ప్రాంతాల్లో పనిచేయాలనే నిబంధన పెట్టాలన్న ఆలోచనతో ఉన్నాం. తద్వారా ఆయా ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయి. అలా పనిచేస్తేనే మీకు అర్హత ఉంటుంది అని ఒక స్కీం తయారు చేస్తున్నాం. తద్వారా అక్కడ ఆరోగ్య పరిస్థితులు మెరుగు పడతాయి. గౌరవ శాసనసభ్యులు చెప్పినట్లుగా అక్కడ పనిచేయడానికి ఆయా డిపార్ట్మెంట్స్లో ఉన్నటువంటి వారు సుముఖంగా లేరు. వెనుకాడుతున్నారు. ఎందుకంటే అక్కడ సౌకర్యాలు ఉండవని అక్కడ వారి పిల్లలు చదువుకోడానికి స్కూల్స్ ఉండవని వెనుకాడుతున్నారు. అందుకుగాను వారికి మేము ప్రోత్సాహలు కల్పిస్తూ ఒక స్కీమ్ తయారు చేస్తున్నాం. మానిటరీ ఇన్సెంటీవ్స్, కెరీయర్ ఓరియంటెడ్ ఇన్సెంటీవ్స్. ఈ రెండు ఇన్సెంటీవ్స్ ద్వారా టీచర్స్

అంగన్‌వాడీ టీచర్స్, అధికారులు, డాక్టర్స్ గానీ ఇతరత్రా డిపార్ట్‌మెంట్ స్టాఫ్‌కు గానీ ఇన్‌సెంటివ్స్ ఇవ్వడం ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవిధంగా మేము అన్నీ చర్యలు తీసుకుంటాము. మరొక విషయం బాక్సైట్ విషయాన్ని గురించి అడిగారు. ఇంతవరకూ మేము అధికారికంగా బాక్సైట్ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. గిరిజన ప్రజలు ఎవరు కూడా దీని విషయంలో కంగారు పడాల్సిన పనిలేదు. గిరిజన ప్రజల సంస్కృతికి వ్యతిరేకంగా గానీ, గిరిజనుల మనోభావాలకు వ్యతిరేకంగా గానీ, వారి అభివృద్ధి సంక్షేమానికి వ్యతిరేకంగా ఏ ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదు. మా ప్రభుత్వం చిత్తశుద్ధితో దళితులు, గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెబుతూ, మీ వద్ద సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ ః మినిష్టర్ కొల్లు రవీంద్రగారు.

శ్రీ కొల్లు రవీంద్ర (మచిలీపట్నం)ః అధ్యక్షా అందరికి నమస్కారాలు మొట్టమొదట ఈ రాష్ట్రంలో బీసీల కోసం నిలబడింది ఒక్క ఎన్‌టి. రామారావు గారు. అన్న ఎన్‌టి.రామారావు గారు వచ్చిన తరువాతనే బీసీలకు అంటు ఒక గుర్తింపు వచ్చింది. బీసీలను ఆర్థికంగా సామాజకంగా రాజకీయంగా అభివృద్ధిలోకి తీసుకువచ్చిన ఘనత నందమూరి తారక రామారావు గారికి దక్కుతుంది. అలాగే సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది అన్న నందమూరి తారక రామారావు గారి కాలంలో తెలుగుదేశం పార్టీ. అలాగే ఈ రోజున పక్కాగృహాల నిర్మాణం జరిగినా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసినా అన్నీ చేసింది ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వమే. అలాగే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించింది అన్న నందమూరి తారక రామారావు గారే. ఆ ఘనత తెలుగు దేశం పార్టీకే దక్కుతుంది. అలాగే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అనేక కార్యక్రమాలు చేపట్టారు. అందులో ఒకటే ఆదరణ పథకం. ఎంతో మంది బీసీలకు పాధాన్యత కల్పించిన ఘనత చంద్రబాబునాయుడు గారికే దక్కుతుంది. అలాగే ఈ రోజున మొట్టమొదటగా ఈ రాష్ట్రంలో 100 మంది బిసీలకు శాసనసభలో టికెట్లు ఇస్తామని చెప్పిన ఘనత చంద్రబాబునాయుడు గారికి దక్కుతుంది. అత్యధిక మంది బీసీలను చట్టసభలకు పంపించిన ఘనత చంద్రబాబు నాయుడు గారికి దక్కుతుంది.

రాబోయే కాలంలో స్థానికసంస్థలలోనే కాక, చట్టసభల్లో కూడా బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని చెప్పిన పార్టీ తెలుగుదేశం పార్టీ, మరియు అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబునాయుడుగారేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. (ట్రెజరీ బెంచ్ నుంచి చప్పట్లు) అదేవిధంగా గౌరవ సభ్యులు శ్రీ కూన రవికుమార్‌గారు చెప్పినవన్నీ వాస్తవమే. వాటన్నిటికీ తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా చేనేత కార్మికుల గురించి సభ్యులు శ్రీమతి కె.ఆర్.రోజాగారు చెప్పారు. చేనేత కార్మికులకు అండగా నిలబడిన పార్టీ తెలుగుదేశం పార్టీ. తెలుగుదేశం పార్టీ అధికారంలో

ఉన్నప్పుడు ఎన్ని ఆత్మహత్యలు జరిగాయి? డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని ఆత్మహత్యలు జరిగాయి అనేది ఒకసారి ఆలోచించవలసిందిగా ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

రోశయ్యగారి కమిటీ సిఫార్సు చేసిన ఒక్క కార్యక్రమాన్ని కూడా గతంలో డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు అధికారంలో ఉన్నప్పుడు అమలుచేయలేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. రాబోయే రోజుల్లో బీసీల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేయాలనే ఉద్దేశంతో హాస్టళ్లకు దాదాపుగా రూ.371 కోట్లు, స్టడీ సర్కిల్స్‌కు రూ.25 కోట్లు, ప్రీ మెట్రిక్‌కి రూ.282.89 కోట్లు, గతంలో ఎప్పుడూ లేని విధంగా హాస్టళ్ల నిర్మాణం కోసం రూ.370 కోట్లను కేటాయించిన ఘనత తెలుగుదేశం పార్టీదే అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అదేవిధంగా బీసీలలో ఎక్కువ శాతం ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. ఈ బీసీలంతా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లకు దాదాపుగా రూ.300 కోట్లను మొట్టమొదటిసారిగా బడ్జెట్‌లో కేటాయించిన వ్యక్తి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. హర్షణీయం అని కూడా తెలియజేస్తున్నాను.

గతంలో ఎప్పుడూ లేని విధంగా కులాంతర వివాహాలను ప్రోత్సహించడానికి రూ.50లక్షలు, బ్రాహ్మణుల కోసం దాదాపు రూ.25కోట్లు బడ్జెట్‌లో కేటాయించిన ఘనత తెలుగుదేశం పార్టీదే అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. (ట్రెజరీ బెంచ్ నుంచి చప్పట్లు) అలాగే కాపు సోదరులలో చాలామంది వెనుకబడి ఉన్నారు. వారిని పైకి తీసుకురావాలనే ఉద్దేశంతో రూ.50కోట్లను ఈ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బడ్జెట్‌లో కేటాయించిన వ్యక్తి గౌరవ ముఖ్యమంత్రిగారేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా రజక ఫెడరేషన్‌కు రూ.70.50కోట్లు, నాయీ బ్రాహ్మణులకు రూ.120 కోట్లు, వడ్డెరలకు రూ.10 కోట్లు, ఉప్పరలకు రూ.10 కోట్లు, వాల్మీకికు రూ.10 కోట్లు. గతంలో ఫెడరేషన్స్‌కు నామమాత్రంగానే కేటాయించారు. మొట్టమొదటిసారిగా ఫెడరేషన్స్‌ను బలోపేతం చేయడం కోసం ఈరోజు బడ్జెట్‌లో కేటాయింపులు చేసిన ఘనత గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి నాయకత్వానికే దక్కుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అలాగే కృష్ణ బలిజకు రూ.10కోట్లు, బట్రాజుకు రూ.10కోట్లు, మేదరకు రూ.10 కోట్లు, సామాజిక సేవలకు రూ.10కోట్లు, విశ్వ బ్రాహ్మణులకు రూ.11కోట్లు, కుమ్మరి శాలివాహనకు రూ.21 కోట్లు కేటాయించడం జరిగింది.

రాబోయే రోజుల్లో సంక్షేమ కార్యక్రమాల కోసం కార్పోరేషన్‌లకు రూ.652కోట్లు, సంక్షేమ నిధి కింద రూ.2,400కోట్లు, మొత్తం కలిపి రూ.3,130కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించడం హర్షణీయమని తెలియజేస్తున్నాను. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రూ.4,000 కోట్లు ఇస్తే, మన వాటా కింద రూ.2,350కోట్లు మాత్రమే రావడం జరిగింది. కానీ, ఈరోజున మొట్టమొదటిగా బీసీల పక్షాన నిలబడిన పార్టీ తెలుగుదేశం పార్టీ. ఈ బడ్జెట్‌లో రూ.3,130కోట్లు కేటాయించడం గొప్ప కార్యక్రమమని, హర్షణీయమని తెలియజేస్తున్నాను. బీసీల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారని మరొక్కసారి మీకు తెలియజేస్తూ, ఈ బడ్జెట్‌ని ఆమోదించవలసిందిగా గౌరవ సభ్యులను కోరుతున్నాను.

MR. SPEAKER: Minister for Minority Welfare.

(వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు ఎస్.బి.అంజాద్‌బాషా గారితో పాటు మరికొంతమంది సభ్యులు వెల్‌లోకి వచ్చి మైనార్టీస్‌కి చెందిన సభ్యులు మాట్లాడటానికి అవకాశమివ్వాలని, క్లారిఫికేషన్ కోసమని గౌరవ సభాపతిని కోరడమైనది)

MR. SPEAKER: Please cooperate.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, ఈ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మొత్తం రాష్ట్ర జనాభాలో 9 శాతం ముస్లిం మైనార్టీలు ఉన్నారు. ఈ ముస్లిం మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి, విద్య కోసం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి సారథ్యంలో ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేస్తుందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

మైనార్టీల అభివృద్ధి కోసం ప్లాన్‌లో రూ.246,72,40,000 ప్రతిపాదించడమైంది. నాన్ ప్లాన్‌లో రూ.124,20,47,000 ప్రతిపాదించడమైంది. మొత్తం రూ.370,92,87,000 కేటాయించబడింది. ప్లాన్ మరియు నాన్ ప్లాన్‌లో మొత్తం నిధులు మైనార్టీల సంక్షేమంకోసం, అభివృద్ధి కోసం కేటాయించడం జరిగింది.

(వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు ఎస్.బి.అంజాద్‌బాషా గారితో పాటు మరికొంతమంది సభ్యులు వెల్‌లోకి వచ్చి మైనార్టీస్‌కి చెందిన సభ్యులు మాట్లాడటానికి అవకాశమివ్వాలని, క్లారిఫికేషన్ కోసం మాట్లాడతామని, మాకు ఇంత అన్యాయం ఎప్పుడూ జరగలేదని గౌరవ సభాపతికి విన్నవించారు)

MR. SPEAKER: You seek clarification. Now please be seated..

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి)ః ఏ వ్యవస్థ అయినా అభివృద్ధి చెందాలి అంటే తప్పకుండా విద్య ఉండాలి. ముస్లిం మైనార్టీలలో మరీ ముఖ్యంగా పేదవాళ్లల్లో చదువుకునే పిల్లలకు ఆర్థికంగా సహాయం చేయాలనే ఉద్దేశంతో ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను ఈ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. దీనికి గాను 2014-2015వ సంవత్సరానికి గాను ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు కేంద్ర ప్రభుత్వం రూ.40కోట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.15కోట్లు, నాన్ ప్లాన్‌లో 118.82కోట్లు, మొత్తం రూ.133.82 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించాము.

అదేవిధంగా పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు రూ.45కోట్లు ప్రతిపాదించడమైంది. ప్రతిభావంతులైన వాళ్లకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్స్ రూ.5కోట్లు. మొత్తం పోస్ట్-మెట్రిక్ మరియు ప్రీ-మెట్రిక్, ప్రతిభావంతుల స్కాలర్‌షిప్స్ (ప్లాన్, నాన్ ప్లాన్ మరియు మిగతా స్కాలర్‌షిప్‌లు కలిపితే) మొత్తం కలిపితే రూ.223,82,00,000.

ట్యూషన్ ఫీజులను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్‌కు రూ.80 కోట్లు. మొత్తం రూ.303,82,00,000లు. అంటే గత ప్రభుత్వంలో...

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

MR. SPEAKER: Do not interrupt.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి(పుట్టపర్తి) ః గత ప్రభుత్వంలో యునైటెడ్ ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు రూ.48కోట్లు ఖర్చు చేయడం జరిగింది. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు రూ. 287కోట్లు ఖర్చు చేయడం జరిగింది. సమైక్యాంధ్రప్రదేశ్‌లో రూ.335 కోట్లు మాత్రమే ఖర్చుపెడితే, రెసిడ్యుయరీ ఆంధ్రప్రదేశ్‌లో రూ.303.82 లక్షలు కేటాయించడం జరిగింది. దీనిని బట్టి చూస్తే, తెలుగుదేశం పార్టీకి ముస్లిం పేద విద్యార్థుల చదువుల పట్ల ఎంత ఆసక్తి ఉందో ఖచ్చితంగా అర్థమవుతుంది.

చదువుకోవాలంటే హాస్టల్ వసతి కావాలి. ఈ మైనార్టీ రెసిడెన్సియల్ స్కూల్స్‌కు, Residential Schools for Girls కు కలిపి 2014-2015వ సంవత్సరానికి గాను దాదాపు రూ.4.85 కోట్లు ప్రతిపాదించడం జరిగింది. అదేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉర్దూ భాషను ద్వితీయ అధికార భాషగా ప్రకటించడం జరిగింది. ఈ ఉర్దూ భాష అభివృద్ధికోసం,ప్రమోషన్లకు, ఉర్దూ అకడమిక్‌కు రూ.1.80లక్షలు ఇవ్వడమే గాకుండా, మైనార్టీ విద్యాభివృద్ధి కేంద్రం కోసం రూ.50లక్షలు, మొత్తం రూ.2.30కోట్లు ఇవ్వడం జరిగింది.

అదేవిధంగా, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఒక కార్పోరేషన్‌ను స్థాపించాలనే ఉద్దేశంతో స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావు గారు 1985వ సంవత్సరంలో ఈ మైనార్టీ కార్పోరేషన్‌ను స్థాపించారు. దీనికోసం 2014-2015వ సంవత్సరానికి గాను రూ.18.671 కోట్లు కేటాయించడం జరిగింది.

అదేవిధంగా ముస్లిం పేదలకోసం బ్యాంక్ లింకేజ్ ద్వారా బ్యాంకు సౌకర్యం కలిగించేందుకు మొత్తం పథకంలో 50 శాతం సబ్సిడీలోను ఇవ్వడమేగాకుండా, 40శాతం బ్యాంకు ఇస్తుంది, 10 శాతం మాత్రం లబ్దిదారులు చూసుకోవాలి. ఈ లబ్దిదారుల కోసం 2014-2015వ సంవత్సరానికి గాను రూ.10 కోట్లు కేటాయించడం జరిగింది.

అదేవిధంగా, క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ కోసం రూ.100లక్షలు కేటాయించడం జరిగింది. అదేవిధంగా హజ్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. హజ్ హౌస్ నిర్మాణం కోసం రూ.90 లక్షలు కేటాయించడమైనది. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు, వక్ఫ్ ఆస్తులు మరమ్మత్తుల కోసం రూ.200 లక్షలు కేటాయించడమైంది.

అదేవిధంగా షాదీఖానాలు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో వేల మసీదులు మరమ్మత్తులు చేయడమే కాకుండా, షాదీఖానాలు, ఉర్దూ ఘర్‌లు నిర్మించడం జరిగింది. షాదీఖానాల నిర్మాణాల గురించి గతంలో ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. శ్రీ నారాచంద్రబాబు నాయుడిగారి సహకారంతో ఈ ప్రభుత్వం షాదీఖానాలు, ఉర్దూ ఘర్‌లు నిర్మించడం కోసం రూ.5.25 కోట్లు కేటాయించడం జరిగింది.

గతంలో ఎప్పుడూ, ఏ రాష్ట్రంలో జరగనంతగా దాదాపు 65,000 ఎకరాలు వక్ఫ్‌బోర్డు భూములు ఉంటే, దాదాపు 25,000ఎకరాలు ఎన్‌క్రోచ్‌మెంట్ జరిగింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్‌బోర్డు భూములు పరిరక్షణ కోసం రూ.2 కోట్లను కేటాయించడం జరిగింది. తప్పు చేసినవారు ఏ స్థాయిలో ఉన్నా వారిని శిక్షించి, ఆస్తులను వెనుకకు తీసుకోవడం జరుగుతుంది.

ముస్లింల ఆస్తుల పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రోషిణి పథకం రూ.5కోట్లు ప్రపోజ్ చేశాం. అదేవిధంగా దూదేకులు, నూర్‌బా సొసైటీ కోసం రూ.75లక్షలు కేటాయించాం. ఏది ఏమైనా ముస్లిం మైనారిటీ అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం గౌరవనీయులు శ్రీ నారాచంద్రబాబునాయుడి గారి నాయకత్వంలో ఈ ప్రభుత్వం అన్నివిధాలా ప్రయత్నం చేస్తుంది. కాబట్టి, బడ్జెట్‌ను ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః ఉప్పులేటి కల్పన గారు.

శ్రీమతి ఉప్పులేటి కల్పన(పామర్రు) : నమస్కారం అధ్యక్షా, సంక్షేమ పథకాల గురించి చెప్పాలంటే, సంక్షేమ పథకాల గురించి మానవతా దృక్పథంతో ఆలోచించి, సంక్షేమ పథకాలకు సరైన అర్థం చెప్పిన మహానుభావుడు, దివంగత ముఖ్యమంత్రి గారు డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారని చెప్పడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు. సంక్షేమ పథకాల్లో ముఖ్యంగా చెప్పుకోవలసింది 'ఆరోగ్యశ్రీ'. ఈ పథకం ద్వారా దాదాపు 196రోగాలకు ఉచిత వైద్యం కల్పించడం ద్వారా లబ్ధిపొందిన వాళ్ళు ఎక్కువగా ఎస్సీలు, బీసీలు, మైనారిటీలే అని చెప్పడంలో ఏమాత్రం....

MR.SPEAKER: Ask only clarifications.

శ్రీమతి ఉప్పులేటి కల్పన (పామర్రు): అలాగే అధ్యక్షా. ఎస్సీ సంక్షేమ మంత్రివర్యులు మాట్లాడుతూ, మన రాష్ట్రంలో 17.1శాతం ఎస్సీ జనాభా ఉందని చెప్పారు. దాని ప్రకారం రూ.4534 కోట్లు కేటాయించాల్సి ఉంది. కానీ, ప్రణాళిక బడ్జెట్‌లో రూ.2657కోట్లు కేటాయించారు. అదేవిధంగా ఎస్టీ జనాభా 5.33శాతం ఉన్నారు చెప్పారు. దాని ప్రకారం రూ.1421 కోట్లు కేటాయించాల్సి ఉండగా, రూ.1151 కోట్లు మాత్రమే కేటాయించారు.

అదేవిధంగా, ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు ఇవ్వాల్సిన రుణాలు సక్రమంగా అమలు చేస్తామని చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రుణాలు మంజూరు చేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇప్పటికి 6,7 నెలలయ్యింది....

MR.SPEAKER: No speech. Ask only clarifications.

శ్రీమతి ఉప్పులేటి కల్పన (పామర్రు): ...అందుకు కారణం ప్రభుత్వం వారికి రావలసిన సబ్సిడీని మంజూరు చేయకపోవడమే. అవి ఎప్పుడు శాంక్షన్ (బెల్) చెస్తారో గౌరవ మంత్రి గారిని కోరుతున్నాము.

అదేవిధంగా గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ, 100మంది బీ.సీ.లకు సీట్లిచ్చిన ఖ్యాతి తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని అన్నారు. మరి మా వై.ఎస్.విజయమ్మగారు 100 మంది బీసీలను ఈ శాసనసభలో కూర్చోబెడదామనీ, అందుకు అన్ని పార్టీలు కూడా బీ.సీ.లకు సీట్లిస్తే వందమంది ఈ శాసనసభకు వస్తారని ఆనాడే కోరారు. మరి ఈ ఖ్యాతి శ్రీమతి వై.ఎస్.విజయమ్మ గారికి దక్కాల్సివుంది. (మైకు కట్ చేయబడింది.)

(వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరం తెలియజేశారు.)

(వైఎస్సార్‌సీపీ సభ్యులు శ్రీ జలీల్ ఖాన్ తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని గౌరవ సభాపతి గారిని కోరారు.)

MR.SPEAKER: Yes. please. No speech. Ask only clarification.

శ్రీ జలీల్ ఖాన్ (విజయవాడ-వెస్ట్) : అధ్యక్షా, మైనారిటీ వెల్ఫేర్ డిమాండ్స్ గురించి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు ముందుగా తమకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటూ, నా తోటి శాసనసభ్యులకు కూడా నా ధన్యవాదములు తెలుపుకుంటున్నాను.

అధ్యక్షా, మనకు స్వాతంత్ర్యం వచ్చి 66సంవత్సరాలైంది. కానీ, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మైనార్టీలను కేవలం ఒక ఓటు బ్యాంకులుగానే అన్ని పార్టీలు కూడా ఉపయోగించుకోవడం జరిగింది. కేవలం, మా దివంగత నేత డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు మాత్రమే, ఆనాటి తమ సుదీర్ఘ పాదయాత్ర సందర్భంలో, (బెల్) మైనార్టీలు బాగా వెనకబడిపోయి ఉన్నారు అని గ్రహించి, మైనార్టీలకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తామని వాగ్దానం చేయడం జరిగింది. ఆ తరువాత ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తరువాత ముస్లింలకు 5శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగింది. (బెల్) కానీ, కొన్ని అనివార్య కారణాలవల్ల, ఆ ఐదు శాతాన్ని 4శాతంగా కుదించడం జరిగింది. కానీ, ఆ 4శాతం రిజర్వేషన్లతోనే, పేద విద్యార్థులు ఎంతో ఉన్నత విద్యను అభ్యసించడం జరిగింది. (మైకు కట్ చేయబడింది.)

(వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరం తెలియజేశారు.)

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ గారు.

శ్రీ రావెల కిశోర్‌బాబు(ప్రత్తిపాడు): అధ్యక్షా, గౌరవ శాసనసభ్యురాలు శ్రీమతి ఉప్పులేటి కల్పన గారు మాట్లాడుతూ అడిగిన క్లారిఫికేషన్స్‌కి సమాధానం ఇస్తున్నాను. ఎస్సీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.4574.47 కోట్లు కేటాయించడం జరిగింది. అదేవిధంగా జనాభా ప్రాతిపదికన ఎస్టీల కోసం కూడా రూ.2191.97 కోట్లు కేటాయించడంజరిగింది. (బెల్)

(వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరం తెలియజేయసాగారు.)

(వైఎస్సార్‌సీపీ సభ్యులు శ్రీ పి. అనిల్‌కుమార్ గారు 'మైనార్టీలకు గౌరవ ముఖ్యమంత్రిగారు సమాధానం చెప్పవలసిన అవసరముంది' అని పదే పదే అనసాగారు.)

MR.SPEAKER: Minister garu, please be brief.

శ్రీ రావెల కిశోర్‌బాబు (ప్రత్తిపాడు)ః ఎస్సీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయించిన రూ.4574.47కోట్లలో రూ.2657 కోట్లు ప్రణాళికా బడ్జెట్‌లోనూ, రూ.1817 కోట్లు ప్రణాళికేతర బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. అందువల్ల గౌరవ శాసనసభ్యురాలు గమనించలేదనుకుంటా. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి...

(వైఎస్సార్‌సీపీ సభ్యులు శ్రీ పి. అనిల్‌కుమార్ గారు 'మైనార్టీలకు గౌరవ ముఖ్యమంత్రిగారు సమాధానం చెప్పవలసిన అవసరముంది' అని పదే పదే అనసాగారు.)

MR.SPEAKER: Minister garu, please be brief.

శ్రీ రావెల కిశోర్‌బాబు (ప్రత్తిపాడు)ః ఒక్క నిముషం, అధ్యక్షా. 2013-14 సంవత్సరంలో కేవలం రూ.18 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. కేంద్రం నుండి వచ్చే రుణాలను కూడా తీసుకోలేదు. ఈ విషయాన్ని, గౌరవ శాసనసభ్యులు ఉప్పులేటి కల్పన గారు గమనించాలి. ఈ సంవత్సరం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరుకు పెద్ద ఎత్తున, ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.466 కోట్లు కేటాయించారు. ఇది చరిత్రలో, రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి కూడా ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించన సందర్భం లేదు. గత ప్రభుత్వాలు చేసినటువంటి తప్పులు, అవినీతి, దుర్మార్గం ... ఈ ఎస్సీ, ఎస్టీ నిధులను మళ్ళించి, పేదవాళ్ళ కడుపుగొట్టి, వాళ్ళ రక్తం తాగి, (బెల్) వాళ్ళ శ్రమను దోచుకొని, వాళ్ళని దోపిడీ చేశారు. ఆవిధంగా మేము చేయము. చిత్తశుద్ధితో అభివృద్ధికి సంక్షేమానికి మేము పాటుపడతాం.

(గౌరవ ప్రతిపక్ష నాయకులు శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారు తమకు మాట్లాడే అవకాశాం ఇవ్వాల్సిందిగా గౌరవ సభాపతి గారిని కోరారు.)

మిస్టర్ స్పీకర్ః జగన్‌మోహన్ రెడ్డి గారు.

శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి (పులివెందుల)ః అధ్యక్షా, మా మైనారిటీ సభ్యుడు మాట్లాడడానికి ఐదంటే ఐదు నిముషాల సమయం కోరారు. ఆయన అంతగా అడుగుతూ ఉన్నారు, కాబట్టి ఐదు నిముషాల సమయమివ్వండి. ఆయన క్లారిఫికేషన్ అడుగుతూ ఉన్నారు.

MR.SPEAKER: He is giving speech, but only clarifications is allowed.

శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి (పులివెందుల) : క్లారిఫికేషనే అధ్యక్షా, ఆయన అడిగేది క్లారిఫికేషనే. ఐదు నిముషాల సమయం ఆయనకు ఇచ్చేందుకు ఇంతలా చేస్తే ఎలా అధ్యక్షా. (మైకు కట్ చేయబడింది.)

మిస్టర్ స్పీకర్: సుజాత గారు.... (శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారినుద్దేశించి) please be seated.

శ్రీమతి పీతల సుజాత (చింతలపూడి) : అధ్యక్షా, నామీద ఎంతో నమ్మకముంచి, నాకు ఈ Women & Child Welfare, Disables, Senior Citizens మంత్రి పదవి ఇచ్చినందుకు గౌరవనీయులు, పూజ్యులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి ముందుగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈ శాఖను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని, మహిళల సంక్షేమం కోసం, ఛైల్డ్, డిజేబుల్డ్ వెల్ఫేర్ కోసం, సీనియర్ సిటిజన్స్ కోసం, మరియు వారికి మెరుగైన ఫలితాలు అందించాలన్న ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ శాఖకు డిమాండ్ నెం.XXV(25) క్రింద రూ.1131,97,20,000లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా, ఈ శాఖను పటిష్ట పరచేందుకు మాకు ఎన్నో ప్రణాళికలు చెప్పడంజరిగింది. ముఖ్యంగా, నేను కూడా జిల్లాల వారీగా పర్యటనలు చేస్తున్నాను.

అదేవిధంగా, గతంలో చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శాంతి భద్రతలు చాలా బాగుండేవి. అప్పుడు మహిళలు చాలా ధైర్యంగా ఉండేవారు. చిన్న పిల్లల నుంచి, పెద్ద వారి వరకు చాలా సంతోషంగా ఉండేవారు.

గత 10 సంవత్సరాలలో శాంతిభద్రతలు ఎంత నిర్వీర్యం అయ్యాయో మనం చూశాం. శ్రీ చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉంటే మహిళల జీవితాలు బాగుపడతాయని, మనందరికీ అండగా ఉంటారనే ధైర్యంతో వారిని ముఖ్యమంత్రిని చేసిన ఘనత మా మహిళలదే.

అదే విధంగా వికలాంగుల సంక్షేమానికి, వృద్ధులకు, పిల్లల సంరక్షణకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు సరిపోకపోతే గౌరవ ఆర్థికమంత్రి గారి సహాయసహకారాలతో గౌరవ ముఖ్యమంత్రి గారి ఆమోదంతో గ్రాంట్స్ ఎక్కువగా పెట్టి ఆయా శాఖలను బలపరుస్తామని సభాముఖంగా తెలియజేస్తున్నాను. గౌరవసభ్యులు చెప్పిన విషయాలను పరిశీలించి, జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రజల సహాయసహకారాలతో మా శాఖను బలపరచి మెరుగైన ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తామని తెలియజేస్తూ, ఈ డిమాండును సభ ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

(ప్రతిపక్ష సభ్యుల నుంచి సభకు అంతరాయం)

MR. SPEAKER: Please be seated.

శ్రీమతి గౌరు చరితారెడ్డి (పన్యం): అధ్యక్షా, డ్వాక్రా రుణాల మొత్తం రూ.14,000 కోట్లు ఉన్నాయి. అ రుణాలన్నీ మాఫీ చేయాలని మా పార్టీ తరపున కోరుతున్నాం. రూ.100 సబ్సిడీతో ఆధార్ కార్డుకు అనుసంధానం లేకుండా ఏడాదికి 12 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. దీనికి బడ్జెట్‌లో ఎంత కేటాయించారు? ఆధార్ కార్డుతో లింక్ లేకుండా ఇస్తున్నారా, ఈ సౌకర్యం ఉందా, లేదా అనేది తెలియజేయాలని కోరుతున్నాం.

శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పావలా వడ్డీకి రుణాలు ఇచ్చి మహిళలను లక్షాధికారులు చేశారు.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలి. అంగన్‌వాడీ వర్కర్ల, ఆయాల వేతనాలు పెంచుతామన్నారు. అవి ఎంత పెంచుతారో చెప్పాలి. అంగన్‌వాడీ కేంద్రాలలో చాలా పోస్టులు ఖాళీ ఉన్నాయి. వాటన్నింటినీ భర్తీ చేయాలని కోరుతున్నాం. ఒక్కొక్క సంఘానికి లక్ష రూపాయలు మాత్రమే మాఫీ చేస్తామంటున్నారు. అలా కాకుండా డ్వాక్రా రుణాలు మొత్తం రూ.14,000 కోట్లు మాఫీ చేయాలని కోరుతున్నాం.

మహిళల రక్షణ కోసం, ఆటో డ్రైవర్లు, సిటీ బస్‌లలో కండక్టర్లుగా మహిళలను నియమిస్తామన్నారు. దీనిపై ఏ చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయవలసిందిగా కోరుతున్నాం.(బెల్)

శ్రీమతి పీతల సుజాత (చింతలపూడి): గత ప్రభుత్వం పావలావడ్డీ పథకం పెట్టారు కానీ, మహిళలను లక్షాధికారులు కాదు కదా భిక్షాధికారులను చేశారు.

(అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మహిళలను లక్షాధికారులు కాదు, కోటీశ్వరులను చేయాలననే ఆలోచనలో ఉన్నారు. వారి కాళ్లపై వారు నిలబడాలని, స్వయంశక్తితో పైకి రావాలని, మగవారితో ధీటుగా ఆడవారు కూడా ముందుండాలని, వారి కుటుంబాన్ని పోషించుకోవాలని, కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాములో ఇసుక మాఫీయా చేసిన వారికి

అవకాశమివ్వకుండా మహిళలైతే నిబద్ధతతో, నిజాయితీగా పనిచేస్తారని 25 శాతం వారికే కేటాయించాలనే బృహత్తర నిర్ణయం తీసుకున్నారు. ఇది దేశ చరిత్రలో ఎవరూ చేయని సాహసం. మేము ఇది సాధిస్తామని మహిళలు దీవించి మమ్ములను అధికారపక్షంలో, మీపై (ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) నమ్మకం లేదని మిమ్ములను ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు.

అంగన్‌వాడీ వర్కర్స్ వేతనాల గురించి ప్రభుత్వ పరిశీలనలో ఉంది, తగిన చర్యలు తీసుకుంటాం. అదే విధంగా పోస్టులు భర్తీ చేయాలని అడిగారు. త్వరలోనే కొన్ని ఔట్‌సోర్సింగ్ పోస్టులు భర్తీ చేస్తాం. మహిళల రక్షణ కోసం కూడా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటాం.

**MR. SPEAKER: The question is:**

**"That the Government be granted a sum not exceeding Rs. 808,29,18,000/- under Demand No. XVIII (18) - Housing."**

**"That the Government be granted a sum not exceeding Rs. 2656,94,66,000/- under Demand No. XXI (21)- Social Welfare."**

**"That the Government be granted a sum not exceeding Rs. 1150,03,84,000/- under Demand No. XXII (22)- Tribal Welfare.**

**"That the Government be granted a sum not exceeding Rs. 3130,24,68,000/- under Demand No. XXIII (23)- Backward Classes Welfare.**

**"That the Government be granted a sum not exceeding Rs. 370,92,87,000/- under Demand No. XXIV (24)- Minority Welfare.**

**"That the Government be granted a sum not exceeding Rs. 1131,97,26,000/- under Demand No. XXV (25)- Women, Child and Disabled Welfare."**

**(Pause)**

**The motion was adopted and the Demands were granted.**

MR. SPEAKER: The House stands adjourned to meet again on Monday i.e., 01.09.2014 at 9.00 a.m.

**(Then the House adjourned at 02.07 p.m. to meet again at 9.00 a.m. on Monday, the 1st September, 2014)**